# Deccan
# Deccan Land




# June | JUN 2021

జూన్ - 2021

DECCAN LAND, HYDERABAD

106

₹30

# దక్కన్ ల్యాండ్

సామాజిక రాజకీయ మాసపత్రిక





* కులవృత్తుల నైపుణ్యం ప్రగతికి సోపానం
* ప్రకృతి మనల్ని ఈ సృష్టినుంచి తొలగిస్తుందా?
* ప్రఖ్యాత వైరాలజిస్టు పీటర్ పయట్
* ఆవరణ వ్యవస్థల పునరుద్ధరణ



# దక్కన్ ల్యాండ్ ఎనిమిది సంవత్సరాల ప్రస్థానం...
















తెలంగాణ ఉద్యమ కాలంలో ఆవిర్భవించిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక 2020 డిసెంబర్ సంచికతో 100 నెలలు పూర్తి చేసుకుంది. ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో తెలంగాణ భావజాలాన్ని వ్యాప్తిచేసి, పునర్నిర్మాణ అవసరాన్ని చాటి చెప్పేందుకు 'దక్కన్‌ల్యాండ్' కృషి చేసింది. ఇప్పటి వరకు వెలువడిన సంచికలను 12 నెలలకు ఒక సంపుటిగా (2012, 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020) రూపొందించి పాఠకుల కోరిక మేరకు అందిస్తున్నాం. భవిష్యత్తులో వచ్చే సంచికలను కూడా ఇదేవిధంగా తీసుకువస్తామని తెలియజేస్తున్నాం. ఆసక్తికలవారు ఒక్కో సంపుటిని రూ.400/-లకు పొందవచ్చు (పార్శిల్ ఛార్జీలు అదనం). 'ఐఎస్ఎస్ఎన్' ఆమోదం పొందిన 'దక్కన్‌ల్యాండ్' మాసపత్రిక పట్ల చూపుతున్న ఆదరణకు ధన్యవాదాలు.













**సంకలనాలు పొందేందుకు మా చిరునామా:**

ఎడిటర్, 'దక్కన్‌ల్యాండ్'
3-6-712/2, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్,
హైదరాబాదు-500029, తెలంగాణ
మొబైల్: 9030626288

Email: desk.deccan@gmail.com
Website: www.deccanland.com

**ఆన్‌లైన్ ద్వారా చెల్లింపుకోసం:**

NAME : DECCAN LAND
BANK : KOTAKMAHINDRABANK
ACCOUNT NO : 7111218829
IFSC CODE : KKBK0000555
BANK CODE : 000555
MICR CODE : 500485007




## ముత్యాలు

డెక్కన్ పీఠభూమి యొక్క గుండె, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చాలా కాలం నుండి 'ముత్యాల నగరం'గా పేరు సంపాదించింది. అద్భుతమైన ముత్యాలను ఉపయోగించి తయారు చేసిన వివిధ రకాల ఆభరణాలకు పేరెన్నికగన్నది. ముత్యాల వ్యాపారాన్ని నిజాం మరియు కుతుబ్ షాహి పాలకులు బాగా ప్రోత్సహించారు. వీరు మెరిసే ఆభరణాల పట్ల చాలా అనుబంధాన్ని కలిగి ఉండేవారు. రాజులు, రాణులు వారి వస్త్రాలపై ముత్యాలను అలంకరించు కునేవారు. ముత్యాలను చూర్ణం (పొడి) చేసి, వారి శారీరక సౌందర్యాన్ని పెంచడానికి సమయోచితంగా ఉపయోగించారు. రాయల్స్ నేతృత్వంలోని సంపన్న జీవన విధానం వల్ల ప్రపంచం నలుమూలల నుండి హస్తకళా కారుల ప్రవాహం ఏర్పడింది. వీరు నాణ్యమైన ముత్యాల ఆభరణాలను తయారు చేయడంలో అనేక కుటుంబాలు పర్షియాలోని బాస్రా నుండి హైదరాబాద్‌కు శతాబ్దాల క్రితం వలస వచ్చాయి.

TELANGANA
RESOURCE CENTRE

"**CHANDRAM**" 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
Fax: 040-27635644Mobile: 9030626288
E-mail: desk.deccan@gmail.com    website : www.deccanland.com







## పరిపాలనాధికారే క్రీడాకారుడు

మే నెలలో ప్రచురించిన గులాం అహ్మద్ వ్యాసం చాలా బాగుంది. 1922 జులై 4న హైదరాబాద్‌లో జన్మించిన గులాం అహ్మద్ హైస్కూల్ చదువు ముగియగానే క్రీడలపట్ల మక్కువతో నిజాం కళాశాలలో చదువుతూ క్రికెట్‌లో స్పిన్ బౌలింగ్ ప్రతిభ నేర్చుకుని 17 సంవత్సరాల వయస్సులోనే తొలి రంజీట్రోఫీ మ్యాచ్‌ను అప్పటి మద్రాసు జట్టుతో 1939 డిసెంబర్ 1న ఆడారు. వీరు ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లల్లో 407 వికెట్లు తీసి, బ్యాటింగ్‌లోనూ 1,379 పరుగుల సాధించడం గమనార్హం. వీరి అత్యధిక స్కోరు 90 పరుగులు. వీరు ఐఏఎస్ అధికారి కావడంతో ప్రభుత్వంలో ఉన్నత అధికారి, సెక్రటరీ హోదాలో పని చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, భారత క్రికెట్ బోర్డులో వివిధ హోదాల్లో పనిచేసి బోర్డును చక్కదిద్దారు. క్రికెట్ రంగంలోను, అటు ప్రభుత్వ పరిపాలనాదక్షుడిగా ఎంతో సేవ చేశారు. అటువంటి వీరు 78 సంవత్సరాల వయస్సులో మరణించడం చాలా బాధాకరమైన విషయం. మంచి క్రీడాకారుడు, పరిపాలనా అధికారిని పరిచయం చేసిన రచయిత్రి భాను శ్రీదేవికి, దక్కన్ ల్యాండ్ పత్రికకు ప్రత్యేక ధన్యవాదాలు.

**– ఖాజా హుస్సేన్,** హైదరాబాద్

❖ ❖ ❖

## అత్యవసర ఆరోగ్య పరిస్థితి

సమసిపోతుందనుకున్న కరోనా సమస్య మళ్లీ మొదటికొచ్చింది. సెకండ్ వేవ్ మరింత ఉధృతంగా వచ్చింది. అంతకు ముందెన్నడూ లేనంతగా రోజుకు మూడు లక్షలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. సెకండ్ వేవ్ గురించి మొదటి నుంచి పర్యావరణ శాస్త్రవేత్తలు, సామాజిక పరిశీలకులు హెచ్చరించారు. దక్కన్ ల్యాండ్ మాసపత్రిక మరొకసారి ఎడిటోరియల్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాల్సిన విధానాలను, ప్రజలు పాటించవల్సిన జాగరూకతలను తెలియ జేసినందుకు కృతజ్ఞతలు.

**–యం. భాస్కర్‌రావు,** సంగారెడ్డి

## గతం గతః జేబీఎస్ హాల్డేన్

జీవితంలో పొందలేకపోయిన వాటి గురించి చాలా మంది విచారిస్తూ, సాధించలేకపోయిన వాటిని పదే పదే తలచుకుని దిగులు చెందుతూ ఉంటారు. గతం గుర్తు చేసుకుని బాధను దిగమింగు కుంటూ కూడా కొందరు ఉంటారు. అలాంటి వారు ఎప్పుడైనా శాస్త్రవేత్తల గురించి, సైన్సు రచనలు చేసే వారి గురించి కొద్దిగా చదివితే ఊరట పొందవచ్చునని పాపులర్ సైన్సు రచనలతో ఎంతో పేరు ప్రఖ్యాతి పొందిన శాస్త్రవేత్త జేబీఎస్ హాల్డేన్‌ను చదివినప్పుడు చాలా విషయాలు మటుమాయమై పోతాయి. జీవితానికి కావలసింది తిండి, నీరు, బట్టలు, ఆవాసం అని తేల్చి చెప్పారు. ఇందు కోసం మొట్టమొదట పని కావాలంటాడు. ఆ పనికి గౌరవ ప్రదమైన వేతనం అవసరమంటాడు. జీవితంలో పని తరువాత స్వేచ్ఛ అవసరమంటాడు. భావప్రకటనా స్వేచ్ఛను కోరుకుంటారు. స్వేచ్ఛ తరువాత ఆరోగ్యం కావాలంటాడు. పని చేసే స్థితిలో లేనప్పుడు మరణించటం పెద్ద విషయమేమీ కాదంటాడు. దీన్ని బట్టి వారికి పనిపట్ల ఉన్న నిబద్ధతను సూచిస్తుంది. ఇలా పని, ఆహారం, స్వేచ్ఛ, ఆరోగ్యం, స్నేహం వీరు ఆశించినవి. వీరిని పరిచయం చేసిన రచయిత డా॥ ఆర్. సీతా రామారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు.

**– డి. శ్రీకాంత్,** కడప

❖ ❖ ❖

## అంగారకుడిపై మానవుని మమకారం!!

రచయిత పుట్టా పెద్ద ఓబులేసు అందించిన ఈ వ్యాసం మా లాంటి విద్యార్థులకు చాలా ఉపయోగపడుతుంది. యూఏఈ మొట్టమొదటి మార్స్ మిషన్‌ను పంపి ఘనత సాధించిన 5వ దేశంగా చరిత్ర సృష్టించింది. హోప్ గురించి, చైనా తొలి అంగారక యాత్ర, టియాన్ వెన్, మిషన్ ప్రధాన లక్ష్యం, అమెరికా పర్సీవరెన్స్, పర్సీవరెన్స్‌లోని భాగాలు, కీలక ప్రదేశంలో దిగిన పర్సీవరెన్స్ మొదలైన వాటి గురించి చాలా చక్కగా విశ్లేషించారు. అంగారకుడిపైకి ఎలన్ మస్క్ స్టార్‌షిప్, పర్సీవరెన్స్ మిషన్ ప్రధాన ఉద్దేశ్యం, ప్రయోజనాలు ఇలా ప్రతి ఒక్క అంశం గురించి వివరించారు. పర్సీవరెన్స్‌రోవర్‌ను 28 మైళ్ళ వ్యాసమున్న జెజిరో బిలంలో సురక్షితంగా దించిన శాస్త్రజ్ఞుల బృందంలో భారత్‌కు చెందిన డాక్టర్ స్వాతీ మోహన్ ఉండడం భారతీయులకు గర్వకారణం.

**– ఎ. వెంకట సృజన్,** హైదరాబాద్

ద

## పరిశోధకులకు శుభవార్త దక్కన్ ల్యాండ్‌కు ISSN ఆమోదం

**దక్కన్ ల్యాండ్ మాసపత్రిక** ISSN (International Standard Serial Number) **ఆమోదం పొందినదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం. మా** ISSN **2581-3188. ప్రముఖ, ఔత్సాహిక, పరిశోధకులు తమ పరిశోధనాత్మక, విశ్లేషణాత్మక రచనలను ప్రచురింప జేసి వినియోగించుకోవడం ద్వారా ప్రాచుర్యం చేసుకోవడానికి ఈ సదవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరుతున్నాం.**

**రచయితలు తమ రచనలను పంపవలసిన చిరునామా :**
**"చంద్రం"** 3-6-712/2, St.No. 12, Himayatnagar,
Hyderabad - 500 029 Telangana.
**సంప్రదించవల్సిన ఆఫీస్ ఫోన్ : 9030626288**
E-mail: desk.deccan@gmail.com
website: www.deccanland.com

- ఎడిటర్

ISSN 2581-3188

విషయసూచిక


# దక్కన్ ల్యాండ్

సామాజిక, రాజకీయ మాసపత్రిక

సంపుటి: 9 సంచిక : 10 పేజీలు : 60

జూన్ - 2021


# లోపలి పేజీల్లో...




సంపాదకులు

**మణికొండ వేదకుమార్**

9848044713

editordeccan@gmail.com

సహాయ సంపాదకులు

**కట్టా ప్రభాకర్**

సర్క్యులేషన్

**హెచ్. మోహన్‌లాల్**

వాణిజ్య ప్రకటనలు

**సయ్యద్ ఖైజర్ భాష**

9030626288

ఫొటోగ్రాఫర్

**టి.స్వామి**

8374995555

కవర్‌పేజీ

**ముత్యాలు**

చిత్రాలు

**కూరెళ్ల శ్రీనివాస్**



layout & composing @

CHARITHA IMPRESSIONS

printed @ DECCAN PRESS

ఆజామాబాద్, హైదరాబాద్-500 020.

కార్యాలయ చిరునామా

TELANGANA RESOURCE CENTRE

DECCAN LAND

"CHANDRAM" 3-6-712/2, St.No. 12,

Himayatnagar, Hyderabad - 500 029

TELANGANA

Mobile: 9030626288 Fax: 040-27635644

E-mail: desk.deccan@gmail.com

website : www.deccanland.com



తోటపల్లి సుబ్రహ్మణ్యం ........ జి. వెంకట రామారావు ........ 6

ప్రకృతితో చెలిమి చేద్దాం..... (ఎడిటోరియల్) ........ ఎం. వేదకుమార్ ........ 7

బ్రిటీష్ సైన్యాన్ని ఓడించిన ప్రిన్స్ ముబారిజుద్దౌలా! ........ సంగిశెట్టి శ్రీనివాస్ ........ 9

నా 'మాల్గుడి డేస్' అలియాబాద్ దర్వాజా ........ పరవస్తు లోకేశ్వర్ ........ 11

ప్రకృతి మనల్ని ఈ సృష్టి నుంచి తొలగించే ప్రయత్నం? ........ ప్రీతాజీ ........ 14

ఆవరణ వ్యవస్థల పునరుద్ధరణ - అవగాహన చైతన్యం ........ డా॥ ఆర్. సీతారామారావు ........ 15

చిన్నారులను కాటేస్తున్న కరోనా ........ డెస్క్........ 18

విరియాల కామవసాని గూడూరు ........ ఈమని శివనాగిరెడ్డి ........ 19

నిర్మల్‌లో ఫిరంగీల తయారి కేంద్రాలు ........ తుమ్మల దేవరావ్ ........ 23

పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యం ........ ఎసికె. శ్రీహరి ........ 25

కులవృత్తుల నైపుణ్యం ప్రగతికి సోపానం ........ కట్టా ప్రభాకర్ ........ 27

ముత్యాలకు కేరాఫ్ హైదరాబాద్ ........ సువేగా ........ 37

ప్రఖ్యాత వైరాలజిస్టు పీటర్ పయట్ కోవిడ్ అనుభవాలు .... మంగారి రాజేందర్ (జింబో) ........ 39

దేవునిగుట్టమీద దేవుడెవరు? ........ శ్రీరామోజు హరగోపాల్ ........ 41

భూగోళంకు సహజ కవచకుండలాలు! - 10 ........ డా॥ లచ్చయ్య గాండ్ల ........ 47

తానొకటి తలిస్తే ........ తడకమళ్ళ మురళీధర్ ........ 51

లాభసాటి పాడి పరిశ్రమ నిర్వహణ ........ ఆనబోయిన స్వామి ........ 53

ఇద్దరు పిల్లలు ........ రాచకొండ విశ్వనాథశాస్త్రి ........ 56



**కృతజ్ఞతలు**

దక్కన్ ల్యాండ్ మాసపత్రికకు సలహాలు, సూచనలు అందించిన వివిధ రంగాల నిపుణులకు మా కృతజ్ఞతలు.


'దక్కన్ ల్యాండ్'లో అచ్చవుతున్న రచనలలో వ్యక్తమవుతున్న అభిప్రాయాలన్నింటితో సంపాదకులకు ఏకీభావం ఉండాల్సిన అవసరం లేదు. 'దక్కన్ ల్యాండ్'ను పర్యావరణ, వారసత్వ సంపద, జీవవైవిధ్య అభిప్రాయ వేదికగా, రాజకీయార్థిక, సామాజిక విశ్లేషణావేదికగా తీర్చిదిద్దాలన్నదే మా సంకల్పం. అందుకు అనుగుణంగానే అన్ని రకాల అభిప్రాయాలకు, భిన్నాభిప్రాయాలకూ స్థానం కల్పించాలన్నది మా ఉద్దేశం. వివిధ రంగాల్లో నిపుణుల రచనలను అందించడం ద్వారా ఆయా అంశాలపై, పరిష్కార మార్గాలపై పాఠకుల్లో అవగాహన పెంపొందించడమే **'దక్కన్ ల్యాండ్'** లక్ష్యం.

# తోటపల్లి సుబ్రహ్మణ్యం

సుబ్బయ్యా! ఎంత పనిచేశావయ్య. ఇదంతా ముఖ్యమంత్రిగా నేను చేయలేనిది నీవు చేశావు! అని ఆశ్చర్యపోయారు హైదరాబాద్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు. ఏమిటది…?

1926 ఏప్రిల్ 23న నాగర్ కర్నూలు సమీపంలోని పాలెం గ్రామంలో వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన సుబ్బయ్య అసలు పేరు తోటపల్లి సుబ్రహ్మణ్యం. తండ్రి సత్యమూర్తి, తల్లి భగీరథమ్మ. బాల్యంలో ఆయనకు పాఠశాల చదువు అబ్బలేదు. పౌరోహిత్యం చేసినా అభివృద్ధికి ఆమడదూరంలో పాలమూరు జిల్లాలో ఆర్థిక పరిపుష్టి దొరకలేదు. జాతి, కుల, మత వివక్షలకు అతీతంగా తన తోటి మనషుల్ని ప్రేమించి వారి అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు పాలెం సుబ్బయ్య. ఆయన సంపన్నుడు కాని మధ్యతరగతి రైతు.

1200 మంది జనాభా గల తన పల్లెకు డిగ్రీ కాలేజీ, హైస్కూలు, గుడి, మంచినీరు, ప్రజా – పశువైద్యం, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన సంస్థ, రాష్ట్రంలో తొలి వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా నడిచే ఆగ్రో–ఇండస్ట్రీ, కుటీర, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, రుణ, బ్యాంకుల సౌకర్యం… అన్నీ ఒకదాని వెంట ఒకటి వరుసగా పాలెంలో నెలకొనేలా సుబ్బయ్య చేసిన కృషి, ఆయన అసమాన కార్యదక్షతను రుజువు చేస్తుంది. పాలెం ఒక కుగ్రామం. అక్కడ ఎలాంటి వనరులు లేవు. రాజకీయ స్థానాలు ఆయన అధిష్టించ లేదు. రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చారు.



బిజినేపల్లి బ్లాకులో ఒక ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ కార్యక్రమంలో ఉంది. దాన్ని పాలెం తీసుకురావాలని సుబ్బయ్య అభిప్రాయం. ఎం.పి.ఒ.ను విచారించగా రెండెకరాల స్థలం, పదివేల రూపాయల ప్రజావిరాళం ఇస్తే పి.హెచ్.సి. సాధ్యమవుతుంది. గ్రామంలో స్థలం, డబ్బు వారికిస్తారు. తను సొంతంగా రెండెకరాలు, ప్రభుత్వానికి పదివేలు చెల్లించాడు. సుబ్బయ్య పథకం ఫలించింది. పాలెంకు వైద్యశాల వచ్చింది. ఉచిత భోజనం, నివాస సౌకర్యాలు ఉంటేనే పాఠశాలను అభివృద్ధిపరిచే వీలవుతుందని గ్రహించిన సుబ్బయ్య వెంటనే హాస్టల్ ప్రారంభించాడు. కులవివక్షకు దూరంగా హాస్టల్లో విద్యార్థులకు ప్రవేశం కల్పించారు.

ఒకే హాస్టల్‌లో హరిజన, గిరిజన, మైనార్టీ, రెడ్డి కులాల విద్యార్థులను ఉంచిన ధైర్యశాలి. ఎందరో పేదపిల్లలు ఓరియంటల్ కాలేజీలో చేరి భాషా పండితులై ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయానికి తెలుగు అధిపతులైనారు. హాస్టల్ రావడం వల్ల ఎంతో మేలు జరిగింది. ఎందరో పేద విద్యార్థుల పిల్లలకు హాస్టల్ ఆలంబనమైంది. తొలుత అందులోకి గ్రాంటు లభిస్తే, అది దినదినాభివృద్ధి చెంది చివరకు 400 మందికి పెరిగింది. ఉపాధ్యాయుల సంఖ్య ఒకటి నుంచి 36కు పెరిగింది.

విద్య, వైజ్ఞానిక, సాహిత్య విషయాల్లో పాలెం ఆదర్శ గ్రామంగా నిలవడానికి నిలువెత్తు ప్రభావం సుబ్బయ్య. నీలం సంజీవరెడ్డి మొదలుకొని మర్రి చెన్నారెడ్డి వరకు ఏదో ఒక కార్యక్రమానికి పాలెం వచ్చినవారే. బ్రహ్మానందరెడ్డి, పి.వి.నరసింహారావు, టి. అంజయ్య, జలగం వెంగళరావు, మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రులు ఈ విద్యా సంస్థల విషయంలో ఎంతో శ్రద్ధ చూపి… ఆర్థిక బాధలు గానీ, అధ్యాపకుల కొరత గానీ లేకుండా చేశారు. వారి వద్దకు సుబ్బయ్యకు నేరుగా ప్రవేశం లభించేది.

పాలెం సుబ్బయ్య స్కూల్లో సీటు అంత సులభంగా లభించేది కాదు. ముఖ్యమంత్రి విజయ భాస్కరరెడ్డి ఓరియంటల్ కళాశాల సీటు కోసం అప్పుడు జిల్లా పరిషత్ చైర్మన్ ఒక విద్యార్థికి పాఠశాల సీటు ఇవ్వమని సిఫారసు చేశారంటే సుబ్బయ్య స్కూలు, కాలేజీ స్థాయి ఏ పాటిదో అర్థమవుతుంది. 1960ల్లోనే విద్యా విధానంలో ఆయన నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. ఆయన చెప్పి చేయలేదు. చేసి చూపించాడు.

ఆ రోజుల్లో రైలు పట్టాల వెంట ఉన్న ముఖ్యమైన ఊళ్లు షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, మదనాపురంలోనే టెలిఫోన్ ఎక్స్ఛేంజీలు ఉండేవి. ఆ పరిస్థితుల్లో జడ్చర్ల నుంచి పాలెంకు ఒకే వారంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజీ తీసుకువచ్చారంటే సుబ్బయ్య ఎంత పట్టుదల వ్యక్తో తెలుసుకోవచ్చు. ఆయన తలపెట్టిన అభివృద్ధితో లబ్ధిపొందింది అణగారిన వర్గాల వారే.

నిస్వార్థంగా సేవలందించిన సుబ్బయ్య ఏనాడూ కూడా రాజకీయ పార్టీల వల్లగానీ, ఎన్నికల వల్ల గానీ పదవుల్లోకి రాలేదు. ఆయన సేవలు విస్తృత స్థాయిలో వినియోగించుకునేవారు. పీవీ ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వజూపినా తిరస్కరించారు. జలగం

(మిగతా 8వ పేజీలో)

# ప్రకృతితో చెలిమి చేద్దాం...

ఒకే విషయాన్ని పదేపదే మాట్లాడుకోవాల్సిరావడం అనివార్యమవుతున్నది. మనిషి మనుగడకు మూలమైన మౌలిక అంశాల ప్రస్తావన–చర్చ అధిక ప్రాధాన్యత సంతరించుకుంటున్నది.

ఒకటిన్నర సంవత్సరాలుగా మనల్ని భయకంపితుల్ని చేస్తున్న కరోనా నేపథ్యంలో మనల్ని మనం మరోసారి సమీక్షించుకోవాలి. ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమితో సమ్మిళితమైనదే ప్రకృతి. ఈ ప్రకృతి ఆవరణలో కోట్లాది సంవత్సరాలుగా, అనేక కోట్ల జీవజాతులు మనుగడ సాగిస్తున్నాయి. అందులో మానవజాతి కూడా ఒకటి. ఈ జీవజాతులకు ప్రకృతితో వుండే సమతుల్యతే జీవ వైవిధ్యం. అన్ని జీవజాతులు తమ కనీస అవసరాలు తీర్చుకోవడానికి మాత్రమే ప్రకృతిని ఉపయోగించుకుంటున్నాయి. కానీ మనిషి ఒక్కడే తన కనీస అవసరాలకే కాక సుఖాల కోసం, అంతులేని ఆడంబరాల కోసం, అందుకవసరమైన ధన సంపాదన కోసం తన దగ్గరున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రకృతి వాడేసుకుంటున్నాడు. ముఖ్యంగా భూమి పైన, భూమి లోపల సహజ వనరులను కాలుష్యమయం చేస్తున్నాడు. ప్రకృతి అంతా తన ఒక్కడిదే అన్నట్లు ఆధిపత్యం చెలాయిస్తున్నాడు.

ప్రకృతి గొప్ప ప్రయోగశీలి. సృష్టికి అండగా వుండని (సపోర్టు యివ్వని) జీవజాతులకు మనుగడ లేకుండా చేస్తుంది. ఈ ప్రయోగం కోట్ల సంవత్సరాలుగా సాగుతూనే ఉంది. డైనోసార్లు, సాబర్ టూత్ పులి, మనిషి పురాతన రూపంగా భావించే నియాండర్తల్స్ వరకు తెర వెనక్కి పంపింది. ఇప్పటికీ ప్రతి రోజూ వంద జీవజాతులు అంతర్థానమవుతున్నాయి. ఇప్పుడు సృష్టికి, ప్రకృతికి సపోర్ట్ యివ్వని మనిషిని కూడా ప్రకృతి పక్కకు తప్పిస్తుంది. అలా మానవజాతిని అంతర్థానం చేయడానికే ప్రకృతి కరోనాని ఆయుధం చేసుకున్నదా.. అదే నిజమైతే మనిషి ఉనికి మాటేమిటి.. దీన్నించి ఎలా బయటపడాలి. ఇప్పటికీ అవకాశం మించి పోలేదు. ప్రకృతి ఆవరణలోని కోట్లాది జీవజాతులలో తనూ ఒకడినని తెలుసుకోవాలి. ఆధిపత్య ధోరణి వదులుకోవాలి. ప్రకృతితో చెలిమి చేయాలి. జీవన విధానంలో పాటించే విలువలలో మార్పు రావాలి.



కరోనా సెకండ్ వేవ్ మరింత భయాందోళనలకు గురి చేస్తుంది. పిల్లల మీదా చూపు విసిరింది. పాఠశాల, హాస్టల్ విద్యార్థులు కరోనాకు గురయ్యారు. సురక్షితమనుకున్న దేశాలలో కూడా పిల్లలపై ప్రభావం చూపింది. సింగపూర్‌లో ఒక్కరోజులోనే 38 కేసులు నమోదయ్యాయి. బి.1.167 రకానికి చెందిన వైరస్ కారణమని, యిది మొదటిసారిగా భారత దేశంలో గుర్తించబడిందని నిర్ధారించారు. జాగ్రత్త చర్యగా ఈ టర్మ్ వరకు స్కూల్సుని మూసేశారు. బ్రెజిల్లో ఐదేళ్ల లోపు పిల్లలు 2,200మంది మరణించారు. తక్కువ సమయంలో ఇంతమంది పిల్లలు మరణించిన సంఘటన మరెక్కడ లేదని అంటున్నారు. హాంకాంగ్‌లో వైరస్ సోకిన చిన్నారులలో నాలుగు మాసాల పసిపాపను గుర్తించారు. తైవాన్‌లో ఒక వారాంతంలో 330 పిల్లల కేసులు నమోదయ్యాయి. ఈ దేశాలన్నిటిలో పాఠశాలలు మూసివేశారు.

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఈ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టింది. పాఠశాలలు పనిచేయాలన్న విద్యావేత్తలు, తల్లిదండ్రులు, స్కూలు యాజమాన్యాల ఒత్తిడులను కాదని పాఠశాలలను మూసివేసింది. విద్యా సంవత్సరం వృధాకాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటుంది. థర్డ్‌వేవ్‌లో గర్భస్థ శిశువులతో సహా చిన్నారులపై మరింత ప్రభావం చూపగలదని ఆరోగ్య, వైద్య నిపుణులు, అధికారులు హెచ్చరిస్తున్నవేళ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగానే సన్నద్ధమై నిర్దిష్ట చర్యలు చేపట్టాలి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పీడియాట్రిక్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి. అన్ని స్థాయిల్లో కూడా పిల్లలకు నిర్దిష్ట సంఖ్యలో బెడ్స్ రిజర్వ్ చేయాలి. పిల్లలకు అవసరమైన మందులు ఇతర ఉపకరణాలు సిద్ధంగా ఉంచుకోవాలి. పిల్లలకు సాధ్యమైనంత త్వరగా టీకాలు ఇవ్వాలి. రేపటి తరాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత.

ప్రకృతి, పర్యావరణం పరిరక్షణ, మనిషి – లోని అంతర్గత సంబంధాలను, సంక్షోభాలను అవగాహన చేసుకొని పరిష్కార దిశగా కృషి చేయడమే మనముందున్న కర్తవ్యం.



(మణికొండ వేదకుమార్)
ఎడిటర్

*(6వ పేజీ తరువాయి)*

వెంగళరావు 'పద్మశ్రీ' పురస్కారానికి సిఫారసు చేసినా రాజకీయాలు అడ్డువచ్చి దాన్ని ఇతరులు తన్నుకుపోయారు.

యాదృచ్ఛికమో లేక దైవ నిర్ణయమో కానీ సంపూర్ణ సూర్యగ్రహణం 1980లో వచ్చింది. ప్రపంచంలో అత్యధిక సూర్యగ్రహణ సమయం, సంపూర్ణ గ్రహణం పాలెంలోనే సంభవిస్తుందని దేశ విదేశాల శాస్త్రజ్ఞులు తేల్చిచెప్పారు. నాలుగు నిముషాల 48 సెకన్ల పాటు సూర్యగ్రహణం పాలెంలో ఉంటుందని చెప్పడంతో ఒక్కసారిగా దేశవిదేశీ ఖగోళ శాస్త్రజ్ఞులు పాలెం చేరుకున్నారు. ప్రపంచమంతటా పాలెం పేరు మార్మోగింది. చెన్నారెడ్డి తన క్యాబినెట్‌తో ఇక్కడకు ప్రవేశించారు. ఏమాత్రం సౌకర్యాలు లేని పాలెంలో అందరికీ సుబ్రహ్మణ్యమే వసతులు కలిగించారు. దీనికి ముగ్ధులైన అమెరికా అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ఇక్కడివారి సహకారానికి కృతజ్ఞతలు వెల్లడిస్తూ ఒక అభినందన పత్రంపై సంతకం చేసి పంపించాడు. జాతీయంగానే గాక అంతర్జాతీయంగా పాలెంకు ఖ్యాతితెచ్చిన సుబ్రహ్మణ్యం అభినందనీయుడు.

విశ్రాంతి, విరామం లేకుండా పాలెం గ్రామానికి నలభై వసంతాలు సేవచేసిన సుబ్బయ్యకు అది ఎంతో సంతృప్తి నిచ్చింది. ప్రజల కోసం తన ఆస్తిని కర్పూరంలో కరిగించిన వ్యక్తి. గ్రామ సౌకర్యాల కోసం తనకున్న 40 ఎకరాల భూమి అమ్మేశారు. ప్రజా సేవలకు తనకున్న ఆస్తులన్నీ పోయాయి. ఇక మిగిలింది ఆయన కాంస్య విగ్రహమే. ఆ మహనీయుడు 1986 జూన్ 23న కన్ను మూశారు.

*(తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ప్రచురించిన **'తెలంగాణ తేజోమూర్తులు'** నుంచి)*

**– జి. వెంకట రామారావు**




పై పుస్తకాలు లభించు చిరునామా :

టీఆర్‌సి 3-6-712/2, స్ట్రీట్ నెం.12, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఫోన్ : 9030 6262 88. Email: trchyd@gmail.com

# బ్రిటీష్ సైన్యాన్ని ఓడించిన ప్రిన్స్ ముబారిజుద్దౌలా!

తెలంగాణ... హైదరాబాద్ నగరం.. రాజ్యం... తవ్విన కొద్దీ కొత్త మణులు, చారిత్రక వైఢూర్యాలు, సాంస్కృతిక రత్నాలను, సాహిత్య కెంపులను అందించే విలువైన నిక్షేపాలున్న నిధి. ఒకప్పుడు ఇది 'కోహినూరు'కు ప్రసిద్ధి. ఇప్పుడు ఈ ప్రాంతం అంతకన్నా గొప్పదైనా చారిత్రక వారసత్వానికి వారధి. హైదరాబాద్ నగరం గురించి పర్షియన్, ఉర్దూ, ఇంగ్లీషు, తెలుగు, మరాఠీ, కన్నడ భాషల్లో.. శిలా శాసనాల్లో, రాగి రేకుల్లో, తాళపత్రాల్లో ఎంతో చరిత్ర నిక్షిప్తమై ఉన్నది. కుతుబ్‌షాహీల కాలం నుంచి ఫ్రెంచ్, డచ్, బ్రిటీష్, పర్షియా, అరబ్బు, మద్రాసు ప్రాంతాల నుంచి గోలకొండ, హైదరాబాద్ నగరాలను సందర్శించిన వాళ్ళు తమ అనుభవాలను, అనుభూతులను రికార్డు చేసినారు. నిజాం పాలనలో బ్రిటీష్ రెసిడెంట్లుగా, మిలిటరీ అధికారులుగా పనిచేసిన కొన్ని వందల మంది స్వీయానుభవాలను, చరిత్రను చిత్రికగట్టినారు. అట్లాగే దాదాపు 1800ల ప్రాంతం నుంచి హైదరాబాద్ రాజ్యం స్థితిగతులను, పర్యావరణాన్ని, సహజ వనరులను, భూగర్భ నిధులను, ఖనిజాలను, ప్రజల ఆచార వ్యవహారాలను, భాషా, సంస్కృతులను వ్యాసాల రూపంలో వెలువరించినారు. కల్నల్ కాలిన్ మెకంజీ, ఆయన అనుయాయులు కావలి వెంకట బొర్రయ సోదరులు హైదరాబాద్ రాజ్యంలోని వివిధ ప్రాంతాలను సర్వేచేయడమే గాకుండా కైఫియత్తులను రాయించినారు. ఈ కైఫియత్తుల్లో ఆనాటి భాషతో పాటుగా, అపురూపమైన సమాచారాన్ని సేకరించి పెట్టినారు. ఇట్లా పోగైన సమాచార సంపద అందరికీ తెలియాల్సిన అవసరమున్నది. ఇంతకు ముందు ఎక్కడా చరిత్ర పుటల్లో చోటుచేసుకోకుండా పోయిన విషయాల్ని వివరంగా పూసగుచ్చి తెలంగాణ తల్లికి మాలగా అర్పించాలి. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణ తనను తాను తెలుసుకోవడమే గాకుండా, తెలుసుకున్న సమాచారాన్ని అందరికీ అందుబాటులోకి తేవాల్సిన సందర్భమిది. గత మూడు దశాబ్దాలుగా తెలంగాణ/హైదరాబాద్ రాజ్యానికి సంబంధించి కొన్ని లక్షల పుటల సమాచారాన్ని సేకరించడం జరిగింది. 'కవిలె' తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరాల్ సెంటర్ తరపున ఈ సమాచారాన్ని వివిధ పరిశోధకులు, పత్రికలు, వ్యక్తులు, పండితులతో పంచుకోవడం కూడా జరిగింది. ఇప్పుడు మరొక్కసారి అరుదైన చారిత్రకాంశాల్ని, సామాజిక విశేషాల్ని, సాంస్కృతిక వైభవాన్ని, భాషా వైశిష్ట్యాన్ని, హిందూ-ముస్లిం తేడాలేకుండా అన్ని మతాల వారు ప్రదర్శించిన అపురూపమైన ప్రతిభ, సంస్థలుగా చిరస్మరణీయమైన సేవలందించిన విశేషాలను ఇక్కడ రికార్డు చేయడం జరుగుతోంది. నృత్యం, చిత్రం, గానం, కీర్‌బత్తీస్ కథలు, దక్కనీ గజల్స్, సాహిత్యం అంతా పంచభాషా సంస్కృతిని, మిశ్రమ జీవన విధానాన్ని పట్టిచ్చే ఆకరాలు. అలాయి బలాయి సంస్కృతికి నిదర్శనం. పండుగలు, పబ్బాలు, ఊరేగింపులు, జానపదుల కళారూపాలు, అక్కన్న మాదన్నలు ఆదరించిన/ ప్రోత్సహించిన బోనాలు, బతుకమ్మ ఇవ్వాళ గజ్జెగట్టి ఘనంగా ప్రదర్శిస్తోంది. గతం నుంచి మనకు అందిన వారసత్వం, వారసత్వ కట్టడాలు, వాటి ప్రాధాన్యత కూడా ఇందులో చర్చించడం జరుగుతుంది.



ముబారిజుద్దౌలా

హైదరాబాద్ చరిత్ర అంటేనే అబ్బురం. విస్మయం. అరబ్-రొహిల్లా వీరుడు తుర్రెబాజ్‌ఖాన్ తన గురువు మౌల్వీ అల్లావుద్దీన్ బోధనలతో ప్రభావితమై బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసినాడు. పోరాటంలో ప్రాణాలు వదిలినా ఈ దేశ మూలవాసులెవ్వరూ పరాయిపాలనకు తలొగ్గేది లేదని హెచ్చరించాడు. బ్రిటీష్ వారి వెన్నులో వణుకు పుట్టించాడు. వీరుడిగా నిలిచాడు. ఇది 1858నాటి సంఘటన. అయితే 1815లో ఒక 15 యేండ్ల బాలుడు బ్రిటీష్‌వారితో హైదరాబాద్‌లో యుద్ధం చేసి వారిని మట్టి కరిపించిన చరిత్ర మనలో చాలా మందికి తెలియదు. ఆ చరిత్రను సృష్టించింది కూడా హైదరాబాదే! బహుశా దేశం మొత్తంగా ఒక దేశీయుడు బ్రిటీష్‌సైన్యాన్ని ఎదుర్కొని విజేతగా నిలిచిన తొలి సంఘటన ఇదే అయ్యుంటది. ఒక 15 యేండ్ల బాలుడు బ్రిటీష్ సైన్యాన్ని గడగడలాడించాడంటే నమ్మశక్యంగాని విషయం. కాని వాస్తవం. సికిందర్‌ఝా (మూడో నిజాం) (1768-1829) పాలన చేస్తున్న కాలమది. ఈ సికిందర్ ఝా తన తండ్రి రెండో నిజామ్ అలీఖాన్ మరణానంతరం 1803లో అధికారంలోకి వచ్చాడు. 1829 వరకు పాలన చేసి తన 61వ యేట మరణించాడు. ఈయనకు ఇద్దరు భార్యలు. హాజీ బేగమ, చాంద్‌నీ బేగమ్. మొత్తం 19 మంది సంతానం. తొమ్మిది మంది కూతుళ్ళు. పది మంది కొడుకులు. సికిందర్ ఝా మూడో కొడుకు 'ముబారిజుద్దౌలా' మన వీరుడు. ముబారిజుద్దౌలా బ్రిటీష్ అధికారి వద్ద దర్జీగా పనిచేసే ఒక వ్యక్తిని నిర్బంధించాడు. నిర్బంధించడానికి కూడా కారణమున్నది. బ్రిటీష్ వారి సూట్లు, బట్టలు ఈ దర్జీ కుట్టేవాడు కావడంతో ఆయన సేవలకు మెచ్చి కొంత భూమిని బ్రిటీష్‌వారు ఇనామ్‌గా ఇచ్చినారు. అయితే ఈ భూమికి సంబంధించి కొంత రెవిన్యూ సుంకం చెల్లించాల్సిందిగా ముబారిజుద్దౌలా, అతని మిత్రుడు ఆ దర్జీని ఆదేశించినారు. ఇందుకు అతను అంగీకరించక పోవడంతో అతన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. రాజభవనంలో నిర్బంధించినారు.

దీంతో ఆ బ్రిటీష్ అధికారి నిజాం దర్బారు జరుగుతున్న సమయంలో అక్కడికి వచ్చి టెయిలర్ నిర్బంధ విషయం తెలుపుతూ,

అతన్ని విడుదల చేయవలసిందిగా సికిందర్‌ఝాను కోరినాడు. దీనికి ఆయన స్పందిస్తూ తన కొడుకు, అతని మిత్రుడి నిర్బంధంలో ఉన్న దర్జీని విడుదల చేయడమే గాకుండా నిండు సభలో గౌరవ సూచకంగా దర్జీకి శాలువా కప్పి సత్కరించాడు. ఈ విధమైన సత్కారం ఆనాడు అత్యంత ఉన్నతులకు మాత్రమే లభించేది. అంతే గాకుండా తన రక్షణ బృందంలోని ఒక అధికారిని దర్జీ భద్రతా విషయాలు చూసుకునేందుకు కేటాయించినాడు. భవిష్యత్‌లో ముబారిజుద్దౌలా నుంచి ఎలాంటి హాని ఉండబోదు అనే భరోసాను కూడా కల్పించాడు. నిండు సభలో అదీ విదేశస్తుల మూలంగా తనకు అవమానం జరగడంతో ముబారిజుద్దౌలా కుమిలి పోయాడు. కన్నకొడుకునైన తనను కాకుండా బ్రిటీష్ అధికారికి ఎక్కువ గౌరవం ఇవ్వడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. దీంతో బ్రిటీష్ వారి మీద పగసాధించుకోవాలని ముబారిజుద్దౌలా నిర్ణయించుకున్నాడు. అంతేగాకుండా తన మేనమామ మన్నా సాహిబ్ (మునీర్ ఉల్ ముల్క్), ఆయన కొడుకుతో జత కట్టాడు. అనుకున్నదే తడవుగా మొత్తం రాజభవనాలన్నింటిపై నిఘా పెట్టినాడు. చుట్టూ బారికేడ్లు నిర్మించి తన అనుమతి లేకుండా ఎవ్వరూ లోనికి రావొద్దని, అలా వచ్చిన వారిని తల తీసెయ్యాల్సిందిగా ఆదేశించాడు. అంతేగాదు ఈ భవంతులు ఆక్రమించుకునే దిశలో ఎవ్వరు అడ్డం వచ్చినా వాళ్ళు తమ సొంత కుటుంబీకులైన వారిని కూడా వధించాల్సిందిగా ఆదేశించాడు. గురి చూసి కాల్చే నేర్పు గల వాళ్ళను భవంతులపై కాపాలకు దించినాడు. ఒక యుద్ధ వాతావరణం ఏర్పడింది. అంత:పురంలో భయం ఆవరించింది.


మూడో నిజామ్ సికిందర్‌జా

పరిస్థితులు అదుపు తప్పడంతో కెప్టెన్ హేర్ నాయకత్వంలో 'రస్సెల్ బ్రిగేడ్' (సైన్యం) నగరంలోకి ప్రవేశించింది. వీరి ఏకైక లక్ష్యం ముబారిజుద్దౌలా. ఇక్కడ బ్రిటీష్ పటాలానికి, ప్రిన్స్ మద్దతుదారులకు తీవ్రమైన పోరాటం జరిగింది. ఈ పోరులో బ్రిటీష్ సైన్యంలోని కెప్టెన్ డార్బే (ఈయన నాన్ కమీషన్డ్ అధికారిగా ఉన్నాడు) మరో 12 మంది సైనికులు చనిపోయారు. అయితే ఓడిపోతున్న సైన్యానికి మద్దతుగా బ్రిటీష్ వారు సికింద్రాబాద్‌లో ఉన్నటువంటి పటాలాలను హైదరాబాద్‌కు రావాల్సిందిగా ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన సికిందర్ ఝా తన బావమరిది, మంత్రి కూడా అయిన మునీర్ ఉల్ ముల్క్‌ని రంగంలోకి దించినాడు. ఈయన బ్రిటీష్ పటాలాలేవీ హైదరాబాద్‌లోకి రావడానికి వీలులేదని ఆదేశిస్తూ, యుద్ధాన్ని ఆపడం కోసం ముబారిజుద్దౌలా చుట్టూతా బ్రిటీష్ పోలీసులు నిఘా ఏర్పాటుచేసుకోవడానికి అనుమతిచ్చాడు. ఈ చర్య ముబారిజుద్దౌలాలో మరింత ఆగ్రహాన్ని పెంచింది. నేను ఒక్క రాజుకు తప్ప మరెవ్వరికీ లొంగేది లేదని చెబుతూ గుర్రంపై సవారీ అయి నగరమంతా విజయోత్సవ ర్యాలీని నిర్వహించాడు. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వాడవాడలా స్వాగతం పలికారు. బ్రిటీష్ సైన్యం ఈ సంఘటనను అవమానంగా భావించింది. చివరికి రాజు మీద వత్తిడి తీసుకొచ్చి ముబారిజుద్దౌలాను గోలకొండ కోటలో బంధించేలా చేశారు. ముబారిజుద్దౌలా 1815-1820 వరకు అంటే 15వ యేట నుంచి 20వ యేడు వరకు గోలకొండ కోటలో బందీగా ఉన్నాడు. ఈ ముబారిజుద్దౌలాకు 'హైదర్ అలీ ఖాన్' అనే బిరుదు కూడా ఉన్నది.


మునీర్ ఉల్ ముల్క్ బహదూర్

నిజానికి ఒక 15 ఏండ్ల బాలుడు తన మేనమామ సహాయంతో మొత్తం బ్రిటీష్ వారిని గడగడలాడించడం చారిత్రక సంఘటన. ఆ తర్వాతి కాలంలో కూడా అటు బ్రిటీష్ వారికీ, ఇటు హైదరాబాద్ పాలకులకూ పక్కలో బల్లెంలా పనిచేసినాడు. హైదరాబాద్‌పై ప్రాంతేతరుల ముఖ్యంగా బ్రిటీష్ వారి పెత్తనాన్ని, జోక్యాన్ని తీవ్రంగా నిరసించినాడు. అందుకు ప్రజల మద్ధతు కూడగట్టేందుకు కూడా ప్రయత్నించినాడు. సికిందర్‌ఝా అనంతరం నాసిరుద్దౌలా 1829లో అధికారంలోకి వచ్చాడు. ఈయన అధికారంలో ఉన్న కాలంలో ముబారిజుద్దౌలా 'వహాబీ' ఉద్యమానికి దక్షిణాదిన బీజాలు వేసినాడు. కర్నూలుతో సహా అనేక మందిని బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా కూడ గట్టినాడు. ఈ సంఘటన గురించి మరోసారి చర్చించుకుందాం.

వ్యక్తులు, సంఘటనలు, వివిధ విషయాలు, యుద్ధాలు, తిరుగుబాట్లు, పాలకుల లొంగుబాట్లు, బ్రిటిష్ రెసిడెంట్ల అత్యుత్సాహం, నిజాం నవాబుల నిరసనలు అన్నీ కలగలిసి హైదరాబాద్ చరిత్రను మలుపు తిప్పాయి. పాలకులు తమ రాజ్యాలను కాపాడుకోవడం, స్థిరీకరించుకోవడం, విస్తరించడం కోసం యుద్ధాలు చేసేవారు. ప్రజలు కూటమిగా ఏర్పడి చేసే తిరుగుబాట్లను అణచివేయడం కూడా రాజ్యపాలనలో భాగమే! అయితే కొన్ని కొన్నిసార్లు చిన్న విషయాల కోసం, లేదా పంతాలు పట్టింపుల కోసం కూడా పెద్ద పెద్ద యుద్ధాలు చేసేవారు.

వందల యేండ్లుగా ఈ నగర చరిత్రను రికార్డు చేస్తున్నా ఇంకా వెలుగులోకి రావాల్సిన కోణాలు ఎన్నో ఉన్నాయి. హైదరాబాద్ రాజ్యంలో బ్రిటీష్‌పై మొదటి తిరుగుబాటు చేసింది తుర్రెబాజ్‌ఖాన్ అని ఇప్పటి వరకూ చదువుకున్నాము. హైదరాబాద్ నగరంలో బ్రిటీష్‌వారిపై మొదటి తిరుగుబాటు 1815లో జరిగింది. దీనికి నాయకత్వం వహించింది మూడో నిజామ్ సికిందర్‌జా తనయుడు ముబారిజుద్దౌలా. ఈ తిరుగుబాటు ఒక దర్జీ నిర్బంధం విషయంలో జరిగింది.

-సంగిశెట్టి శ్రీనివాస్,
m:98492 20321
e: sangishettysrinivas@gmail.com



ఒకప్పటి అలియాబాద్ దర్వాజా

# నా 'మాల్గుడి డేస్' అలియాబాద్ దర్వాజా

ముచికుందా నదికి దక్షిణ భాగాన కుతుబ్‌షాహీ నవాబులు నగర ప్రాకారాన్ని నిర్మించటం ప్రారంభించారు. కాని అది ఔరంగాజేబు దండయాత్రల వలన పూర్తి కాలేదు. ఆ తర్వాత వచ్చిన ఆసఫ్‌జాహీల కాలంలో ముఖ్యంగా రెండవ నిజాం కాలంలో 1802లో నగర ప్రాకారం - గోడ - పూర్తయ్యింది. "రంగ్‌మహల్ కే దస్ దర్వాజే" అన్నట్లు ఆ ప్రాకారానికి పన్నెండు తలుపులు. అందులో ఒకానొకటి "అలియాబాద్ దర్వాజా". రెండవ నిజాం పేరు "అలీఖాన్". ఆయన పేరు మీదనే అలియాబాద్ దర్వాజా, అలియాబాద్ మొహల్లా (బస్తీ) ఏర్పడింది. ఈ దర్వాజాకు ఆవల విస్తరించిన ప్రాంతాన్ని బేరూన్ అలియాబాద్ అని లోపల వెలసిన నగరాన్ని అందరూన్ అలియాబాద్ అని పిలిచేవారు. చార్మినార్ నుండి ఫలక్‌నుమాకు వెళ్లే దారిలో అలియాబాద్ ఇప్పటికీ ఉంది కాని ఆ దర్వాజా మాత్రం లేదు. జ్ఞాపకాల స్వర్ణపేటికలో అదొక అపురూప నెమిలి పించంలా ఇప్పటికీ మెరుస్తూనే ఉంటుంది.

చార్మినార్, మక్కామసీదు దాటగానే మొగల్‌పురా తర్వాత శాలిబండ ఛడావ్ వస్తుంది. అతి కష్టంతో ఆ ఎత్తు ప్రాంతం ఎక్కి దిగగానే సయ్యద్ అలీ చబూత్రా వస్తుంది. అక్కడ నుండి కొంచెం దూరం నడుస్తే అలియాబాద్ శురు అయితది. రోడ్డుకు రెండు వైపులా రాతి నిర్మిత సత్రపు గదులు. వాటికి తలుపులు ఉండవు. అలిబాబా నలభై దొంగలు సిన్మాలో మాదిరిగా అర్ధచంద్రాకారపు గుహల్లా ఉంటాయి. ఒకప్పుడు దర్వాజాలు దాటి వచ్చిన ముసాఫిరులందరూ వాటిల్లో బస చేసేవారు. అందుకే ఒకప్పుడు అలియాబాద్‌ను అలియాబాద్ సరాయి అనేవారు. ఇప్పుడవన్ని చిన్నా, చితక దుకాణాలుగా మారిపోయినాయి.

అలియాబాద్ దర్వాజ దగ్గర ఒక పెద్ద బురుజు ఉండేది. క్రింది నుండి పైకి వెళ్లటానికి రాతి మెట్లు ఉండేవి. బురుజుపైన విశాలమైన గుండ్రటి స్థలం మధ్యలో ఒక తోప్ (ఫిరంగి) ఉండేది. అది నల్లటి కొండ చిలువలా ఎర్రటి ఎండలో మిలమిలా మెరుస్తుండేది. శత్రుసైన్యాలు నగర ప్రాకారపు అవతల మోహరించినపుడు ఈ ఫిరంగీని అటువైపు తిప్పి గురిచూసి కొట్టేవారు. ఆ ఫిరంగీపై అతి నాజూకుగా, కళాత్మకంగా చెక్కిన ఆకులు, పువ్వులు, పూలతీగలు ఉండేవి. యుద్ధ కళ, శిల్పకళల సమ్మేళనానికి సంకేతమే ఆ ఫిరంగి.

మేము పిల్లలం బడి నుండి వచ్చేటపుడు సరదాగా ఆ బురుజుపై వరకు ఎక్కేవారం. ఆ ఫిరంగి వద్ద నిలుచుంటే అక్కడ వీచే ఈదురుగాలికి బక్క ప్రాణాలైన మేము గడ్డిపోచల్లా ఎగిరిపోతామేమో అని భయం వేసేది. తర్వాత రోజులలో ప్రజలు ఆ బురుజును కొంచెం కొంచెం కూలగొట్టి ఆ రాళ్లను, రాతిమెట్లను తమ ఇళ్ల నిర్మాణానికి వాడుకున్నారు. దాంతో ఆ ఫిరంగి ఎడారిలో కాళ్లు విరిగి నేల కూలిన ఒంటరి ఒంటెలా మిగిలిపోయింది.

అలియాబాద్ దర్వాజా దగ్గర "పూల తుర్కాయన" అనే ఒక ముసలాయన ఉండేవాడు. అతని పేరు ఎవరికీ తెలియదు. ఆయనకు శాలిబండ ఉతార్‌లో ఒక దర్గా పక్కన తెల్ల మల్లెలు, ఎర్ర గులాబీల పూల దుకాణం ఉండేది. కావున ఆయనకు "పూల తుర్కాయన" అని పేరు వచ్చింది. అతను తెల్ల పొడుగు గడ్డంతో తలపై తెల్లటి జాలీటోపీతో, చేతులలో హమేషా తస్బీహ (జపమాల) తిప్పుతూ అతి పవిత్రంగా కనిపించేవాడు. ప్రతి ఉదయం ఎండ రాక ముందే ఆయన ఇంటి ముందున్న తడకల పందిళ్ల క్రింద రోగులు జమ అయ్యేవారు. అతను క్రింద ఈత చాపమీద మోకాళ్లు మడిచి వజ్రాసనంలో కూచునేవాడు. అతని ఎదురుగా తళతళా మెరిసే ఇత్తడి తాంబాళంలో సున్నం కలిపిన నీళ్లు ఉండేవి. రోగులు తమ రెండు అరచేతులు ఆ నీళ్లల్లో పెట్టగానే ఆ ముసలాయన ఒక మంత్రం చదువుతూ అప్పుడే తెచ్చిన ఆకుపచ్చ, తాజా వేపాకు మండలతో తల నుండి కాళ్ల వరకు స్పృశించి రోగి మెడలో ఎర్రదారంతో కలిపిన ఒక తావీజ్ (తాయత్తు) కట్టేవాడు. ఎటువంటి దవా లేకుండానే ఆయన దువాతో రోగుల బాధలు దూరం అయ్యేవి. అతను ఒక్క పైసా కూడా తీసుకునేవాడు కాదు. మాకు చిన్నప్పుడు కొంచెం జ్వరం వచ్చినా ఆ పూల తుర్కాయన దగ్గరికి వెళ్లి మెడలో ఎర్రదారం కట్టించుకునేవారం. పిల్లల మెడలో ఎర్రదారం కనబడితే "బడికి ఎందుకు రాలేదు" అని సార్ కూడా అడగకపోయేది. ఆ ఎర్రదారం మెడికల్ సర్టిఫికేట్‌గ పని చేసేది. అదీ ఆ తావీజ్ మహత్తు.

అలియాబాద్ కూరగాయల మార్కెట్‌లో "రెడ్డి జనసంఘం" భవనం ఉండేది. అందులోనే ఒక గ్రంథాలయం కూడా ఉండేది. హైద్రాబాద్ నగరంలో ఆంధ్ర మహాసభ, ఆంధ్ర జనసంఘం, రెడ్డి హాస్టల్ లాంటి సంస్థలు స్థాపించబడిన తర్వాత వాటి ప్రేరణతోనే పాతనగరం అలియాబాద్‌లో 1940లలో ఈ భవన నిర్మాణం జరిగింది. ఈ గ్రంథాలయం ద్వారా ప్రజలలో నూతన చైతన్యం వెల్లివిరిసింది. నారాయణగూడాలోని "మాడపాటి బాలికల పాఠశాల, రెడ్డి మహిళా కళాశాల" ప్రేరణతో అలియాబాద్‌లో శ్రీ ప్రసన్న గజానన శారదా బాలికల పాఠశాల 1940లలో స్థాపించబడి స్త్రీవిద్యకు, మహిళా చైతన్యానికి పునాదులు వేసింది. "ఇల్లాలు చదువు ఇంటికి వెలుగు" అన్నట్లు చదువుకున్న స్త్రీలు ఉద్యోగాలు చేసి ఆర్థికంగా స్వతంత్రులైనారు. నగరంలోని మహారాష్ట్రుల ప్రభావంతో ఈ శారదా పాఠశాలలో ప్రతి ఏటా వినాయక చవితి ఉత్సవాలు, గణేషుడి మంటపాల స్థాపన ప్రారంభమై ఈనాడు జంట నగరాలలో అదొక హిందూ సంస్కృతిగా స్థిరపడింది. వారం రోజులపాటు సాంస్కృతిక ప్రదర్శనలు జరిగేవి. ప్రజా ఆరోగ్య, విద్యావైజ్ఞానిక డాక్యుమెంటరీ సీన్మాలు చూపించేవారు. సీన్మాలు టి.వి.లు లేని ఆ అమాయకపు కాలంలో ప్రజలంతా ఆ వారం రోజులు అక్కడ గుమికూడేవారు.

అలియాబాద్ దాటాక జహాఁనుమా అనే ప్రాంతంలో ఒక సీన్మా స్టూడియో ఉండేదన్న సంగతి ఈ తరం వారెవరికీ తెలియదు. దాని పేరు "లలితా శివజ్యోతి స్టూడియో". ఎఎన్ఆర్, ఎన్‌టిఆర్, బి.సరోజాదేవిలు నటించిన "రహస్యం" సీన్మా ఈ స్టూడియోలోనే నిర్మించబడింది. తర్వాత కాలంలో దీని పేరు "సదరన్ మూవీటోన్"గా మార్చారు. దారాసింగ్, షకీలాలు హీరో, హీరోయిన్‌లుగా నటించిన ఫౌలాద్, బాద్షా హిందీ సీన్మాలు కూడా ఇక్కడే తీసారు. మేం పిల్లలం స్కూలు దుమ్మాకొట్టి దారాసింగ్ పహిల్వాన్‌ను చూడటానికి ఆ స్టూడియో చుట్టు చక్కర్లు కొట్టేవారం. తర్వాత ఆ స్టూడియో మూతబడింది. కారణాలు తెలియవు. కొంత కాలం తర్వాత అది రైస్ మిల్లుగా మారిపోయింది. బియ్యం బస్తాలు నిల్వ ఉంచే గోదాం (గోడౌన్)గా మిగిలిపోయింది. రామానాయుడు, పద్మాలయ స్టూడియోలు పుట్టని కాలంలో పాతనగరంలో ఒక స్టూడియో ఉండేదని అందులో రహస్యం లాంటి భారీ చిత్రం నిర్మించబడిందన్న సంగతి గుర్తుకొస్తే గుండె బరువెక్కి కళ్లల్లో కన్నీరు ఉబుకుతుంది. గతమెంతో ఘనకీర్తి కలిగిన పాతనగరం!

అలియాబాద్ దాటాక జహాఁనుమా అనే ప్రాంతంలో ఒక సీన్మా స్టూడియో ఉండేదన్న సంగతి ఈ తరం వారెవరికీ తెలియదు. దాని పేరు "లలితా శివజ్యోతి స్టూడియో". ఎఎన్ఆర్, ఎన్‌టిఆర్, బి.సరోజాదేవిలు నటించిన "రహస్యం" సీన్మా ఈ స్టూడియోలోనే నిర్మించబడింది. తర్వాత కాలంలో దీని పేరు "సదరన్ మూవీటోన్"గా మార్చారు.

అలియాబాద్‌కు జహాఁనుమాకు మధ్యలో ఇంజన్‌బౌలి బస్తీ వస్తుంది. 1880లలో సర్ వికారుల్ ఉమ్రా కోహెతూర్ అన్న కొండమీద "ఫలక్‌నుమా" అనే ఒక ఆకాశ హర్మ్యాన్ని నభూతో నభవిష్యత్తుగా 1883లో నిర్మించాడు. అది చాలా ఎత్తైన కొండ ప్రాంతం కావున మంచినీటి సౌకర్యం లేదు. కొండ క్రింద ఒక లోతైన బావిని తవ్వించి శక్తివంతమైన హెచ్.పి. ఇంజన్ ద్వారా నీళ్లతోడి సరఫరా జరిగేది. ఆ ఇంజన్‌ను లండన్ నుండి తెప్పించటం ఆ రోజులలో ఒక విశేషం. హైద్రాబాద్ నగరంలో ఒక బావికి మొదటిసారి ఇంజన్‌ను అమర్చటం ఒక అరుదైన విశేషం కావటం వలన ప్రజలు ఆ ప్రాంతాన్ని "ఇంజన్‌బౌలి" అని పిలవసాగారు.

అలియాబాద్ నుండి ఇంజన్‌బౌలికి పోతుంటే కుడివైపు "పెద్దపులితోట" వస్తుంది. ఇదొక వాటర్ ఫిల్టర్ ఏరియా. నైజాముల కాలంలో మీరాలం చెరువు నుండి పాతనగరానికి త్రాగునీరు సరఫరా అయ్యేది. ఇక్కడ ఆ నీటిని శుభ్రపరచేవారు. అప్పుడు అదంతా జంగల్ ఏరియా. అడివిలో హాయిగా బ్రతికే ఒక పెద్దపులి పట్నం చూద్దాం అన్న కుతుహలంతో పొరపాటున ఈ తోటలోకి వచ్చింది. వాటర్ వర్క్స్ సిబ్బంది దానిని పట్టుకుని నాంపల్లిలోని బాగే ఆం జంతు ప్రదర్శనశాలకు తరలించి యావజ్జీవ శిక్షగా దానిని జీవితాంతం



ప్రస్తుతం ఉన్న దబీర్‌పురా దర్వాజా

అక్కడే బంధించారు. "టౌను పక్కకెళ్లొద్దురో డింగరి, డంగైపోతావురో డింగరీ" అన్న తెలుగు సీన్మాపాట వినని ఆ పెద్దపులి చివరికి చెరసాల పాలైయ్యింది. అప్పట్నుంచి ప్రజలు ఆ ప్రాంతాన్ని పెద్దపులితోట అని పిలవసాగారు.

మళ్లీ అలియాబాద్ దర్వాజా దగ్గరికి పోదాం పదండి. అక్కడి సత్రాలలో ఒక సత్రపు గదిలో ఒక "కాన్గీ వీధి బడి" నడిచేది. అంటే ప్రైవేటు బడి అన్న మాట. అక్కడి ముసలి కోపిష్టి పంతులు ఆర్‌కె నారాయణ్ నవల "స్వామి స్నేహితులు"లో మిడిగుడ్ల వేదనాయగం పంతులు లాగే ఉండేవాడు. (ఆ కారికేచర్ గీసింది ఆర్కే లక్ష్మణ్) అతను ఒకవైపు పాఠాలు చెపుతూనే మరోవైపు తన కులవృత్తిఐన కమ్మరి కొలిమి పని కూడా చూసుకునేవాడు. ఆ వీధిబడి చిత్రహింసల కొలిమిలా ఉండేది. ఎక్కాలు, పద్యాలు సరిగ్గా అప్పచెప్పని మొద్దు శిష్యులకు కాళ్లకు బేడీలు, మెడలో ఒక గుదిబండ వేసేవాడు. కొందరేమో కోదండానికి వేలాడుతుండేవారు. మరికొందరు గోడకుర్చీ పొజీషన్‌లో ఉండేవారు. ఒకరిద్దరు కోడిలాగా కాళ్ల సందుల్లో నుండి చేతులు దూర్చి చెవులు పట్టుకుని వొంగి ఉండేవారు. మరికొందరు విద్యార్థులు వంతుల వారిగా కొలిమి తిత్తిని ఊదుకుంటూ కనబడేవారు. పిల్లల వీపులపై చింతబరిగెలు విరుగుతుంటే వారి శోకాలతో ఆ సడక్ మొత్తం దద్దరిల్లి పోయేది. దారినపోయేవారు ఎవరు కూడా ఆ పంతులును ప్రశ్నించక పోయేది. దేహశుద్ధి జరిగితే కాని చదువురాదని నమ్మే అమాయకపు కాలం అది. ఆ పంతులు శిక్ష(ణ) పుణ్యమా అని పాపం ఎంతమంది పసిపిల్లలు చదువుకు దూరం అయ్యారో!

అలియాబాద్ చౌరాస్తాలో ఒక చిన్న ఇరానీ హొటల్ ఉండేది. దేవానంద్ సీన్మాలలో మహమ్మద్ రఫీ పాడిన పాటలు వీనుల విందుగా గాలిలో అలలు అలలుగా తేలి మమ్మల్ని పలకరించేవి. "తస్వీర్ తెరీ దిల్‌మే" అన్న పాట మా చెవులకు అలవోకగా సోకగానే మా కాళ్లు మంత్రించినట్లు టక్కున ఆగిపోయేవి. పాట సాంతం అయిపోయినాకనే అక్కడ్నుంచి భారంగా కదిలేవారం. "దిల్ తేరా దీవానా హై సనమ్" అన్న పాట వింటుంటే మాత్రం నిజంగా వర్షంలో తడుస్తున్నట్లే అనిపించేది.

నా "మాల్గుడి డేస్" ముచ్చట్లు మాల్గాడి గూడ్స్ ట్రైన్స్ అంత పొడుగ్గా ఉంటవి. మౌఖా (అవకాశం) దొరికితే మళ్లెప్పుడైనా చెప్త!

**అంతవరకూ ఖుదా హాఫీజ్.**

*(షహర్ నామా (హైద్రాబాద్ వీధులు - గాథలు) పుస్తకం నుంచి)*

**-పరవస్తు లోకేశ్వర్,**
m: 91606 80847
e : lokeshwar.hyderabadi@gmail.com

# ప్రకృతి మనల్ని ఈ సృష్టినుంచి తొలగించే ప్రయత్నం చేస్తోందా?

## ప్రకృతి ప్రయోగించిన ఆయుధమే కరోనా వైరస్?

ప్రకృతి ఓ గొప్ప ప్రయోగకర్త. అది ఎలా ప్రయోగాలు చేస్తుందని మీరు అనుకుంటున్నారా? ఒక్కముక్కలో చెప్పా లంటే సృష్టికి అండగా నిలువని జీవజాతులను అది వేరు చేస్తుంది. లక్షలాది ఏళ్లుగా అది అలా ప్రయోగాలు చేస్తూనే ఉంది. డైనోసార్లను అది పక్కకు తప్పించింది. సాబెర్ టూత్ పులిని కూడా అలానే చేసింది. మనిషికి పూర్వీకులుగా భావించే రామాపితెకస్ అనే జీవుల్ని కూడా ఉనికిలో నుంచి తొలగించింది. అదే విధంగా పురాతన మనుషులుగా గుర్తించే నియాండర్తల్స్‌ను కూడా ప్రకృతి పక్కకు తప్పించింది.



వీటిలో కొన్ని జాతులు 2లక్షల ఏళ్లు కూడా జీవించాయి. మరి కొన్ని జాతులు కోటి నుంచి 2 కోట్ల సంవత్సరాల పాటు మనుగడలో ఉన్న జీవులు కూడా ఉన్నాయి. మరి మనుష్యుల సంగతి ఏంటి? మానవ జాతి ఎప్పటికీ నిలిచి ఉంటుందా? మనం ఎప్పటికీ నిలిచి ఉండాలంటే, యావత్ సృష్టికి మనం ప్రయోజన కారులుగా ఉండాలి. అలా ఉండలేనప్పుడు, ప్రకృతి ఏం చేస్తుంది? మానవ జాతిని కూడా ప్రకృతి తన జీవరాశుల జాబితాలో నుంచి తొలగించి వేస్తుంది. మరి మనం నిజంగానే సృష్టికి మేలు చేసే వారిగా ఉన్నామా?

భూగోళంతో మీరు గనుక సంభాషించి ఉంటే, మన గురించి అది ఏమనుకుంటుందో మనకు చెప్పి ఉండేది. మన తీరు పట్ల అది ఎంత మాత్రం సంతోషంగా లేదు. ఇప్పుడు ఉనికిలో లేని మశూచి వైరస్ ఎంత నష్టం కలిగించిందో అంతకు మించిన నష్టాన్ని మనం కలిగిస్తూ ఉండవచ్చు. మన భూగోళం పట్లనే మనం క్రూరంగా వ్యవహరిస్తున్నాం.

మీరు మరే జీవరాశినైనా చూడండి. ఒక జీవి మరో జీవిని చంపుతుంది, ఎందుకోసం? తన ఉనికికి ముప్పు వాటిల్లినప్పుడు లేదా దాని నుంచి దాడి ప్రమాదం ఉన్నప్పుడు లేదంటే బాగా ఆకలి వేసినప్పుడు మాత్రమే. కానీ, మనుషులుగా మనం మాత్రం ఈ విషయంలో పరిణతి చెందలేదు. మనం మన ఉనికి కోసం కాకుండా ఇతర జీవరాశులపై, యావత్ భూగోళంపై మన ఆధిపత్యం కోసం లేదా కొన్ని సందర్భాల్లో మన సరదాల కోసం వాటిని చంపుతున్నాం.

కరోనా వైరస్ గురించి యావత్ ప్రపంచంలోనూ గందరగోళం నెలకొంది. మానవజాతి అనే వైరస్ ను తొలగించేందుకు ప్రకృతే కరోనా వైరస్ ను సృష్టించే ఉంటే మన పరిస్థితి ఏంది? అందుకు ఎంతో అవకాశం ఉంది. ఎందుకంటే, మనం సృష్టికి ఏమాత్రం ప్రయోజనకరంగా లేం. ప్రకృతి మనల్ని తప్పించేందుకు చేస్తున్న ఎన్నో ప్రయత్నాలను మనం చూశాం. ప్రస్తుత పరిస్థితుల్లో చైనానో... చైనా ప్రజలో సమస్య కాదు.

మరి సమస్య ఏంటి? మన సొంత చైతన్యమే మనకు సమస్యగా మారింది. మనం బతికే ఉన్నాం కానీ మరో ప్రపంచంతో వేరై పోయిన అనుభూతితో ఉన్నాం. మనం జీవించే ఉన్నాం కానీ మన చుట్టూ ఉన్న వారితో వేరై పోయి నట్లుగా అనుభూతి చెందుతున్నాం. ఈ విధమైన అవగాహనే దాని సొంత స్పందనలకు దారి తీసింది. దాన్నే ఇప్పుడు ప్రపంచంలో మనం చూస్తున్నాం. దాన్నే మనం కేన్సర్‌గా, విపత్తులుగా లేదా కరోనా వైరస్‌గా చూస్తున్నాం.

మేల్కోవాల్సిన సమయం వచ్చింది. ఒకరితో ఒకరం కలసి ఉండలేని పరిస్థితిలో మనం ఇక జీవితాన్ని కొనసాగించలేం. ఒకరితో ఒకరం లేదంటే ఇతర జీవరాశులతో మనం ఎంత వేరుగా ఉంటే, మన చుట్టూరా సమస్యలు అంతగా అధికం కానున్నాయి. నిజంగా మీరు గనుక ప్రశాంతమైన ప్రపంచం కోసం చూస్తుంటే, మీరు గనుక నిజంగా మరింత ఆనందదాయక ప్రపంచం కోసం చూస్తుంటే, మన పిల్లల కోసం అందమైన ప్రపంచాన్ని నిర్మించాలనుకుంటే, ఇప్పటికే పరివర్తన మొదలుకావాల్సి ఉండింది. ఇప్పటికే ఎంతో ఆలస్యమైంది. దాని ఫలితమే మనం అనుభవిస్తున్నాం.

- ప్రీతాజీ
e:speaking@pkconsciousness.com
www.pkconsciousness.com

# ఆవరణ వ్యవస్థల పునరుద్ధరణ – అవగాహనా చైతన్యం

రాచెల్ కార్సన్ తన 'సైలెంట్ స్ప్రింగ్' అనే గ్రంథంలో మూడవ అధ్యాయం పేరు 'Elixirs of Death'. ప్రపంచ చరిత్రలో ప్రతి మనిషీ రసాయనిక పదార్థాల సంబంధంలోకి వచ్చాడని, గర్భస్థ శిశువు మొదలుకొని మరణం వరకు ఈ రసాయనాల ప్రభావానికి గురికాకుండా వుండటం దాదాపు సాధ్యం కాదంటుంది. రసాయనిక పదార్థాలు క్రిమి, కీటక నాశినులుగా మనకు ఇంచుమించు రెండవ ప్రపంచ యుద్ధకాలం నుండి వినియోగంలోకి వచ్చాయి. కృత్రిమ రసాయనాలు సజీవ, నిర్జీవ ప్రపంచం అంతటా పంచబడి ఉన్నాయని అంటుంది. అవి ప్రధాన జీవనదీ వ్యవస్థలు మొదలుకొని భూగర్భ జలాల నీటి పాయలలోకి భూమి ద్వారానే ప్రవహిస్తున్నాయని పేర్కొంటుంది. ఈ రసాయన అవశేషాలు భూమిలోకి, చేపలు, పక్షులు, సరీసృపాలు, పెంపుడు జంతువులు, వన్య ప్రాణులు మొదలైన వాటి శరీరాల్లోనూ కనిపిస్తాయని సార్వత్రికంగా పరిశోధనలు చేసే శాస్త్రవేత్తలు చెపుతున్నమాట. వీటిపై ప్రయోగాలు చేసే శాస్త్ర పరిశోధకులు రసాయన కాలుష్యానికి గురి కాకుండా మిగిలిన ప్రాణికోటి అంటూ ఏదీ లేదని చెపుతున్నారు. ఇవి మారుమూల పర్వత ప్రాంతాలలోని కొలనులు, సరస్సులలోను, చేపల్లో, భూమి పొరల్లోని వాన పాముల్లో, పక్షుల గుడ్లల్లో, అంతెందుకు మనుష్యుల్లోనూ, వారి శరీరాల్లోనూ చేరాయి. ఇవి ఇప్పుడు మానవ దేహాలలో నిల్వలుగా మారాయి. ఈ రసాయనాలు తల్లి పాలు మొదలుకొని ఇంకా పుట్టని పిల్లల కణాలలోకి ప్రాకింది. ఇంతగా ఇది పెరగడానికి రసాయనిక పరిశ్రమలు పెరగడమేనని, కీటకాలను నాశనం చేసే రసాయనిక ధర్మాలు గల రసాయనాలు కృత్రిమంగా రసాయన పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్నాయని ఆమె పేర్కొంది. ఆమె అధ్యయనం వల్ల ప్రపంచానికి అనేక చేదు నిజాలు కటువైన వాస్తవాలు కూడా తెలిసొచ్చి అర్థశతాబ్ది కాలం గడిచింది. అయినా పరిస్థితులలో ఏ విధమైన మార్పు లేదు కదా అసలు ఈ రసాయన పరిశ్రమలనేవి రెండవ ప్రపంచ యుద్ధానికి పుట్టిన బిడ్డగా పేర్కొనటం పరిపాటి.



రాచెల్ కార్సన్

ఆనాడు భూమండలం ఎదుర్కొంటున్న ప్రకృతి, పర్యావరణ సమస్యలు, సంక్షోభాలకు మూలాలు ఈ కృత్రిమ రసాయనిక పదార్థ ఉత్పత్తిలో ఉందని అర్థం చేసుకోవాలి. మనిషి చేసే కార్యకలాపాల ద్వారా భూమిపై 'జీవం' భారీ ఎత్తున అంతరింపుకు గురవుతూ ఉంది. కొన్ని అధ్యయనాల అంచనా ప్రకారం సగటున రోజుకు ఒక వంద చొప్పున జీవజాతులు అంతరిస్తూ ఉన్నాయి. రానున్న కాలంలో ఈ అంతరింపుల వృద్ధిరేటు మరింత మరింతగా పెరిగే అవకాశం ఉంది. భూమి మీద ప్రాణాన్ని, జీవాన్ని కాపాడు సహజ వనరులైన గాలి, నీరు, భూమి కాలుష్యానికి గురవుతున్నాయి. క్షీణతను పొందుతూ ఉన్నాయి. మానవాభివృద్ధి అంతకంతకు ఇబ్బడిముబ్బడిగా పెరుగుతూ వస్తున్నది. రెండువేల సంవత్సరానికి ఆరు బిలియన్ల ప్రపంచ జనాభా ఉండగా 2010 నాటికి అదనంగా మరొక బిలియన్‌కి చేరింది. మరి 2021 నాటికి ప్రపంచ జనాభా కనీసంగానైనా బిలియన్ పెరిగి ఉంటుంది. ఈ లెక్కలు ఎందుకు పేర్కొనటమంటే వనరుల క్షీణత, తరిగిపోవటం అనేది పెరిగిన జనాభాను బట్టి అది మరి రెండింతలు మూడింతలు కావటం సహజమే కాదు. జనాభా పెరిగే కొద్దీ తరుగుదల, క్షీణతలు వృద్ధి పొందుతూ ఉంటాయి. 2021 ప్రపంచ జనాభా 7.9 బిలియన్లు ప్రపంచ వ్యాప్తంగా విష పదార్థాలు పోగుపడుతూ భవిషత్ తరాలను బాధించడానికి తయారుగా ఉన్నాయి. అడవులు, చిత్తడి నేలలు, పర్వతాలు, పచ్చిక బయళ్ళు వృద్ధి చేయక అతిగా వినియోగింపబడ్డాయి. ఓజోను పొర క్షీణత గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావం ఏదైతేనేం మానవ కార్యకలాపాలు భూగ్రహంమీద వాతావరణానికి హాని కారకంగా మారాయి.

మన సంస్కృతిలో ఉన్న ఒక ధోరణి ఏమంటే ఇటువంటి వన్నీ శాస్త్ర సంబంధ సమస్యలని, సాంకేతికమైనవో లేదా రాజకీయమైన

సమస్యలుగా చూడటానికి మాత్రమే అలవాటు పడ్డాం. ఈ సమస్యలను, సంక్షోభవాలను పరిష్కరించే శక్తి సామర్థ్యాలు మనకు లేవని భావిస్తూ ఉంటాం. ప్రకృతి, పర్యావరణ సంబంధ సమస్యలను, సంక్షోభావాలను అవగాహన చేసుకోవటం ఒక ఎత్తు. వాటిని పరిష్కరించటంలో, అధిగమించడంలో ఎదురయ్యే సవాళ్లను అర్థం చేసుకోవటం మరొక ఎత్తు.

పర్యావరణ సమస్యలు ఏవైనా మానవాళి ముందు పెట్టే ప్రశ్న ఒక్కటే. మనం ఎటువంటి మానవులం? వేటికి విలువను ఇస్తాం? ఎటువంటి జీవితాలను గడుపుతున్నాం? జీవన విధాన విలువల మాట ఏమిటి? ప్రకృతిలో మనుషులుగా మనస్థానం ఏమిటి? ఎటువంటి ప్రపంచాన్ని లేదా ప్రపంచంలో మనం మనుగడ సాగించాలనుకుంటున్నాం?

భారతీయ చింతనలో 'ధర్మం' అనే భావన లేదా మాట ఉంది. ఈ పదంలో వ్యక్తి విధి, నైతికత, బాధ్యత, చట్టం, న్యాయం లాంటివన్నీ ఇమిడిపోయి కనిపిస్తాయి. ధర్మమనేది వాస్తవికత కుండే నిర్మాణాన్ని సూచిస్తుంది. ఇదొక విశ్వసూత్రం. ముఖ్యంగా న్యాయబద్ధ చట్టబద్ధ జీవన విధానాన్ని అభివృద్ధిని సూచిస్తుంది. ఇది సనాతనం శాశ్వతం. సమస్త విశ్వానికి ఇదొక ఆసరా. ధర్మం యొక్క ప్రయోజనం ఏమంటే సమాజాన్ని నడపటం, ప్రపంచాన్ని నిర్వహించటం. ధర్మమనేది స్థల, కాల, పరిస్థితులను బట్టి మార్పులకు లోనవుతుంది. అయినప్పటికీ ఒక సంతులనాన్ని అది కలిగి ఉంటుంది.




ధర్మం అనేది సమాజంలోని ప్రతి విడి వ్యక్తి జీవనంలో అంతర్భాగమవుతూ మానవాళి సంక్షేమానికి దోహదకారిగా నిలవాలి. వ్యక్తి తన స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకునేందుకు కాదు ధర్మం ఉపకరించాల్సింది. ధర్మ శాస్త్రాలుగా పిలవబడేది వ్యక్తి నైతిక ప్రవర్తనావళిని నిర్దేశించాయి. సమస్త జీవరాశికి, సమస్త మానవాళికి సంక్షేమాన్ని కోరేవి. నాటి సురక్షిత జీవనానికి ఉపయోగపడే మానవ చర్యలే విలువైనవి, ప్రయోజన భరితమైనవని శ్రీకృష్ణుడు భగవద్గీతలో బోధిస్తాడు. సమృద్ధి, సంతోష సౌఖ్యాలనేవి క్రమబద్ధమైన సమాజం మీద ప్రజలు ఏమేరకు ఆధారపడి ఉంటారనే దానిని బట్టి నిర్ణయమవుతుంది. ప్రకృతిని విధేయంగా అనుసరించటం ద్వారానే అభ్యుదయం పొందటం జరుగుతుంది. ప్రకృతి పట్ల అవిధేయత, ఆధిపృతభావం ఎప్పుడూ వినాశనానికే దారి తీస్తుంది.

భారతీయ సాంఖ్య దర్శనం ప్రకారం మౌలిక పదార్థం అనేది ఒక శక్తి పొట్లం. దీనిలో ధన, ఋణ, తటస్థ శక్తులుంటాయి. ఇవి నిరంతరం ప్రవాహ స్థితిలో ఉంటాయి. ప్రతి ఒక్కటి మరొక దాని ఆధిక్యం కోసం ప్రయత్నిస్తూ ఉంటాయి. వీటినే ప్రకృతి గుణాలు అంటాం. చైతన్యం గల మానవులలో ఇవి ఎంతో విలువను కలిగి ఉన్నటువంటివి. ప్రకృతి సంద్వంతు, సమృద్ధం కూడా. ప్రకృతి శక్తివంతమైనది. భయావహమైంది. ప్రకృతి దయగలది. సున్నితమైనది. ప్రకృతిని దోపిడీ చేసినా, దుర్వినియోగం చేసినా అది దూరమవుతుంది. ప్రకృతిని ఎంతో ప్రేమ ఆదర, గౌరవ భావంతో చూడవలసి ఉంటుంది. ప్రకృతి మనకు తన వనరుల ద్వారా సేవ చేసే మాట నిజమే కాని, సద్వినియోగం చేసుకో పోతే ప్రతి స్పందిస్తుంది. ప్రతి చర్యకు పూనుకుంటుంది. ప్రగతికి, సమృద్ధికి ప్రకృతిని ఎంతో వివేకవంతంగా, విచక్షణా పూరితంగా, న్యాయ సమ్మతంగా వాడుకోవలసి ఉంటుంది. విచక్షణ, వివేక రహితంగా ప్రకృతిని అతిగా శాసిస్తే తొలుత అవి మన తప్పిదాలకు హెచ్చరికలు చేసి సరిదిద్దుకునేలా చేస్తుంది. మనం ప్రకృతిని లక్ష్య పెట్టని పక్షంతో తీవ్రంగానే ప్రతి స్పందిస్తుంది.

మన పర్యావరణంలో పంచభూతాలు ప్రకృతిలోంచి ఉద్భవించినదే. మౌలిక శక్తి సంపుటిలోని ప్రత్యేక విస్తరణ రూపాలే పంచభూతాలు. అయితే వీటికి దేనికదిగా జీవం, రూపం, స్థానం విడిగా ఉన్నప్పటికనీ, ఇవి ఒకదానికొకటి సంబంధం కలిసి ఒకటి మరొకదానిపై ఆధారపడేటువంటివి.

ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, భూమి మొదలైన పంచ భూతాల గురించి నారాయణ ఉపనిషత్ చెబుతుంది. ఉపనిషత్తులు పంచభూత సిద్ధాంతం గురించి సమగ్ర పద్ధతిలో వివరిస్తున్నాయి. వీటికి బ్రహ్మానికి మధ్య సంబంధాన్ని కూడా చెబుతాయి. తైత్తిరీయోపనిషత్ ఒకదాని నుంచి ఒకటి ఉద్భవించినట్లుగా పేర్కొంటుంది. సృష్టి లేదా ప్రకృతి పంచభూతాత్మకం అంటూ ఉండటం దీనివల్లనే.

పంచభూతాత్మక సృష్టి లేదా ప్రకృతిని అర్థం చేసుకోవడంలోనే మనిషి వివేకం దాగి ఉంటుంది. అందుకే ప్రకృతిని అర్థం చేసుకోవటం అంటే ప్రజల సంస్కృతిని అర్థం చేసుకోవటం. సంస్కృతిని అవగతం పరచుకోవటం ద్వారా జీవన విధానం బోధ పడుతుంది. జీవన విధానం బోధపడటం ద్వారా దానిని నడుపుతూ ఉన్న విలువలు, ఆదర్శాలు అవగతమవుతాయి. తద్వారా ప్రకృతి – సంపర్కము మధ్య నుండే చర్యాపచర్యలు, సంవాద సంపర్కాలను స్పష్టంగా గుర్తించటం సాధ్యపడుతుంది.

ప్రొసోపిస్ సినరేరియా (Prosopis Cineraria) అనే వృక్ష జాతికి, బిష్ణోయి తెగకు ఉన్న అనుబంధం మనమందరమూ ఎరిగి ఉన్నదే. రాజస్థాన్ ఎడారి ప్రాంతం. రాజస్థాన్ రాష్ట్ర వృక్షం ఖేజ్రి. తెలంగాణ ప్రాంతంలో ఇదే వృక్షాన్ని జమ్మిగా వ్యవహరిస్తాం. 1739 ADలో రాజస్థాన్‌లోని జోద్‌పూర్ సమీప గ్రామమైన ఖేజల్లిలో

హింసాత్మకమైన పర్యావరణ ప్రతిఘటన సన్నివేశం చరిత్ర నమోదు చేసింది. అమృతాదేవి అనే మహిళ తన ఇద్దరు కూతుర్లతో ఖేజ్రి వృక్షాలను కాపాడబోయి తమ ప్రాణాలనే అర్పించారు. తన రాజ ప్రసాదానికి మార్గం కోసం అడ్డుగా ఉన్న ఖేజ్రి వృక్షాలను నరికి వేయమని మహారాజా అభయ్ సింగ్ ఫర్మానా జారీ చేశాడు. ఇది పెద్ద సంఘర్షణకు దారి తీసింది. 363 మంది ఈ చెట్లను కాపాడు కునేందుకు తమ ప్రాణాలను ఇచ్చారు. 1970లలో మొదలైన చిప్కో ఉద్యమానికి మూలం ఈ ప్రాణత్యాగం చేసిన ప్రజలే. ఎందుకు వారు ఈ చెట్లను కాపాడాలనుకున్నారు. ఎడారిలో నీడను ఇచ్చే చెట్లు ఇవే. రాముడు లంకా విజయం కోసం శమీ వృక్షాన్ని పూజించాడని రామాయణం చెపుతూ ఉన్నది. పాండవులు వనవాసం, అజ్ఞాత వాసాల సందర్భంలో తమ శస్త్రాలను శమీ వృక్షంపైన భద్రపరిచినట్లు, అందువల్ల జమ్మి వృక్ష పూజ జరుగుతున్నట్లు ఇతిహాస, కావ్యాలు తెలుపుతూ ఉన్నాయి. విజయ దశమి రోజు క్షత్రియ అస్త్ర, శస్త్రాలకు పూజలు చేస్తే, బ్రాహ్మణులు శమీ వృక్ష పూజ సల్పుతూ ఉండటం మన సంస్కృతిలో ఉన్నటువంటిదే. ఖేజ్డాలి గ్రామ సంఘటన గురించి రామచంద్రగుహ లాంటివారు రాశారు కూడా. గ్రహించ వలసిందేమంటే స్థానిక పర్యావరణ వ్యవస్థలతోటి ప్రజలు ఎంత సామరస్యంలో జీవించే విధానాలు, ఆదర్శాలలో ఉన్నారనేది.



జమ్మి వృక్షం



వాల్మీకి రామయాణంలో ప్రకృతి ఆకర్షణీయంగా వర్ణించబడింది. అంతటి లంకలో దుష్టరావణుడు కూడా ప్రకృతి పట్ల ప్రేమ ఉన్నవాడుగానే కనిపిస్తాడు. అతడు సీతాదేవిని ఉంచింది అశోక వనంలోనే కదా! అదెలా ఉందో వాల్మీకి చెప్పనే చెప్పాడు. ఆవరణ వ్యవస్థల గురించి ఇతిహాస, కావ్య, ప్రబంధాలు ఏవో ఒక మేరకు చిత్రించాయి. వాటిని నేటి కాలానికి అన్వయిస్తూ అర్థం చేసుకోవటం ఎంతయినా అవసరం.

2021 సంవత్సరానికి గాను ఐక్యరాజ్య సమితి 'ఆవరణ వ్యవస్థల పునరుద్ధరణ' అనే అంశాన్ని థీమ్‌గా ప్రకటించింది. మనం, మన సంస్కృతికి పర్యావరణ వ్యవస్థలకు మధ్యగల సంబంధాన్ని మునపటికంటే అధికంగా, విస్తృతంగా అధ్యయనం చేయవలసిన అగత్యంలో ఉన్నాం. వినిమయ సంస్కృతి విపరీతంగా పెరిగిన ప్రస్తుత సమయంలో వినిమయ సంస్కృతిని పెంచిపోషిస్తూ ఉన్న విలువలను, ఆ విలువలను నిర్దేశిస్తున్న పెట్టుబడి ధోరణులను, వైఖరులను నిశితంగానే పరిశీలించాలి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించాక జరిగిన చెరువుల పునరుద్ధరణ ఆవరణ వ్యవస్థల పునరుద్ధరణ ప్రక్రియలో ఒక మేలైన అడుగు. అదే విధంగా 'హరితహారం' కూడా సతత హరితత్వాన్ని ఆకాంక్షిస్తున్నది. ప్రకృతి – సంస్కృతుల మధ్య తలెత్తే వైషమ్య, వైరుధ్యాలను రెంటినీ పర్యావరణ దృక్పథంలో బోధపరచుకున్నప్పుడే సరైన చైతన్యం కలిగి ఉండగలం. ప్రకృతిని పరిరక్షించడమంటే సంస్కృతిని సంరక్షించుకోవటం. సమృద్ధిపరచుకోవటమే.

– డా॥ ఆర్. సీతారామారావు
m : 9866563519
e: sitametaphor@gmail.com

JBR
ARCHITECTURE COLLEGE
HYDERABAD
(Approved by Council of Architecture, New Delhi - Affiliated to JNA&FAU Hyderabad)
E-mail : jbrarchitecture@jbgroup.org.in, www.jbrachitecture.com

# చిన్నారులను కాటేస్తున్న కరోనా

కరోనా వైరస్ చిన్నారులను ఏం చేయనుందనే విషయంలో మనం అంత అప్రమత్తంగా ఉండడం లేదు. వైరస్ మార్పు చెందుతూ మరింత తీవ్ర పరిణామాలు కల్పించేదిగా మారుతున్న కొద్దీ రేపటి నాడు పిల్లలపైనే దాని ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉంది. సింగపూర్‌లో ప్రాథమిక, మాధ్యమిక స్థాయి విద్యాసంస్థలన్నిటినీ మే 19 నుంచి తాత్కాలికంగా మూసివేశారు. భారత్ లో మొదటిసారిగా కనిపించిన వైరస్ రకం సింగపూర్‌లో కూడా బయటపడి పెద్దల కంటే ఎక్కువగా పిల్లలను ప్రభావితం చేస్తోందని ప్రకటించిన నేపథ్యంలో అధికారులు ఈ చర్య తీసుకున్నారు.

బ్రెజిల్‌లో మాదిరిగానే, ఈ వైరస్ అసాధారణంగా అధిక స్థాయిలో చిన్నారులను హతమార్చింది. ఇటీవలి కాలంలో బ్రెజిల్‌లో ఐదేళ్ల లోపు చిన్నారులు 2,200 మంది కంటే ఎక్కువ మంది చనిపోయినట్లుగా వార్తలు వచ్చాయి. అంత తక్కువ వ్యవధిలో ఇంత అధిక సంఖ్యలో చిన్నారులు మరెక్కడా మరణించిన దాఖలాలు లేవు. కోవిడ్ పై విజయం సాధించిన తైవాన్ సైతం రాజధాని తైపీలో మే 28 వరకు పాఠశాలలను మూసివేసింది. ఈ వారంతంలో చిన్నారులకు సంబంధించి 300కు పైగా కొత్త కేసులు నమోదైన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.



ఇవన్నీ కూడా మనకేం చెబుతున్నాయి? ముప్పు పొంచి ఉన్న మాట నిజం. హెచ్చరికలు అధికమవుతున్నాయి. భారతదేశంలో థర్డ్ వేవ్ రానుందని చెబుతున్నారు. అలాంటి చోట ఈ హెచ్చరి కలను మరింత తీవ్రంగా పరిగణనలోకి తీసుకొని, ముందుగానే సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. సింగపూర్‌లో పాఠశాలలు మూసి వేస్తున్నారు. ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో నుంచే నేర్చుకోవడం ప్రారంభమైంది. సింగపూర్ కొంత కాలం క్రితమే ఈ మహమ్మారి సమయంలోనూ అత్యంత సురక్షితమైందిగా గుర్తింపు పొందింది. అలాంటి చోటనే ఇప్పుడు చిన్నారులకూ కోవిడ్ సోకుతోంది. ఇటీవల ఒక్క రోజే స్థానికంగా వ్యాపించిన కేసులు 38 నమోదు అయ్యాయి. ఏడాది కాలంలో ఒక్క రోజు నాడే అన్ని కేసులు రావడం అదే మొదటిసారి. ఓ ట్యూషన్ సెంటర్ కు సంబంధించిన నలుగురు చిన్నారుల కేసులు కూడా వాటిలో ఉన్నాయి. ఇవన్నీ కూడా బి.1.617 రకానికి చెందినవి. ఈ రకాన్ని మొదటిసారిగా భారత్‌లో గుర్తించారు.

కరోనా వైరస్‌లో చోటు చేసుకుంటున్న మ్యుటేషన్లలో కొన్ని మరింత ప్రమాదకరమైనవని, అవి చిన్నారుల్లో కూడా మరింతగా వ్యాపించే అవకాశం ఉందని సింగపూర్ విద్యాశాఖ మంత్రి ఒంగ్ ఎ కుంగ్ అన్నారు. ఈ చిన్నారుల్లో ఎవరూ కూడా అంత తీవ్రంగా అనారోగ్యానికి గురి కానప్పటికీ, అది అందరికీ ఆందోళన కలిగించే అంశమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఈ టర్మ్ ముగిసే వరకు పాఠశాలలన్నిటినీ మూసివేస్తున్నట్లుగా అధికారులు ప్రకటించారు. అంతేగాకుండా 16 ఏళ్ల లోపు పిల్లలకు కూడా టీకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.

మహమ్మారి విజృంభణ సమయంలో దాన్ని బాగా కట్టడి చేసిన తైవాన్ కూడా ఇప్పుడు ఇదే విధమైన చర్య తీసుకుంది. వారంతంలో అక్కడ 333 కేసులు నమోదయ్యాయి. సురక్షిత ప్రాంతంగా తైవాన్ కు ఉన్న పేరు ప్రఖ్యాతులకు ఈ వైరస్ ముప్పు తెచ్చేదిగా మారింది. చిన్నారులకు సైతం కరోనా సోకుతుందేమోనని అధికార వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. తైపీతో పాటుగా పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యాసంస్థలు ఈ టర్మ్ ముగిసే వరకూ తరగతులు రద్దు చేశాయి.

హాంకాంగ్‌లో దక్షిణాఫ్రికా రకానికి చెందిన ఇన్ఫెక్షన్లు పెరిగిపోతున్నాయి. ఇలాంటి వైరస్ సోకిన వారిలో అతి పిన్న వయస్కురాలిగా నాలుగు నెలల చిన్నారిని గుర్తించారు. దీంతో పాఠశాలకు వెళ్లే చిన్నారులకందరికీ టెస్టులను తప్పనిసరి చేయాలని, అన్ని తరగతుల్లోనూ విద్యార్థుల సంఖ్యను పరిమితం చేయాలని ఆరోగ్య నిపుణులు సూచించేందుకు ఇది బాట వేసినట్లయింది.

బ్రెజిల్ విషయానికి వస్తే, అక్కడ పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉంది. ఇటీవలి నెలల్లో కరోనా వైరస్ అసాధారణ రీతిలో అధిక స్థాయిలో చిన్నారులను బలిగొంటోంది. ఐదేళ్లలోపు చిన్నారులు కనీసం 832 మంది ఈ వైరస్ కారణంగా మరణించారు. నిజానికి ఈ సంఖ్య చాలా తక్కువని, విస్తృత స్థాయిలో పరీక్షలు జరగనందున మరెన్నో మరణాలు లెక్కలోకి రాకుండా పోయి ఉంటాయని ఆరోగ్యరంగ నిపుణులు అంటున్నారు. ఈ వైరస్ మరింతగా మ్యుటేట్ చెందుతున్నందున, అది గర్భస్థ శిశువులతో సహా చిన్నారులపై మరింత ప్రభావం కనబర్చగలదని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న ఈ ధోరణులను భారత్ పరిశీలించాల్సిన అవసరం ఉంది. థర్డ్ వేవ్ వచ్చే ముప్పు ఉన్నందున ముందుగానే దానికి సన్నద్ధం కావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా పిల్లల సురక్షితకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. సాధ్యమైనంత త్వరగా దిగువ పేర్కొన్న చర్యలు తీసుకోవాలి.

- రాష్ట్ర, జిల్లాస్థాయిలో పిడియాట్రిక్ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి
- అన్ని స్థాయిల్లో పిల్లలకు నిర్దిష్ట సంఖ్యలో బెడ్స్ రిజర్వు చేయాలి
- పిల్లకు అవసరమైన మందులు, ఇతర ఉపకరణాలు సిద్ధంగా ఉంచుకోవాలి
- పిల్లలకు సాధ్యమైనంత త్వరగా టీకాలు ఇవ్వాలి

థర్డ్ వేవ్ రూపంలో మరోసారి మహమ్మారి వ్యాపించకుండా చూసుకునేందుకు భారత్‌కు ఇప్పటికీ అవకాశం ఉంది. ఆ అవకాశాన్ని ఇప్పుడు వాడుకోవాలి.

- సేకరణ : డెస్క్, m : 9030 6262 88
e: desk.deccan@gmail.com

## అలనాటిమేటి తెలంగాణ శాసనాలు-10

# విరియాల కామవసాని గూడూరు

## కన్నడ-తెలుగు శాసనం (క్రీ.శ.1124)

నిజానికి ఈ శాసనం విరియాల కామవసానిది కాదు. ఆమె విడుదల చేయలేదు. అయితే ఈ శాసనంలో ఆమె చేపట్టిన ఒక ఘనకార్యం కాకతీయుల చరిత్రను ఒక మలుపు తిప్పింది. కాకతీయులు కేవలం సామంతులుగానే మిగిలిపోకుండా, వారు స్వతంత్ర రాజులుగ నిలిదొక్కుకొని, తరువాతి కాలంలో ఒక విశాల సామ్రాజ్యాన్ని పాలించటానికి దోహదపడిన సంఘటనకు నాంది పలికింది. మరి ఇంతకీ ఈ శాసనం ఎవరిది? జయన్తీపురం నుంచి పాలిస్తున్న కళ్యాణ చాళుక్య ప్రభువు, ఆరో విక్రమాదిత్యుని (క్రీ.శ.1076-1127) కుమారుడు, కొలనుపాక నుంచి పాలిస్తున్న యువరాజు కుమార సోమేశ్వరుని దండనాయకుడైన స్వామిపయ్య విన్నపమున్న శాసనం. కాబట్టి ఇది స్వామిపయ్య శాసనమనవచ్చు. విరియాల వంశీకుడైన మల్లుడు, గుముడూరులో నిర్మించిన శివాలయాన్ని ప్రస్తావిస్తున్న శాసనంగాబట్టి, విరియాల మల్లుని శాసనమని కూడా అనవచ్చు. కళ్యాణ చాళుక్య ప్రభుత్వాన్ని కీర్తిస్తున్న శాసనం, గాబట్టి ఇది వారి శాసనమనవచ్చు. కానీ ఒక చారిత్రక అవసరంగా, కాకతీయ గరుడ బేతరాజును అనుమకొండ సింహాసనంపై కూర్చొండ బెట్టటానికి మరో రాజు సహకారంతో, సార్వభౌముని ఒప్పించిన రాజకీయ చతుర కామవసాని. అందుకని, విరియాల కామవసాని శాసనమంటేనే సరిపోతుంది.

మునుపటి వరంగల్ జిల్లా, జనగామ తాలూకాలోని గూడూరు శాసనం క్రీ.శ.1124 నాటిది. ఈ శాసనాన్ని 1966వ సం॥లో అప్పటి ఆంధ్రప్రదేశ్ పురావస్తు ప్రదర్శన శాలల శాఖ నకలు తీసి, ఆ సం॥పు వార్షిక శాసన నివేదికలో 321వ శాసనంగా క్లుప్త వివరణనిచ్చింది. ఆ తరువాత, డా. ఎన్. వెంకటరమణయ్యగారి సంపాదకత్వం, డా.ఎన్. రమేశన్‌గారి ప్రధాన సంపాదకత్వంలో అదేశాఖ 1974లో ప్రచురించిన **ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ - వరంగల్ డిస్ట్రిక్టు** హైదరాబాదు, పుస్తకంలో 27వ శాసనంగా (పే.76-82) మొత్తం శాసనం, ముద్రలతో సహా ప్రచురించింది. ఈ శాసనం మొదటి మూడు వైపులా కన్నడ భాషలో 111 పంక్తులు, నాలుగోవైపున తెలుగు భాషలో 36 పంక్తుల్లో, తెలుగు - కన్నడ లిపిలో చెక్కబడింది. శాసన స్థంభం మొదటి వైపు పైన సూర్య చంద్రులు, శివలింగం, ఆవు దూడ బొమ్మలు కళ్యాణచాళుక్య శిల్ప శైలిలో చెక్కబడినాయి. ఇదే శాసనం పి.వి. పరబ్రహ్మశాస్త్రిగారి **తెలుగు శాసనాలు,** ప్రపంచ తెలుగు మహాసభలు (1975 మళ్లీ 2012) సందర్భంగా ప్రచురించిన పుస్తకంలో గూడూరు శాసనము (చాళుక్య విక్రయ శకము 49, క్రీ.శ.1124) అన్న శీర్షిక (పే.78-85)న వివరణలతో, కేవలం తెలుగు పద్యాల వరకే ఉంది. శ్రీ బి.ఎన్. శాస్త్రిగారి **భారతదేశ చరిత్ర** : ఆరో సంపుటం, 'కాకతీయ యుగం'లో విరియాల వంశం వారి వివరాల్లో ఈ శాసనాన్ని ప్రస్తావించారు. భారతీయ భాషా సంస్థ, మైసూరు 2019లో ప్రచురించిన **ఈమని శివనాగిరెడ్డిస్థపతి,** కొండా శ్రీనివాసులు (సంకలనం), రచన **తెలుగు వారి శాసనాలు** (క్రీ.పూ.3వ శతాబ్దం - క్రీ.శ.18వ శతాబ్దం)లో 'కళ్యాణ చాళుక్య త్రిభువన మల్ల ఆరో విక్రమాదిత్యుని, గూడూరు (విరియాల కామసాని) శాసనం (క్రీ.శ.11-12 శతాబ్దం) పేరిట పాఠకుల సౌలభ్యం కోసం కొంత కన్నడ భాగం, మొత్తం తెలుగు భాగాన్ని చూడొచ్చు. ఇలా ఈ శాసనం డా. బి. మనోహరిలాంటి ఇంకా చాలా మంది పరిశోధకుల దృష్టిని ఆకర్షించింది. ఎందుకంటే ఈ శాసనానికి అనేక ప్రత్యేకతలున్నాయి.

ఈ శాసనం చాళుక్య విక్రమ సంవత్సరం 49, (క్రోధి నామ సం॥) పుష్య బహుళ పాడ్యమి, బుధవారం క్రీ.శ.1124 డిసెంబర్ 24న విడుదల చేయబడింది. శ్రీ పృథ్వీవల్లభ మహారాజాధిరాజ పరమేశ్వర, పరమభట్టారక, సత్యాశ్రయకులతిలక, చాళుక్యాభరణ, శ్రీమత్ త్రిభువనమల్లదేవర (ఆరోవిక్రమాదిత్యుని పుత్రుడు) యువరాజు కుమార సోమేశ్వరుడు కాలనుపాక రాష్ట్రానికి మహామండలేశ్వరునిగ ఉన్నపుడు, అతని దండనాయకుడు స్వామిపయ్య చేసిన విన్నపం మేరకు, గుముడూరు (గూడూరు)లో, విరియాల వంశానికి చెందిన మల్లడు నిర్మించిన మల్లేశ్వరాలయానికి, బమ్మరిగె (బమ్మెర) గ్రామాన్ని దానం చేసిన సందర్భంలో ఈ శాసనం విడుదల చేయబడింది. ఈ విషయాలన్నీ, కన్నడ శాసనం, మొదటి రెండు బాగాల్లో ఉన్నాయి. ఇందులో ఇంకా చోళ, గంగరాజ్యాలపై సాధించిన విజయాలు, త్రికళింగరాజులపై తన కోపాగ్నిని ప్రదర్శించిన వాడుగానూ అతని మహాప్రధాని సావిపయ్య (స్వామిదండనాథ, సావిదేవ, స్వామిదండాధిప గుణగణాల వివరాలున్నాయి.

మూడో భాగంలో, విరియాల సూరడు, అతని కుమారుడు బేతన (భార్య బెజ్జమాంబిక), వారి కుమారుడు మల్లుడు (కటక మున్నిరువ బిరుదాంకితుడు), గుముడూరులో శివునికి మల్లేశ్వరుని పేరిట ఒక గుడిని కట్టించి, చెరువు, బావులను తవ్వించాడన్న వివరాలున్నాయి.

ఇక నాలుగో భాగమైన తెలుగు శాసనంలో, దుర్జయ వంశానికి చెందిన పోరంటి వెన్నని ప్రస్తావన ఉంది. అతనికి ఎర్రభూపతి, అతనికి పాండవ మధ్యముడైన భీమునిలాంటి పరాక్రమం గల

**శాసనం పాఠం మొదటి వైపు**

1. స్వస్తి శ్రీ సమస్త భువనాశ్రయ
2. శ్రీ ప్రిథ్వీవల్లభ మహారాజాధిరా
3. జ పరమేశ్వరం పరమ భట్టారకం
4. సత్యాశ్రయ కుళతిళకంచాళుక్యా
5. భరణం శ్రీమత్తృభువనమల్లదేవర
6. విజయరాజ్య ముత్తరోత్తరాభివృద్ధి ప్రవర్ద ౯మా
7. నమాచంద్రాక్క౯ తారంబరం సలుత్తం జయన్తీ
8. పురద నెలెవీడి నోళుసుఖసంకథా వి
9. నోదదిం రాజ్యంగెయ్యుత్తమిరె॥ తదాత్మజు॥
10 @ స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మహా
11. మణ్డళేశ్వరం వీరమాహేశ్వరం విజయలక్ష్మీనివా
12. సం రక్షదక్షదక్షిణ దోర్ద ౯ణ్డం ద్వాదశ మణ్డ
13. ళిక (రోళ) మాత్త ౯ణ్డం ప్రతాపాక్రాశ నవఖండ భూమణ్డళం
14. రాజలీలా చమత్కృతాఖండళం కోదణ్డ చతుర్భు౯
15. జం శృంగార మకరధ్వజం త్రిభువనరంగ ప్రవత్తి ౯త
16. కీత్తి ౯న నత్త ౯కీ నత్త ౯న సూత్రధారం శరణాగత వజ్ర
17. ప్రాకారం మూఋరాయ కలికువర బిరుద హ్ప
18. దయాకంపం త్యాగజగఝ(రు?)ంప నర్థి ౯జన చిన్తి తార్థ ౯ చిం
19. (తి) తామణి సుభట మండళిక మకుట చూడా
20. మణి కు న్తళ రాజ్యాభ్యుదయయ్క కారణం బప్ప
21. న గంధవారణం శ్రీమచ్చాళుక్య గంగపెమ్మా ౯డి
22. కుమారం సోమేశ్వర దేవ॥ వృత్త॥ మోళెవెత్తెత్తి
23. దతోళబాళ జళధిం మెయ్యొండ మిత్రాంగనా
24. కుళ బాష్పద్రవదిం తళిత్తు ౯రిపు సేనా చక్ర
25. రక్తాంబుధిం బళెదత్తీ గళు పాహితాహిత గళ
26. త్కాళింగ మాతంగ సంకుళ దాన (ప్ల)వదిం పరాక్రమ వ
27. నం సోమేశ్వరోర్వీశన॥ ప్రకటాటోపద చోళగంగ
28. దనుజాధీశం తెరళ్దోడె సైనిక వీరామరకోటి
29. కోటి విధదిం కొండాడె కోపాగ్నియిందె కళింగత్ర
30. య(మం) పురత్రుతెయమం సుట్టంతె సుట్టిట్టళం త్రి
31. కళింగ త్రిపుర తృణేత్ర నెనిపం సోమేశ్వరోర్వీ ౯శ్వర॥



విరియాల భీముడు, అతనికి ఎర్రనరేంద్రుడు పుట్టారు. విరియాల భీమునికి మాండలికాభరణ బిరుదుంది. అతడు తన శత్రువుని జయించి, బొట్టు బేతరాజును, కొరవి రాజ్యానికి అధిపతిగా పట్టం గట్టి, ప్రతిఫలంగా మొగుడుపల్లి-12ను పొందాడు.

విరియాల ఎర్రనృపుని భార్య, విరియాల కామ(వ)సాని, బల్లాహ (పల్లవరాయని)నియోగంలో ప్రవేశించి, చక్రవర్తిని కలసి, ఆయన అనుగ్రహంతో పిన్నవయస్కుడైన కాకతి (గరుడ) బేతరాజును, కాకతీయ రాజ్యంపై నిలబెట్టిన ఒక గొప్ప చారిత్రక ఘట్టాన్ని నెలకొల్పింది. తరువాత సూరడు కాటయనాయకుని చంపి, రవ్వనృపుని వేల్పుగొండపై నిలిపి, ప్రతిఫలంగా మూడ-30, నేరెడు, బోటిపాడు, బేకుమావిడ్లు, ఇంకా రెండెయ రాజు సంగడ్లను పొందిన వివరాలున్నాయి. ఈ శాసనం చెక్కిన సూత్రధారి కొమ్మోజు పేరుతో పాటు అడపగట్టు సుంకం దేవునికే చెందుతుందని ముగుస్తుంది.

పి.వి. పర్రబ్రహ్మశాస్త్రి గారి పరిశోధన ప్రకారం, క్రీ.శ.1000 సం॥నకు కొంచెం ముందుగా విరియాల ఎర్రడు కాకతీయ పిండిగుండణ్ణి, బొట్టుబేతని కోసం చంపి, అతన్ని (బొట్టుబేతన్ని) అంతకు ముందు అతడు (బొట్టుబేత) పోగొట్టుకొన్న కొరవిరాజ్యపాలకునిగా చేశాడు. విరియాల ఎర్రడు, తన బావమరిది

నాలుగో వైపు

1. అనుపమ దుజ్జ ౯యాన్వయ సు
2. ధాబ్ధి ననేకులు రాజనందనులు సని
3. న బొఱంటి వెన్న డనుసంభ(వు)డయ్యె నతి
4. ప్రసిద్ధుడై వినుత విరోధి మణ్డళిక
5. వెన్నడు వెన్నుడై వోలెవానికిని ఘను
6. డగు నెఱ భూపతి జగద్వినుతండు (ద)*
7. యించె గీర్తి౯తోను॥ భావిత కీర్తి౯నాథ (ని-) (నాథుడు?)
8. పాండవమధ్యమ భీముడోయనంగా (వి*)
9. రియాల భీమ న్రిప ఘస్మరుడై (యు)
10. దియించె వానికిను భూవినుతుణ్డు
11. మండళిక భూషను డెఱనరేంద్రుడు (త్ర)
12. మ శ్రీవినుతుండు బంధుజన సేవ్యుండు
13. దా నుదయించె నున్నతిని। అతణ్డని బొ
14. ట్టుబేతె వసుధాధిపు జేకొని వాని వై (రి)
15. నుద్ధితమున జంపియ కొరవి దేశ
16. మున(ం)దు ప్రతిష్ట జేసి తత్తనెయురు
17. పేరు పొడగల దాయము బి
18. ట్టఅగద్యనంబు నప్రతిముడువాని
19. (చే) మొగడుపల్లియు పంద్రడు నేలు
20. (చొనా?)ప్ప డే॥ అరుదగునట్టి ఎఱన్రిపు
21. (నం?)గన గామవసాని యొక్క మే
22. (ల్గ)రుండని బేతభూవిభుని గాక
23. తి వల్లభు బిం్న వాని దా బరగంగ జేత
24. బట్టి ఘను బల్లవరాయని యో
25. గి జొచ్చి భాస్కరవిభు చక్రవత్తి ౯
26. గని కాకతి నిల్పుట గోటి సేయదే॥
27. కారక కాలుదై పడసె గాడయ
28. నాయకు జంపి సూర డవ్వేలుపు
29. గొండ రవ్వన్రిపు వేలుపుగొండ
30. న నిల్పి వానిచే మేలుగ మూడ
31. ముప్పయిని మేలుగ నేరెడు
32. బోటిపాడునుం మేలుగ బే
33. కు మావిడ్లు మేలుగ రెండెయ
34. రాజుసంగడ్లు ॥ సూత్రధారి
35. కొమ్మోజన బరహ శ్రీశ్రీశ్రీ @
36. అడపగట్టు దేవరకు జను॥ @



అయిన కాకర్త్య పిండిగుండణ్ణి చంపి, కాకతీయ వంశానికి హాని చేశాడు. పిండిగుండడు చనిపోయినపుడు, అతని కుమారుడైన గరుడ బేతడు పిన్నవయస్కుడు. అతడు నిస్సహాయుడు విరియాల కామవసానికి మేనల్లుడు. తనకు దక్కాల్సిన కాకతిరాజ్యం గురించి ఏమీ చేయలేని దశలో, కామవసాని పూనుకొని, ఒక బల్లవ రాజు సాయంతో, చాళుక్య చక్రవర్తిని కలిసి, ఆ పిల్లవాణ్ణి చూపించి, అతన్ని ఒప్పించి, అతనికి అనుమకొండ రాజ్యాన్ని ఇప్పించి, కాకతీయ వంశాన్ని నిలబెట్టింది. అందువల్ల ఈ శాసనానికి అంతటి ప్రత్యేకత.

ఇక శాసనాన్ని పరిశీలిద్దాం. లిపి, దాదాపు కన్నడ లిపి, భాష మాత్రమే మారింది. రాసిన లేక చెక్కిన కొమ్మోజు, కన్నడ, తెలుగు

భాషల్లో వృత్తాల్లో (చంపకమాల) పద్యాలు రాయగల దిట్ట. అక్షరాలు క్రీ.శ.12వ శతాబ్ది పొందికతో, ఇంకా తెలుగు అక్షరాలుగా రూపురేఖలు సంతరించు కోలేదని చెప్పొచ్చు. అక్షరాల మొదలు, తలకట్టు ఇంకా కన్నడరీతిలోనే కొనసాగాయి.

భాషపరంగా, శాసనంలోని కొన్ని తెలుగు పదాలు తప్పులు దొర్లాయి. మొదటి పద్యంలో సుదాబ్ధి = సుదాబ్ధి, రెండో పద్యంలో ఘస్మరుడై(యు) ది(ద) యుంచె=ఘస్మరుడై యుదయుంచె, మండళిక = మాండలిక, మూడో పద్యంలో, పంద్రడు = పంద్రెండు (పన్నెండు), నాలుగోపద్యంలో బింన్న= పిన్న, బల్లవ=పల్లవ (పరబ్రహ్మ శాస్త్రిగారు గరెండయ రాజు అంటే కాకతీయ మొదటి బేతరాజని చెప్పిన విషయంలో మేలుగ రెండెయరాజును మేలుగ, రెండెయ రాజుగ గమనించాల్సిన విషయాలు.

క్రీ.శ.1000 నాటి విషయాన్ని, క్రీ.శ.1124లో అంటే దాదాపు 125 సం౹౹ల తరువాత అప్పటి సూరన్ని ఈ శాసనంలో పేర్కొనటం వల్ల, పిన్న వయసులో తండ్రిని, తద్వారా కాతి రాజ్యాన్ని పోగొట్టుకొన్న (గరుడు) బేతరాజుకు. తన రాజకీయ చతురతతో, మళ్లీ కాకతి రాజ్యాన్ని పొందేట్లు చేసిన విరియాల ఎఱన్నృపుని భార్య కామవసాని గొప్పతనాన్ని నమోదు చేసి కాకతీయుల చరిత్ర రచనకు ఉపకరించిన ఈ శాసనం **అలనాటి మేటి శాసనాల్లో ఒకటి.** విరియాల కామవసాని విగ్రహాన్ని, వరంగల్‌లో ప్రతిష్టించినపుడే తెలంగాణ చరిత్ర మరింత పరిపుష్టమౌతుందని నా అభిప్రాయం. ఈ శాసనాన్ని గతంలో పరిశీలించి, ప్రచురించిన శాసన పరిశోధకులందరికీ, ఇటీవలి చరిత్రకారులకు శ్రీ రావెూజు హరగోపాల్‌గారికి నా కృతజ్ఞతలు.

–ఈమని శివనాగిరెడ్డి–స్థపతి
m : 9848598446
e : nagireddy@malaxmi.in

ద




# పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ

## జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

### 'ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్' వెబినార్?

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీన జరుపుకుంటున్నాం. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి, అవసరమైన అవగాహనను పెంచుకోవ డానికి ఆ రోజు కొన్ని చర్యలు చేపడతారు. ఇది యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ (UNEP) ద్వారా నడపబడుతుంది. మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి 1972 జూన్ 5వ తేదీ నుంచి 16వ తేది వరకు సమావేశం అయింది. ఈ సందర్భంగా 1972లో యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా జూన్ 5ను ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించబడింది. 1973లో మొదటి సారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జూన్ 5వ తేదీన వేర్వేరు నగరాలలో విభిన్న రీతులలో అంతర్జాతీయ వైభవంగా జరుపుకుంటారు.

కావున 'ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్' కూడా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ మహానగరంలో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా జూన్ 5న పర్యావరణ వేత్తలు, వారసత్వ కట్టడాల పరిరక్షణ నిపుణులు, అధ్యయన వేత్తలు, సామాజిక వేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు వివిధ వర్గాల వారితో పర్యావరణంపై సమావేశం ఏర్పాటు చేస్తుంది. నిష్ణాతులతో మాట్లాడించి పర్యావరణంపై సూచనలు, సలహాలు ఇప్పించడం జరుగుతుంది. ఇందులో ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఏడాది వరకు చేసిన కార్యక్రమాలను విశ్లేషించి రూపొందించిన నివేదిక, సావనీర్, బుక్‌లెట్‌ను విడుదల చేస్తుంది. ఫోరం నిర్వహించిన ఏడాది కార్యక్రమాలను ముద్రణ రూపంలో ప్రచురించి పర్యావరణంపై అవగాహన కల్పిస్తుంటుంది.

అయితే గత సంవత్సరం నుండి యావత్ ప్రపంచం 'కరోనా' విపత్తును ఎదుర్కొంటుంది. కావున ఈ ఏడాది కూడా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్' 21వ వార్షికోత్సవాన్ని మణికొండ వేదకుమార్ అధ్యక్షతన వెబినార్ (జూమ్ వీడియో) నిర్వహించనుంది. ఈ వెబినార్లో వివిధ దేశాల్లోని పర్యావరణ వేత్తలు, శాస్త్రవేత్తలు, సామాజికవేత్తలు, అధ్యాపకులు వివిధ రంగాలకు చెందిన వారు ప్రపంచ వ్యాప్తంగా వెబినార్‌లో పాల్గొననున్నారు.

ద



# నిర్మల్‌లో ఫిరంగీల తయారి కేంద్రాలు

ప్రాచీన కాలం నుండి తెలంగాణలోని ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఇనుము ఉక్కు తయారీ విరివిగా జరిగింది. అనేక గ్రామాలల్లో, మారుమూల ప్రాంతాల్లో, కొండ ప్రాంతాల్లో ఇనుము ఉక్కు తయారీకి సంబంధించిన పరిశ్రమల ఆనవాళ్లు ఇప్పటికీ లభిస్తున్నాయి. అందునా నిర్మల్ జిల్లాలోని దిలావార్‌పూర్, కుబీర్, కడెం, మామడ, ఖానాపూర్, పెంబి తదితర మండలాల్లో విరివిగా ఇనుము, ఉక్కును మరియు వీటి ద్వారా వివిధ వ్యవసాయ పనిముట్లు యుద్ధాల కోసం ఉపయోగించే కత్తులు, బరిసెలు, బల్లెములు తదితర సామాగ్రి విరివిగా తయారు చేసినట్లు నిరూపించబడింది. కల్లెడ, చిట్యాల తదితర అనేక గ్రామాల పేర్లు ఇనుముకు సంబంధించినవి ఉండటం గమనార్హం.

కాకతీయుల నుండి వేరుపడి స్వతంత్ర రాజ్యం స్థాపించిన పద్మనాయక రాజులు నిర్మల్ నుండి తమ రాజ్యాన్ని విస్తరింప చేసుకున్నారు. నిమ్మనాయుడు పరిపాలించినట్లు జనబాహుళ్యంలో కథనాలు వున్నా శాసన సంబంధమైన లేదా చారిత్రక కుండాలలో ఎక్కడ రికార్డు లేక పోవడం గమనార్హం.

పద్మనాయక వంశస్థుల నుండి నిర్మల్ సంస్థానం ఆసఫ్జాహీ వంశానికి చెందిన నిజాం ఉల్‌ముల్క్ ఆధీనంలోకి వచ్చేసింది.

'నిజాం రాజు ఔరంగబాద్ నుండి హైద్రాబాద్‌కు మకాం మార్చిన క్రమంలోనే 1769వ ప్రాంతంలో ఇబ్రహీంబేగ్ ధంసాను నిర్మల్ పాలకుడిగా నియమించాడు. ధంసా ఎనగందుల, బాలకొండ, ఇందూరు, గడ్‌చందా తదితర కోటలను పునఃనిర్మించినట్లు చరిత్రకారుల అభిప్రాయం.

రెండవ నిజాం ఆలీఖాన్ ఆధునిక ఫిరంగులను తయారు చేయడానికి రెండు ప్రాంతాలను ఎంపిక చేసుకున్నాడు. ఒకటి హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రి కాగా మరొకటి నిర్మల్ కేంద్రంగా ఫిరంగీల తయారిని ప్రారంభించాడు. నిజాం సైన్యంలో పనిచేసే ఫ్రెంచి జనరల్ మూసారేమాండ్ ఆధ్వర్యంలో గన్ ఫౌండ్రీలను ఏర్పాటు చేసి ఫిరంగులను తయారు చేయడం, ఫిరంగీలల్లో పేర్చే మందుగుండు పౌడర్‌ను తయారు చేయడం జరిగేది. 1786 సం॥లో నిర్మల్ నాల్గు ప్రాంతాలల్లో గన్ ఫౌండ్రీలను నిర్మించారు. ఇందుకు ఇటుకలు, మోర్టారును వాడినారు. భాగ్యనగర్‌లో ఒకటి, మహాలక్ష్మి వాడలో రెండు మరియు ఇసురు రాళ్ళ గుట్ట మీద ఒకటి గన్ ఫౌండ్రీలను నిర్మించినారు. ఇవి నిర్మించినప్పుడు అక్కడ జనవాసాలు లేవు. ఇవి ఇప్పుడు జనవాసాల మధ్య చిక్కుకున్నాయి.

ఉత్తర భారతానికి, దక్షిణ భారతానికి అడ్డుగా నిర్మల్ గుట్టలు (సహ్యాద్రి) బాసర మరియు గోదావరి ఉండటంతో నిర్మల్ ప్రాంతాన్ని శత్రుదుర్భేత్యంగా మలిస్తే హైదరాబాద్ రాజ్యం సురక్షితంగా వుంటుందని భావించివుంటారు. ఆది నుండి నిర్మల్ ప్రాంతం శ్రేష్టమైన ఇనుము, ఉక్కు తయారీ కేంద్రంగా నిలిచింది.

## గుమ్మటాలు - వాటి విస్తీర్ణం

స్థానికంగా గుమ్మటాలుగా పిలిచే ఈ తోపుల బట్టీలు ఒక వెలుగొందిన చరిత్రకు నఖలుగా నిలిచినాయి. “తోపికా - సాంచ”గా పిలువబడే వీటి గురించి స్థానికులకు అవగాహన, పట్టింపు లేకపోవడం గమనార్హం. నిర్మల్‌కు ఉత్తరం వైపున మహాలక్ష్మి ఆలయ శివారులో 40 పీట్ల ఎత్తు కల్గి 25 పీట్ల వ్యాసార్థం కల్గిన ఒక పెద్ద గుమ్మటం వుంది. లోపలకు వెళ్ళడానికి 4 ద్వారాలను ఏర్పర్చినారు. గుండ్రంగా వలయాకారంలో వుండే ఈ గుమ్మటాలకు నాల్గు పెద్ద కిటికీలుంటాయి. ఇదే ప్రాంతంలో మరొక తోపులబట్టీ వుంది. ఇది 35 ఫీట్ల ఎత్తు కలిగి 20 ఫీట్ల వ్యాసార్థం కల్గి వుంది. ఇవి రెండు ఒకే ప్రాంతంలో ఉండటం విశేషం. చిన్న ఫిరంగీలు తయారు చేయడానికి చిన్న బట్టీలను, పెద్దవి తయారు చేయడానికి పెద్ద



బట్టీలను వాడేవారు.

భాగ్యనగర్ ప్రాంతంలో 48 ఫీట్లు ఎత్తు కల్గిన తోపులబట్టీ వుంది. లోపల సుమారు 30 ఫీట్ల వ్యాసార్ధం కల్గి వుంటుంది. ఈ బట్టీకి నాల్గు ద్వారాలున్నాయి. నాల్గు కిటికీలు 6 ఫీట్లు ఎత్తు కల్గివున్నాయి. అదే విధంగా ధన్‌ధన్ గుట్టను ఆనుకుని ఇసురు రాళ్ళ గుట్ట ఉంటుంది. దీనిపై 20 ఫీట్ల ఎత్తు కల్గి లోపల 10 ఫీట్ల వ్యాసార్ధం కల్గిన గుమ్మటముంది. ఇది మేకలబండ ప్రక్కన ఉంటుంది. అతిపెద్ద ఇసురు రాళ్ళు ఈ గుమ్మటంలో ఉన్నాయి. అందుకే ఇది ఇసురురాళ్ళ గుట్టగా పిలుస్తారు.

**ఫిరంగుల తయారీ – తరలింపు**

ఈ తోపుల బట్టీలలో తయారైన వివిధ నమూనా ఫిరంగులను బురుజుల మీదకు, కోట మీదకి, ఖిల్లా గుట్ట, శ్యామ్‌ఘఢ్, బసేరాఫోర్ట్, బత్తీస్‌ఘఢ్ తదితర ప్రాంతాలకు ఏనుగుల ద్వారా తరలించేవారు. వందలాది ఫిరంగులు ఉండేవని కాలక్రమంలో వాటిని ఎక్కడికో తరలించారని స్థానికులంటారు. ప్రస్తుతం అన్నీ కలిపి 38 ఫిరంగులను నిర్మల్‌లో వివిధ ప్రాంతాల్లో చూడవచ్చు. ఇందులో తహసిల్ కార్యాలయంలో వున్న ఫిరంగి పంచలోహాలతో తయారు చేసిందని అంటారు. పంచలోహ ఫిరంగిపై "రఫీక్ దక్కన్ నవాబ్ రుక్మదౌద్దలా, జఫరుద్దౌల 1184 హిజరీ" అనే ఉర్దూ శాసనముంది. ఇదే శాసనం కల్గిన రెండు ఫిరంగులు స్థానిక టిఎన్జీఓ వారి ప్రాంగణంలో వున్నాయి. వెంకటాద్రిపేట ఓంకారేశ్వర ఆలయ ద్వారానికి పేర్చిన రెండు ఫిరంగులకు కూడా "రఫీక్ దక్కన్ నవాబ్ రుక్మద్దౌలా, జఫరుద్దౌలా 1185 హిజరి" అని వుంది. జూనియర్ కళాశాలలో వున్న రెండు ఫిరంగులపై ఇదే శాసనం అచ్చు వేయించారు. తహసిల్ కార్యాలయంలో ఉన్న ఒక ఫిరంగిపై ఉర్దూలో కాకుండా ఫారసీలో రాయబడిన శాసనముంది. ఈ శాసనంలో సర్కార్ ఆసఫ్–ఆసఫ్‌జాహిడైనాస్టి (Sarkar Asafi Asifjahi Dynasty) అని పోతపోసివుంది.



నిర్మల్ ప్రాంతానికి పాలకుడిగా నియమించబడిన ఇబ్రహీం బేగ్‌థంసా "నవాబ్ రుక్మద్దౌలా" బిరుదుతో పాలించినాడు. తన పాలనను పటిష్టపరుచుకుని స్వతంత్ర్య రాజ్యంగా ఏలుకోవాలని తన పేరిట ఫిరంగులను తయారు చేసి అన్ని రక్షణ స్థావరాలకు తరలించాడు. వీరి చర్యల్ని గమనించిన నిజాం ఆలీఖాన్ వీరిని లొంగదీసుకుని అధికార భ్రష్టున్ని చేసినట్లు చెబుతారు. పరిపాలించిన కొద్ది కాలంలో స్వతంత్ర్య సేనను, ఆయుధ సామర్థ్యం పెంచుకోవడం అభినందనీయం.

**వారసత్వ సంపద కాపాడుకోవాలి.**

ఇప్పటికీ నిర్మల్ కోటలు బలిష్టంగా, సజీవంగా వున్నాయి. బురుజులు, గుమ్మటాలు, రాతి పరుపులు, పరుపులపై చెక్కిన పెట్రోగ్రాఫిలను కాపాడుకోవాలి. దాదాపు 80 ఫీట్ల వైశాల్యంతో పట్టణం చుట్టూర తవ్వుకున్న నీటి కందకం అన్యాక్రాంతం కాకుండా రక్షించుకోవాలి. శిథిలావస్థకు చేరుకుంటున్న తోపులబట్టీలను మరమ్మత్తులు చేసి కాపాడుకోవాలి. మోటబావులు నీటి జలాశయాలు, గొలుసుకట్టు చెరువులు, ప్రాచీన ఆలయాలు రక్షించుకుని బావి తరాల వారికి మన వారసత్వ సంపదగా అందించాల్సి వుంది. ఎక్కడిక్కడ కంచె వేసి, బోర్డులు పెట్టి, పురావస్తు సంపదగా ప్రజలకు తెలిసేటట్లు చేయాలి. ఆ దిశగా ప్రజలు, సమాజం, చరిత్రకారులు, స్వచ్ఛంద సంస్థలు మరియు ప్రభుత్వం ఆలోచిస్తారని ఆశిద్దాం!!

–తుమ్మల దేవరావ్, m : 8985742274
e : hemanthgreeshma2003@gmail.com

# పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యం

## జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ కోసం దశాబ్దాలుగా ప్రభుత్వాలు చేయాలనుకుంటున్న పనులు, సాధించాలనుకున్న ప్రగతి కొన్ని రోజుల లాక్ డౌన్ వల్ల సమకూరింది. మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా దీనికి ఆధారం భూమి. గాలి, నీరు, నింగి, నిప్పు అనే పంచభూతాల వల్లే మానవ మనుగడ సాధ్యమవుతుంది. వీటిలో ఏ ఒక్కటి లోపించినా జీవనం అస్తవ్యస్తమవుతుంది. భూమిపై అన్ని వనరులూ సక్రమంగా ఉంటేనే మానవ అభివృద్ధి నిజమవుతుంది. కానీ, అంతులేని ఆధిపత్య దాహం వల్ల భూమండలం కాలుష్య కాసారంగా మారిపోయింది. ఉపరితలంపై ఉన్న వనరులే కాదు, భూగర్భ జలాలు, ఖనిజ వనరులను పలు దేశాలు విచక్షణా రహితంగా వాడుకోవడం వల్ల కాలుష్యం పెరిగి రాబోయే కొన్ని దశాబ్దాలలో సహజ వనరులు అంతరించిపోయే ప్రమాదం ఉందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. రోజురోజుకూ భూగోళంపై పచ్చదనం తగ్గిపోవడం, కొన్ని రకాల జీవరాశులు నశించిపోవడం వల్ల పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమించింది.



పరిశ్రమలు, వాహనాలు తదితరాల నుంచి వెలువడుతోన్న క్లోరోఫోరో కార్బన్‌లు భూగ్రహాన్ని మరింత వేడెక్కిస్తూ పలు కాలుష్యాలకు కారణమవుతున్నాయి. భూతాపం పెరగడంవల్ల పర్యావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుని జీవరాశుల మనుగడకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరోవైపు వాతావరణంలో మార్పుల కారణంగా జీవ వైవిధ్యం దెబ్బతింటోంది. వృక్షాలను విచక్షణారహితంగా నరికివేస్తున్నందున అడవులు అంతరించి పోతున్నాయి. సరైన వర్షాలు లేక కరువుకాటకాలు సంభవిస్తున్నాయి. దీంతో జల వనరులు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. తత్ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. అకాల వర్షాలు, విపరీతమైన వేడిమి కారణంగా గ్లోబల్ వార్మింగ్‌తో ఓజోన్ పొర దెబ్బతింటోంది.

వాతావరణ మార్పులు, శిలాజ ఇంధనాల వాడకంపైనా గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా యువతరం పెద్ద ఎత్తున ఆందోళన చేసి దేశాధినేతలనే నిలదీశారు. ప్రపంచాన్ని ప్రస్తుతం కరోనా వైరస్ మహమ్మారి వణికిస్తోంది. దీంతో పలు దేశాలలో లాక్‌డౌన్ వల్ల అన్ని పనులు ఆగిపోవడంతో కర్బన ఉద్గారాలూ తగ్గాయి. భారతదేశంలోనూ ప్రజా రవాణా నిలిచిపోయి ఇంధనాల వాడకం దాదాపు 66 శాతం తగ్గింది. ఇంధనానికి డిమాండు తగ్గడంతో చమురు ఉత్పత్తి, బొగ్గు తవ్వకాలు తగ్గిపోయాయి. ఫలితంగా చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో అన్ని రకాల కాలుష్యాలకూ అడ్డుకట్ట పడింది.

భారతీయులకు పవిత్రమైన గంగానది తీరం పొడవునా ఉన్న పరిశ్రమల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలతో, యాత్రికులు పడేసే చెత్తతో కలుషితమైపోయి, తాగడానికి కాదు కదా, స్నానానికి కూడా పనికిరాని పరిస్థితికి చేరుకుంటోంది. గంగానదిని శుభ్రం చేయాలంటూ ఎందరో ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలు కూడా ప్రక్షాళనకు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా పరిస్థితిలో ఇసుమంత కూడా మార్పు లేదు. అలాంటిది లాక్‌డౌన్‌తో ఫ్యాక్టరీల మూసివేయడం వల్ల వ్యర్థాలు నదిలోకి రావడం ఆగిపోయి గంగమ్మ కొత్త అందాలను సంతరించుకుంది.

ఇక, తొలిసారిగా 1972లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత 1974లో 'ఒకే ఒక్క భూమి' థీమ్‌తో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇలా ప్రతిసారీ ఒక్కో థీమ్‌తో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఉంటారు. 2019 సంవత్సరంలో 'బీట్ ఎయిర్ పొల్యూషన్' పేరుతో చైనాలో సదస్సు నిర్వహించారు. 2020 సంవత్సరంలో 'టైమ్ ఫర్ నేచర్' థీమ్‌ను ఎంపిక చేసి.. జర్మనీ సహకారంతో కొలంబియాలో నిర్వహించారు.

అక్కడే ఎందుకు నిర్వహించారంటే భూమిపై ఉన్న జీవవైవిధ్యంలో 10 శాతం కొలంబియాలోనే ఉండటం విశిష్టత.

అమెజాన్ రెయిన్ ఫారెస్ట్‌లో భాగం కావడం వల్ల అది సాధ్యమైంది. పక్షులు, ఆర్చిడ్స్ బయోడైవర్సిటీ కేటగిరిలో కొలంబియా తొలి స్థానంలో ఉంది. మొక్కలు, సీతాకోకచిలుకలు, స్వచ్ఛమైన నీటిలో లభించే చేపలు, ఉభయచరాల్లో రెండో స్థానంలో ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న అనేక సంఘటనలు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేశాయి. గతేడాది బ్రెజిల్ అమేజాన్ అడవుల్లో, ఆస్ట్రేలియా అడవుల్లో కార్చిచ్చుతో అనేక జీవుల మనుగడకు ముప్పు వాటిల్లింది. జంతువులు తమను రక్షించు కునేందుకు రోడ్లపైకి వచ్చాయి. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుంది.



పట్టణాల విస్తీర్ణం పెరగడంతో అడవులు నరికివేతకు గురవుతున్నాయి. తద్వారా వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. జంతువులకు తిండి దొరక్క జనాల్లోకి వస్తున్నాయి. భవిష్యత్తులో పర్యావరణానికి మరింత ముప్పు వాటిల్లే అవకాశముందని పర్యావరణవేత్తలు హెచ్చరిస్తున్నారు. పర్యావరణంపై ప్రభావం చూపుతున్న పారిశ్రామిక కాలుష్య ఉద్గారాలను నియంత్రించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా అరికట్టాలని, ప్రజలు మొక్కలను పెంచడం ఒక వ్యాపకంగా మార్చుకోవాలని సూచిస్తున్నారు.

### కాలుష్య నివారణలో 'తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి' ముందడుగు

ప్లాస్టిక్‌ను నివారించేందుకు తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలి (టిపిసిబి) నడుం బిగించింది. 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని తరిమేద్దాం' అనే సందేశంతో ప్రచారం చేస్తోంది. 2018 నుంచి ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహిస్తోంది. ప్రజల్లో కాలుష్య నివారణపై అవగాహన కల్పించడం ప్రకృతికి హాని కల్గించకుండా, మొక్కల పెంపకం, పార్క్‌లు, అడవుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ టిపిసిబి ప్రచారం చేస్తోంది.

కాలుష్య నివారణకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తనవంతు కృషి చేస్తోంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. పరిశ్రమల్లో వ్యర్థ రసాయనాల విషయంలో పకడ్బందీ ప్రణాళికలు అమలు చేస్తోంది. వాహన కాలుష్యాన్ని నివారించేందుకు కూడా రవాణశాఖతో కలిసి చర్యలు తీసుకుంటోంది. జీవ వ్యర్థాల విషయంలో ఇప్పటికే పలు ఆసుపత్రులకు నోటీసులు జారీ చేసింది. నీటి కాలుష్యంపై ఎప్పటికప్పుడు కాలుష్య నివారణ చేపట్టాల్సిన సంస్థలకు నివేదికలు ఇస్తోంది. శబ్ధ కాలుష్యం అధిగమించకుండా చర్యలు తీసుకుంటోంది. మొత్తానికి కాలుష్యానికి కారణమవుతోన్న సంస్థలకు టిపిసిబి ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ కాలుష్య నివారణ వేగాన్ని పెంచింది. కాలుష్యానికి కారణమవుతోన్న పరిశ్రమలపై ఈ ఏడాది టిపిసిబి ఉక్కుపాదం మోపుతోంది. భూగర్భ పైపులైన్‌ల ద్వారా వ్యర్థ రసాయనాలు వదులుతోన్న పరిశ్రమలపై పిసిబి అధికారులు ప్రత్యేక నిఘాపెట్టి పలు పరిశ్రమలపై చర్యలు తీసుకుంటున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే మనవంతుగా ప్రతి ఒక్కరం మొక్కలను పెంచడంతో పాటు ప్రస్తుతం ఉన్న చెట్లను నరికివేయొద్దు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి.

– ఎసికె. శ్రీహరి
m : 9849930145
e : ackvs08@gmail.com

## పర్యావరణంపై ప్రత్యేక వ్యాసాలు



**మన దక్కన్‌ల్యాండ్** మాసపత్రికలో పర్యావరణం, వారసత్వం, విపత్తుల నివారణ, గ్రామీణ పట్టణ ప్రణాళిక, వ్యవసాయ రంగం, వైద్య, విద్య, సహజ వనరుల పరిరక్షణ మరియు సద్వినియోగం, జీవ వైవిధ్యం, జీవన విధానంపై కథనాలు, వ్యాసాలు, ఇంటర్వ్యూల పట్ల దృష్టి సారించాలని దక్కన్‌ల్యాండ్ ఎడిటోరియల్ బోర్డు భావిస్తున్నది. ఇందుకు మీ అందరి సహాయ సహకారాలు కోరుతున్నాం. పర్యావరణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం చాలా అవసరం.

**రచయితలు పై అంశాల మీద లోతైన విశ్లేషణలు, విషయాలతో తమ కథనాలను పంపగలరు.**

చిరునామా :

TELANGANA RESOURCE CENTRE

**DECCAN LAND : "CHANDRAM"** 3-6-712/2, St.No. 12, Himayatnagar, Hyderabad - 500 029. Telangana
**Fax: 040-27635644 Mobile: 9030626288**
E-mail:desk.deccan@gmail.com www.deccanland.com



# కులవృత్తుల నైపుణ్యం ప్రగతికి సోపానం

తెలంగాణ రాష్ట్ర పశుసంవర్థశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

'రాష్ట్ర ఏర్పాటుతో విశ్రమిస్తే సరిపోదు. ఎన్నో సహజ వనరులున్న తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్ర ప్రజల వెనుకబాటుతనాన్ని పోగొట్టి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలి. అప్పుడే తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సార్థకత చేకూరుతుందని' కేసీఆర్ తరచూ చెప్తుంటారు. అందులో భాగంగానే ఆయన కలలుగన్న 'బంగారు తెలంగాణ' సాధన దిశగా గత ఏడేండ్లుగా ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు పరుస్తున్నారు. జనాభాలో 60 శాతం ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజల సమస్యల మీద ఆయన సమగ్ర దృష్టిసారించారు.'



చేతివృత్తుల్లో వేటికైతే ఆదరణ ఉన్నదో వాటికి ఆధునిక సాంకేతికత కలిగిన పనిముట్లు పంపిణీ చేసి, ఆయా వృత్తుల వారికి శిక్షణ ఇప్పించి వారి బతుకులకు భరోసా కలిగించారు.

గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ, గంగపుత్రులకు చేప పిల్లలను సరఫరా చేసి ఉత్పత్తిని పెంచి, వారి ఆదాయ మార్గాలను బలోపేతం చేశారు.

ఊరంతా తిరిగి తాము తయారుచేసిన వస్తువులను అమ్ముకునేందుకు పూసల వృత్తివాళ్లకు వెహెపెడ్స్‌ను అందజేశారు. గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించారు. నీరా అమ్మకాలను ప్రోత్సహించారు. కుమ్మర్లకు వృత్తి నైపుణ్యాన్ని పెంచేవిధంగా ఆధునిక శిక్షణ ఇప్పించారు. సిరిసిల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేసేందుకు వారికి బతుకమ్మ చీరల తయారీ పనులను అప్పగించారు. ఇటీవలే దోభీ ఘాట్లకు, లాండ్రీ షాపులకు, క్షౌరశాలలకు గ్రామస్థాయి నుంచి గ్రేటర్ హైదరాబాద్ వరకు నెలకు 250 యూనిట్ల కరెంటును ఉచితంగా సరఫరా చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. తద్వారా రాష్ట్రంలోని లక్షల మంది రజకులకు, నాయీబ్రాహ్మణులకు లబ్ధి చేకూరనున్నది.

ఇంకా కులవృత్తులు చేసు కుంటూనే బతకాలా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమాజంలో బతక డానికి గౌరవంతో కూడిన ఏ



పని చేసినా తప్పు లేదు. ఏ రంగంలో ఆసక్తి ఉన్న వారు ఆ రంగంలో రాణిస్తారు. ఏ కుల వృత్తి అయినా సమాజానికి పనికొచ్చేదే. సమాజ అవసరాలను తీర్చేదే.

ఇంగ్లీషులో ఒక సామెత ఉన్నది. ***'రోమ్ వాజ్ నాట్ బిల్ట్ ఇన్ ఏ డే..'*** అంటే ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకర్షించే రోమ్ నగర నిర్మాణం ఒక్క రోజులో పూర్తి కాలేదు, అది కట్టడానికి చాలాకాలం పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ.

సాధించుకున్న రాష్ట్రాన్ని కోటి ఎకరాల మాగాణగా



సస్యశ్యామలం చేసింది కేసీఆర్ ప్రభుత్వం. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకుపోతుండటంతో ఆ ఫలాలను ప్రతి కుటుంబం ఏదో ఒక రూపంలో అందుకుంటున్నది.

దండుగ అన్న వ్యవసాయాన్ని పండుగ చేసినందుకు ఓ 'రైతుబిడ్డ', హైదరాబాద్‌ను ఐటీలో మేటిగా చేసినందుకు ఓ 'టెక్', నగరాన్ని పెట్టుబడుల ధామంగా మార్చడంతో ఉపాధి పొందిన ఓ 'ప్రైవేటు ఉద్యోగి', నిన్నటి దాకా నిలువ నీడ కరువై ఇప్పుడు 'డబుల్ బెడ్‌రూం' ఇంట్లో ఆత్మగౌరవంతో బతుకున్న ఓ 'ఇల్లాలు', చేతిలో చిల్లిగవ్వ లేకున్నా 'షాదీ ముబారక్'తో లక్ష రూపాయల్ని ఆడబిడ్డకు కానుకగా ఇచ్చిన ఓ కన్న తండ్రి, దశాబ్దాల పద్మవ్యూహాన్ని మరిచిపోయి నగర రోడ్లపై సాఫీగా ప్రయాణం చేస్తున్న ఓ

**లబ్ధిదారుల మాటల్లో...**

**కేసీఆర్ సార్ ఇచ్చిన గొర్రెలతోనే బతుకున్నాం**

ఇంతకు మునుపు మాకు గొర్రెలు లేవు. నేను, నా భార్య ఇద్దరం రోజూ కూలి పనులకు పోయేది. కూలి డబ్బులతో కుటుంబం గడిచేది. మొదటి విడత గొర్రెల పంపిణీలో నాకు ఒక యూనిట్ మంజూరైంది. వాటిని సాదుకుంటూ 60 గొర్రెలను చేశాం. గొర్రెలు ఇచ్చిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

***-కన్నెబోయిన సింహాద్రి, బాలెంల, సూర్యాపేట***

**కూలీ నుంచి 90 గొర్రెలకు యజమానిని**

మాది మాడ్గులపల్లి మండలం కుక్కడం గ్రామం. నిరుపేద కుటుంబం. తనకు గొర్రెలు లేక వ్యవసాయ పనులకు వెళ్లేవాడ్ని. ఇలా ఎన్నేండ్లు అని లోలోన బాధపడేవాడ్ని. తనకు గొర్లు ఉంటే బాగుండని మదనపడేవాడ్ని. ఈ తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సబ్సిడీ గొర్రెలు ఇస్తుండని తెలిసి ఆనందపడ్డాను. గొర్రెల పంపిణీ పథకానికి దరఖాస్తు చేసుకున్నాను. మొదటి విడతలోనే 21 గొర్రెలు రావడంతో సంబురపడ్డాను. మూడేండ్లలో జీవాల సంఖ్య గణనీయంగా పెరిగి ఇప్పుడు 90 గొర్రెలకు యజమానిని అయ్యాను. వాటితో ఆర్థికంగా కొండంత ధైర్యం వచ్చింది.

***-పండుగ వెంకన్న, కుక్కడం, మాడ్గులపల్లి, నల్లగొండ జిల్లా***

**జీవాలే జీవనాధారం**

గొర్రెల పెంపకం మా వృత్తి. కానీ నా దగ్గర డబ్బు లేక పోవడంతో జీవాలను కొనలేకపోయా. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ సబ్సిడీపై 20 గొర్లు, ఒక పొట్టేలు ఇచ్చిండు. వాటిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ఇప్పటి వరకు 20 జీవాలను అమ్ముకున్నా. లక్షా 50వేల వరకు ఆదాయం వచ్చింది. ఇంకా నా దగ్గర 30 గొర్లు ఉన్నాయి. అందులో 8 చిన్న పిల్లలు, వాటిని రెండు నెలల్లో అమ్ముకోవచ్చు. ప్రభుత్వం గొర్రెలు ఇవ్వడం వల్ల మా కుటుంబానికి ఆధారం లభించింది.

***-గజ్జి శ్రీరాములు, లక్ష్మీపురం, తిప్పర్తి, నల్లగొండ జిల్లా***





వాహనదారుడు, కన్న కొడుకులు ఆదరించకున్నా ఆసరా పింఛనుతో కంటినిండా నిద్రపోతున్న ఓ అవ్వ. ఇలా ప్రతి కుటుంబానికి కేసీఆర్ ప్రభుత్వం అండగా వుంటుందని **తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్** తెలిపారు.

తెలంగాణ నంబర్ 1 స్థానంలో నిలవటం గర్వకారణం. సీఎం కేసీఆర్ ఏ లక్ష్యంతో గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించారో ఆ లక్ష్యం అనతికాలంలోనే నెరవేరటం సంతోషకరం. రాష్ట్రంలో జంతుసంపద గణనీయంగా పెరుగుతున్నది. దీంతోపాటే పాలు, మాంసం, గుడ్ల వృద్ధిరేటును నమోదు చేసింది. ఇదే స్ఫూర్తితో గ్రామీణ వ్యవస్థను, కులవృత్తులను పటిష్టం చేసే దిశగా మరింత కృషిచేస్తామని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

### గొర్రెలతో 6వేల కోట్ల సంపద

గొల్ల, కురుమలు లేని ఊరుండదు. వీరి సంస్కృతి, ఆచార వ్యవహారాలు సుసంపన్నమైనవి. గొర్ల, మేకల, పశువుల పెంపకం, పాలు, మాంస ఉత్పత్తి, గొంగళ్ల నేత మొదలైనవి వీరి వృత్తి. గొర్రె ఉన్నితో తయారయ్యే గొంగళ్లు మనుషులను చలి నుంచి కాపాడుతున్నాయి. గొర్రె తోలుతో తయారయ్యే జగ్గు, డోలు, కంజెర లాంటి వాయిద్యాలు తెలంగాణ గ్రామీణ సంస్కృతిలో ముఖ్యమైనవి.

గొర్రె ఎరువుతో భూములు సారవంతమవుతున్నాయి. తెలంగాణలో గొల్ల, కురుమల జనాభా 12 శాతం. వీరి ఉత్పత్తుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. భారతీయ గ్రామీణ సమాజంలో వ్యవసాయం తర్వాత చెప్పుకోదగింది గొల్ల, కురుమల వృత్తి. దేశంలో వృత్తిపనుల ఆదాయ మార్గాలను పెంచడం ద్వారా మాత్రమే నిరుద్యోగాన్ని రూపుమాపటం సాధ్యమవుతుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసి అన్ని కులాల వారికి వృత్తిపనుల ద్వారా చేతి నిండా ఆదాయం ఉండేలా కేసీఆర్ అనేక పథకాలకు రూపకల్పన చేశారు. ఇదేరీతిలో గొల్ల, కురుమలకు గొర్లు, మేకలు అందిస్తున్నారు.

తెలంగాణ ప్రభుత్వం సరికొత్త ఘనతను సాధిస్తున్నది. గొర్రెల పంపిణీతో రూ.6,169 కోట్ల సంపదను సృష్టిస్తున్నది. మాంసం ఉత్పత్తి, గొల్ల కురుమల ఆర్థిక బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం 2017 జూన్‌లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ కార్యక్రమం అద్భుత ఫలాలను అందిస్తున్నది. లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. మాంసం ఉత్పత్తి, గొర్రెల సంఖ్య పెరుగుదలలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిచింది. గొర్రెల దిగుమతిని సగానికి పైగా తగ్గించింది. తాజాగా మరో 28,335 మందికి రూ.360 కోట్ల ఖర్చుతో 5,95 లక్షల గొర్రెలను పంపిణీ చేయనున్నది.

### గొర్రెల పంపిణీ పథకం విశేషాలు :

**తెలంగాణలో మాంసం ఉత్పత్తి (లక్షల టన్నుల్లో)**

2014-15 సంవత్సరానికి : 5.05
2015-16 సంవత్సరానికి : 5.42
2016-17 సంవత్సరానికి : 5,91
2017-18 సంవత్సరానికి : 6.45
2018-19 సంవత్సరానికి : 7.54
2019-20 సంవత్సరానికి : 10.09

అర్హులైన ఒక్కోవ్యక్తికి పంపిణీ చేస్తున్న గొర్రెలు : 21
(ఒక యూనిట్ : 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలు)
ఒక యూనిట్ ఖర్చు : రూ. 1.25 లక్షలు
(ప్రభుత్వ సబ్సిడీ 75%, లబ్దిదారుడు 25%)
రాష్ట్రంలో గొల్ల కురుమల కుటుంబాలు : 6 లక్షలు
గొర్రెల పెంపకంపై ఆధారపడినవారు :
సుమారు 40 లక్షల మంది
దేశంలోని మొత్తం గుడ్లలో తెలంగాణ ఉత్పత్తి 13.2%
దేశంలో పాల ఉత్పత్తి వృద్ధిరేటులో
తెలంగాణ స్థానం : 9.1
దేశవ్యాప్తంగా మొత్తం ఉన్ని ఉత్పత్తిలో
తెలంగాణ వాటా : 10.5%
ఉన్ని, గుడ్ల ఉత్పత్తిలో
దేశంలోనే తెలంగాణ స్థానం : 3





రాష్ట్రంలో పింక్ విప్లవం (మాంస ఉత్పత్తుల పెరుగుదల) కొనసాగుతున్నది. 2012లో రాష్ట్రంలో 1.10 కోట్ల గొర్రెలు ఉన్నాయని జాతీయ పశుగణన లెక్కల్లో వెల్లడైంది. 2019లో రాష్ట్రంలో గొర్రెల సంఖ్య 1.91 కోట్లకు పెరిగినట్టు తేలింది. ప్రస్తుత లెక్కలను పరిగణలోకి తీసుకుంటే రాష్ట్రంలో గొర్రెల సంపద 2 కోట్లు దాటింది. ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెల ద్వారా రాష్ట్రంలో 1.37 కోట్ల గొర్రె పిల్లలు పుట్టాయి. 48.51 శాతం గొర్రెల సంఖ్య పెరుగుదలతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఏపీలో 30 శాతం, కర్ణాటకలో 15.31 శాతం పెరుగుదల నమోదైంది.



## మాంసం ఉత్పత్తిలోనూ మేటి

ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. జాతీయ పశుగణన లెక్కల ప్రకారం.. మాంసం ఉత్పత్తి వృద్ధిరేటులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచింది. దేశ సగటు వృద్ధిరేటు 16.9 శాతంగా నమోదైంది. ఐదేండ్లలోనే 2.49 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తి పెరిగింది. గొర్రె మాంసం విషయానికొస్తే 2017-18లో 1.58 లక్షల టన్నుల గొర్రె మాంసం ఉత్పత్తి కాగా 2018-19లో 2.36 లక్షల టన్నుల మాంసం ఉత్పత్తి అయింది. ఏడాదిలోనే 78 వేల టన్నుల గొర్రె మాంసం ఉత్పత్తి పెరిగింది. అధికార లెక్కల ప్రకారం తెలంగాణలో 90 శాతం మంది మాంసాహారులే. దేశంలో ప్రతి వ్యక్తి ఏడాదికి సగటున 4 కేజీల మాంసం తింటే... తెలంగాణలో ఒక వ్యక్తి సగటున 9 కేజీల మాంసం తింటున్నారు. దీంతో తెలంగాణలో మాంసానికి భారీగా డిమాండ్ ఉన్నది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు నుంచి ప్రతి వారం 400-500 లారీల గొర్రెలు రాష్ట్రానికి వచ్చేవి. ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం చేపట్టిన తర్వాత దిగుమతి సగానికి సగం తగ్గిపోయింది. ఇప్పుడు 100-200 లారీల గొర్రెలే వస్తున్నాయి.

## తెలంగాణ మాంసం మస్తు రుచి

పండుగకు, పబ్బానికి, పార్టీకి, ఫంక్షన్‌కు.. మాంసం ముక్క ఉడకాల్సిందే. అదిలేకపోతే నోట్లోకి ముద్ద దిగదు. చికెన్, మటన్, గుడ్డు... నాన్‌వెజ్ ఏది కనిపించినా సరే జిహ్వాకు రుచి చూపించాల్సిందే. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం ఫలితంగా రాష్ట్రం నుంచి పెద్ద మొత్తంలో మాంసం ఉత్పత్తి అవుతున్నది. ఎంతలా అంటే.. ఒక్క ఏడాదిలోనే 10.9 శాతం వృద్ధిని నమోదు చేసింది.

ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు పక్కాగా, పకడ్బందీగా, ప్రజల ఇబ్బందులు దూరం చేసేలా ఉండాలి. అలా ఆలోచించి తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయమే. సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం. ఈ పథకం వల్ల లక్షలాది మంది ప్రత్యక్షంగా లబ్ధిపొందారు. ఇప్పుడు కోట్లాది మంది ఆ పథక ఫలితాన్ని అనుభవిస్తున్నారు. అవును! రాష్ట్ర సర్కారు ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల మాంసం ఉత్పత్తిలో తెలంగాణ దూసుకుపోతున్నది. దేశంలోనే మరే రాష్ట్రానికి సాధ్యంకాని విధంగా మాంసం ఉత్పత్తిలో రాష్ట్రం ఘనమైన వృద్ధిని సాధించింది. ఫలితంగా దేశం లోనే నంబర్ 1 స్థానంలో నిలిచింది. గొర్రె మాంసం, పౌల్ట్రీ, మేక, గుడ్డు, పాలు, ఉన్ని ఉత్పత్తిలో రాష్ట్రం గొప్ప వృద్ధిని సాధించటంతో ఇటు పెంపకం దారులకు, అటు వినియోగదారులకు మేలు జరుగుతున్నది.




గణాంకాలను పరిశీలిస్తే... 2018-19లో మాంసం ఉత్పత్తిలో తెలంగాణ 16.9 శాతం వృద్ధిరేటును నమోదుచేసింది. ఈ రేటు దేశ సగటు వృద్ధిరేటు (6శాతం) కంటే రెండింతలు ఎక్కువ. గొర్రె మాంసతం ఉత్పత్తిలో మరే రాష్ట్రం కూడా తెలంగాణ దరిదాపుల్లో లేదు. తెలంగాణ నుంచి గొర్రె మాంసం అధికంగా ఉత్పత్తి కావటానికి ప్రభుత్వం చేపట్టిన సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం దోహదం చేసిందనేది పలువురి అభిప్రాయం. 1.91 కోట్ల గొర్రెలతో దేశంలోనే అధిక గొర్రెలు కలిగిన రాష్ట్రంగా తెంగాణ తొలిస్థానంలో నిలిచింది.

**సర్కారు గొర్రెలకు ఉచిత దాణా**

వేసవిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెలకు రూ.66 కోట్లతో ఉచితంగా దాణా పంపిణీ చేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. కేవలం గొర్రెలను పంపిణీ చేయడమే కాకుండా వాటికి దాణా, నీరు, ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. యూనిట్‌కు 4 బస్తాల దాణా అందిస్తామన్నారు. గొర్రెలకు బీమా సౌకర్యం కల్పించామని, చనిపోయిన వాటి వివరాలను అధికారులకు తెలియజేస్తే క్లెయిమ్స్ చెల్లిస్తారన్నారు. గొర్రెల పెంపకందారు ప్రమాదవశాత్తు చనిపోతే రూ.ఆరు లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో ఆధునిక సౌకర్యాలతో గొర్రెల పెంపకంపై శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కువ కోతలు ఇచ్చే మేలు రకపు పశు గ్రాస విత్తనాలను 75 శాతం రాయితీపై రైతులకు ఇస్తామన్నారు.

## విజయ డెయిరీ

**రోజూ 5 లక్షల లీటర్లు**

**రూ.30 కోట్ల నష్టాలు పూడ్చుకొని ఇప్పుడు రూ.31 కోట్ల లాభాల్లోకి**

*విజయ డెయిరీకి పాలు అందించే రైతులకు ప్రతి 15 రోజులకోసారి నేరుగా వారి ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. దీనికి అదనంగా తెలంగాణ ప్రభుత్వం పాడిరైతులకు ప్రతి లీటర్‌పై రూ.4 చొప్పున ప్రోత్సాహకం కూడా అందిస్తున్నది*

**పశుసంరక్షణకు వెటర్నటీ హాస్పిటల్స్**

జిల్లా ప్రధాన కార్యాలయంలో జంతువుల ఆరోగ్య సేవల కోసం వెటర్నటీ హాస్పిటల్స్ మరియు పాలిక్లినిక్స్ ఏర్పాట్లు చేసింది. తెలంగాణ రాష్ట్రంలో 2,217 వెటర్నరీ హాస్పిటల్స్ / డిస్పెన్సరీలు, 9 డిసీజ్ డయాగ్నొస్టిక్ సెంటర్లు మరియు 1,646 ఆర్టిఫిషియల్ (గర్భధారణ కేంద్రాలు) పనిచేస్తున్నాయి.

పశుసంవర్ధక, పాడి ఉప రంగం మొత్తం ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. రాష్ట్ర సామాజిక అభివృద్ధి రంగం యొక్క సహకారం స్థూలంలో 50.3% వ్యవసాయం, అనుబంధ రంగం యొక్క విలువ జోడించబడింది. తెలంగాణలో పశువుల రిజర్వాయర్ ఉంది. ముఖ్యంగా పశువులు, గొర్రెలు 5.52% ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 29 లక్షల కుటుంబాలు పశుసంపదలో నిమగ్నమై ఉన్నాయి. వారి జీవనోపాధి కోసం పశువులు 7.3% తోడ్పడ్డాయి.

**సంతోషంగా ఉన్నది**

నష్టాల్లో ఉన్న సంస్థ లాభాల్లోకి రావడం సంతోషం కలిగించింది. ప్రభుత్వ సహకారం, ఉద్యోగుల పనితీరుతో ఈ విజయం సాధ్యమైంది. మరిన్ని ఉత్పత్తులను పెంచి, లాభాలను మరింత పెంచేందుకు కృషిచేస్తాం. విజయ ఉత్పత్తులను మరిన్ని రాష్ట్రాలకు చేర్చేలా చర్యలు తీసుకుంటాం.

*– లోక భూమారెడ్డి, చైర్మన్, విజయ డెయిరీ*







నష్టాల్లో ఉన్న విజయ డెయిరీని లాభాల బాట పట్టించాలనే ఉద్దేశంతో అనేక చర్యలు తీసుకొన్నాం. అవి ఫలించాయి. పాడి రైతులకిచ్చే ప్రోత్సాహకం ప్రభుత్వం నుంచి కాకుండా విజయ డెయిరీనే సొంతంగా ఇచ్చేస్థాయికి తీసుకెళ్లేలా, విజయ ఉత్పత్తులు ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకుంటున్నాం అని పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

పాలసేకరణ, అమ్మకంలో విజయ తెలంగాణ డెయిరీ విజయ పథంలో దూసుకుపోతున్నది. ప్రభుత్వ ప్రోత్సాహంతో నష్టాల నుంచి బయట పడడమే కాకుండా లాభాలు గడించే స్థాయికి చేరింది. పాడి రైతుకు ఇన్సెంటివ్ అందించడంతోపాటు, నిరుద్యోగులకు ఉపాధినీ కల్పిస్తున్నది. రాష్ట్రంలోనే కాకుండా వివిధ రాష్ట్రాల్లో నాణ్యమైన పాలు, పాల పదార్థాలను సరఫరా చేస్తున్నది.



రాష్ట్రంలో పాల సేకరణలో విజయ డెయిరీ రికార్డులు సృష్టిస్తున్నది. రూ. 30 కోట్ల నష్టాన్ని పూడ్చుకుని... ప్రస్తుతం రూ. 31 కోట్ల లాభాల్లోకి వచ్చింది. వార్షిక టర్నోవర్‌ను రూ. 750 కోట్లకు పెంచుకున్నది. పాల సేకరణ, ఉత్పత్తుల్లోనూ ఉత్తమ నాణ్యతా ప్రమాణాలతో జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నది. గతంలో రోజూ 2.50 లక్షల లీటర్ల పాలను సేకరిస్తే ఇప్పుడు రెట్టింపు స్థాయిలో 5 లక్షల లీటర్లు సేకరిస్తున్నది. విక్రయాలనూ అదేస్థాయిలో పెంచుకుంది. 3.70 లక్షల నుంచి 4 లక్షల లీటర్ల పాలను రోజూ విక్రయిస్తున్నది. విజయ డెయిరీతో భాగస్వామ్య రైతుల సంఖ్య 60వేల నుంచి 75వేలకు పెరిగింది.

### ఫలితానిచ్చిన బర్రెల పంపిణీ

పాల ఉత్పత్తిని పెంచడంతోపాటు పాడి రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన సబ్సిడీ బర్రెల పంపిణీ సత్ఫాలితాలిచ్చింది. ఇప్పటివరకు 45 వేల బర్రెలను పంపిణీ చేసింది. దీంతో పాడిరైతుల సంఖ్యతోపాటు పాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. విజయ ఉత్పత్తుల విక్రయాలద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి చూపేందుకు ప్రభుత్వం విజయ డెయిరీ పార్లర్ల ఏర్పాటును పెంచింది. సంచార పార్లర్లనూ ప్రోత్సహించింది. 10 రకాలకు పైగా పాల ఉత్పత్తులను విజయ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నది. ఐస్‌క్రీం ఉత్పత్తులను కూడా మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం ఢిల్లీ, మహారాష్ట్రలో విజయ ఉత్పత్తులు విక్రయిస్తుండగా ఇటీవలే ఏపీలోనూ విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. త్వరలోనే ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో కేంద్రాలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పాల ఉత్పత్తిని మరింత పెంచేందుకు ప్రభుత్వం 8 లక్షల లీటర్ల సామర్థ్యంతో రూ.250 కోట్లతో రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో మెగా డెయిరీ నిర్మాణ పనులను ప్రారంభించింది.

### సబ్సిడీపై 2.13 లక్షల పాడి పశువులు

విజయ, కరీంనగర్, ముల్కనూర్, మదర్ డెయిరీలకు పాలు పోస్తున్న 2.13 లక్షల మంది రైతులకు సబ్సిడీపై పాడిగేదెలు, పాడి ఆవులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వం. ఒక్కో పాడిగేదెకు రూ. 80 వేలు కాగా ఇందులో ఎస్సీ, ఎస్టీలకు 75 శాతం, బీసీలకు 50 శాతం సబ్సిడీని యిస్తున్నది. మొదటగా 15 వేల మంది లబ్ధిదారులకు గేదెలను పంపిణీ చేసింది. ప్రతినెలా 15 వేల నుండి 16 వేల పశువులను కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందజేయనున్నారు. ఈ గేదెలను హర్యానా, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుండి కొనుగోలు చేస్తున్నారు. ఆయా రాష్ట్రాలలో గేదెల లభ్యత, నాణ్యతను పరిశీలించేందుకు డెయిరీల ప్రతినిధులు, అధికారులు, రైతులతో కూడిన బృందాలు పర్యటించారు.

రైతుల ఇష్టాఇష్టాలపై ఆధారపడే విధంగా పాడిగేదెల కొనుగోలు





పథకం నిబంధనలు రూపొందించారు. పశువుల కొనుగోలు విధివిధానాలను 2.13 లక్షల మంది సభ్యులకు తెలుగులో కరపత్రం రూపంలో ముద్రించి అందజేశామన్నారు. బల్క్‌మిల్క్ చిల్లింగ్ సెంటర్ల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఇందుకు అధికారులు స్థానిక డెయిరీతో కూడిన 300 బృందాలు ఏర్పాటు చేశారు. కొనుగోలు చేసిన ప్రతి గేదెకు తప్పనిసరిగా బీమా చేస్తామని మంత్రి చెప్పారు. ఇప్పటికే పాడిరైతులను ప్రోత్సహించేందుకు లీటర్ పాలకు 4 రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామన్నారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పాలను మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకోవాలనేదే ఈ కార్యక్రమం ఉద్దేశమని వివరించారు.



### 300 కోట్లతో విజయ డెయిరీ ఆధునీకరణ

తెలంగాణ విజయ డెయిరీని రూ.300 కోట్లతో ఆధునీకరించి మెగా డెయిరీగా అభివృద్ధి చేయనున్నట్లు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. ప్రైవేటు డెయిరీలకు దీటుగా ఉత్పత్తులు, విక్రయాలను పెంచేందుకు విజయ డెయిరీలో కీలక మార్పులు తెస్తామన్నారు.

ప్రస్తుతం హైదరాబాద్ లాలాపేట్‌లోని డెయిరీ కేంద్రంలో రోజుకు 5 లక్షల లీటర్ల సామర్థ్యంగల ప్లాంటు పనిచేస్తోందని, దీనికి అదనంగా మరో 5 లక్షల లీటర్ల సామర్థ్యంగల మరో ప్లాంట్‌ను ఆధునిక పరికరాలతో ఏర్పాటు చేయనున్నట్లు తలసాని వివరించారు. ఇందుకోసం షామీర్‌పేట సమీపంలో 100 ఎకరాల స్థలాన్ని గుర్తించామన్నారు. ప్రతి జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రాల్లో విజయ డెయిరీ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విజయ డెయిరీ అభివృద్ధికి చేపట్టవలసిన చర్యలపై ప్రైవేటు సంస్థతో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు.

### రాజధానిలో మరో 100 ఔట్‌లెట్లు

డెయిరీ ఉత్పత్తుల విక్రయాలను పెంచేందుకు హైదరాబాద్‌లో ప్రస్తుతమున్న వాటికి అదనంగా 100 ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో విజయ డెయిరీకి పాల సేకరణను పెంచేందుకు సొసైటీలను ఏర్పాటు చేయాలన్న తలసాని... ప్రయోగాత్మకంగా ఐదు ప్రాంతాల్లో డెయిరీకి పాలు పోసే రైతులకు వెంటనే డబ్బులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఖాళీగా ఉన్న 110 ఉద్యోగాలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. విజయ నెయ్యికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. అమ్మకాలు పెంచుకునేందుకు ప్రైవేటు డెయిరీలు ఏజెంట్లకు ఇస్తున్న కమీషన్‌కు సమానంగా ఇస్తామన్నారు.

### మీనం మెరిసె.. మత్స్యకారుడు మురిసె

నాడు సిరిసిల్ల మెట్ట ప్రాంతం... కరువు నేల.. సాగునీటి సంగతి దేవుడెరుగు, తాగునీటికీ తండ్లాటే... అన్ని వర్గాలకూ ఉపాధి కరువే... కానీ, నేడు అదే సిరిసిల్ల పచ్చబడ్డది. కాళేశ్వర జలాలు తరలిరావడం, భూగర్భ జలాలు పైపైకి చేరడంతో ఆహార పంటలే కాదు, చేపల పంటా దండిగా పండుతున్నది. కదిలివచ్చిన గోదారి... సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ఫలాలతో బొచ్చె బొమ్మె, జెల్ల, వాలుగ, రవ్వ, రొయ్య, పాపెర్లు, పాంప్లెట్లు, బంగారు తీగ, మెరిగ ఇలా తీరొక్క చేప ఎదుగుతున్నది. మధ్య, ఎగువమానేరుతోపాటు 800 చెరువుల్లో మత్స్య సంపద భారీగా వృద్ధి చెందుతున్నది. నాడు ఉపాధి లేక పూటగడవడమే కష్టంగా బతికిన






మత్స్యకారులకు నేడు చేతినిండా పని దొరుకుతున్నది. ఏ ప్రాజెక్టుకు వెళ్లినా.. ఏ చెరువుకు వెళ్లినా చేపలు పుష్కలంగా చిక్కుతున్నాయి. ఒక్క ఎస్సారార్ జలాశయంలోనే రోజుకు 20 క్వింటాళ్ల సంపద బయటికి వస్తుండగా, మత్స్యకార కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

***మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని గతేడాది నెల్లూరు నుంచి 14 లక్షల విత్తన రొయ్య (మంచినీటి) లను తెప్పించి ఎస్సారార్ రిజర్వాయర్‌లో పోయించారు.***



ప్రభుత్వ ఆధానంలోని మొత్తం విస్తీర్ణాన్ని ఉపయోగించుకుంటే ఏటా సుమారు 23 కోట్ల చేపపిల్లలను ఉత్పత్తి చేసే అవకాశం ఉన్నదని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పంపిణీకి అవసరమైన చేప పిల్లలను రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 389 ఎకరాల్లో 24 చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలున్నాయని, వీటిలో కొన్ని కేంద్రాలను మాత్రమే ఉపయోగిస్తున్నారని, మిగిలిన విస్తీర్ణంలోనూ చేప పిల్లలను ఉత్పత్తి చేయాలని తెలిపారు. 2019-20లో 2.11 కోట్ల చేపపిల్లలు, 2020-21లో 2.40 కోట్ల చేపపిల్లలను మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో నీటి వనరులు పెరగడం వల్ల భారీ సంఖ్యలో చేప పిల్లలు అవసరం అవుతాయని చెప్పారు. ప్రతిసారీ ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తున్నదని, ఇకపై మన వద్దే ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. అవసరమైతే ఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. ఇక మత్స్యకారులు సొంతంగా విక్రయించుకునేలా రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేశారు.

**పదివేల కుటుంబాలకు ఉపాధి...**

గతంలో ఉపాధి దొరక్క ఎలాంటి ప్రోత్సాహం లేక చాలా మంది మత్స్య కారులు ఇతర రంగాల వైపు వెళ్లారు. కానీ, తెలంగాణ సర్కారు కులవృత్తులకు జీవం పోయడంతో సంబురపడుతున్నారు. మళ్లీ తెడ్డు, తెప్ప పట్టి నీళ్లలోకి దిగుతున్నారు. చెరువుల్లో చేపల సంపద పెరుగడం, రాయితీపై వలలు, బుట్టలు, చేపల మార్కెటింగ్ కోసం బైకులు, టాటా ఏస్‌లు అందిస్తుండడంతో వృత్తి వదిలేసి వారు సైతం తిరిగి వస్తున్నారు. దీనికితోడు మధ్య మానేరు నిర్వాసితు లందరికీ ఉపాధి కల్పించేందుకు ఆసక్తి ఉన్న వారందరికీ సర్కారు లైసెన్స్‌లు ఇచ్చింది. 42 సంఘాల పరిధిలో సుమారు 3070 మందికి సభ్యత్వం ఇచ్చింది. సిరిసిల్లా జిల్లాలో మొత్తంగా 89 మత్స్య సహకార సంఘాలు ఉండగా, సుమారు 10వేల మందికి ఉపాధి దొరుకు తున్నది.

**పుష్కలంగా మత్స్య సంపద..**

ఎస్సారార్, ఎగువ మానేరుతోపాటు 800 చెరువులు, కుంటల్లో సర్కారు ఏటా కోటికి పైగా చేప విత్తనాలను పోస్తున్నది. 1.15 కోట్లకు పైనే విడుదల చేసింది. దీనికి తోడు గోదావరి జలాలు రావడం, అందులోనూ చేపలు భారీగా తరలివస్తుండడంతో మానేరు సహా పలు ప్రాజెక్టుల్లో బొమ్మెలు, పాపెర్లు, బొచ్చెలు, బంగారు తీగలు, రవ్వలు, జెల్లలు, వాలుగ సహా గంగరొయ్యల సంతతి భారీగా పెరిగింది. ఒక్క ఎస్సారార్ రిజర్వాయర్‌లో రోజుకు 20 క్వింటాళ్ల చేపలు దొరుకుతున్నాయి.



# బడుగులకు భారీ నిధులు

'మాకు సంకల్పం ఉన్నది. ప్రజల దీవెనలు సంపూర్ణంగా ఉన్నాయి. ఈ ధైర్యంతో మేము ముందడుగు వేస్తున్నాము. దుష్టశక్తుల ఆటలు కట్టించే నేర్పు, ఓర్పు మాకు ఉన్నాయి. ఏ గుండె ధైర్యంతో ఉద్యమాన్ని సాగించి, విజయం సాధించామో అదే స్ఫూర్తితో ఇప్పుడు బంగారు తెలంగాణ సాధించడానికి నడుం బిగించాం'. ఈ మాటలు 2014-15 తొలి బడ్జెట్‌లోనివి. అనతి కాలంలోనే ఈ మాటలను ఆచరణలో సత్యం చేసి చూపించింది ఈ ప్రభుత్వం.

నిన్నటి రోజును శోకిస్తూ చూడకు, అది తిరిగిరాదు. నేడు నీది, దానిని చక్కగా మెరుగుదిద్దుకో. మసక కమ్మిన రేపటి రోజును స్వాగతించు సాహసంతో నిర్భయంగా.. అన్న మహాకవి హెన్రీ వర్డ్స్‌వర్త్ కవిత్వంలోని పంక్తులు సీఎం కేసీఆర్ తన పరిపాలన ద్వారా చేతల్లో చూపిస్తున్నారు. ఎన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురైనా నిబద్ధతతో దూసుకుపోతున్నారు. ప్రజారంజక పాలనను అందిస్తున్నారు. ఈ ఏడేండ్లలో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమాన్ని అంచనాలకు మించి చేసి చూపించారు. దేశం నివ్వెరపోయేలా కేంద్రంతో సహా పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునేలా చేశారు. సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమే అనడానికి నిదర్శనంగా కేసీఆర్ నిలుస్తూ.. కరోనా మహమ్మారి ఆర్థికవ్యవస్థను కుదేలు చేసినా, కేంద్రం న్యాయంగా ఇవ్వవలసిన నిధులను మంజూరు చేయకపోయినా ప్రజలకు మేలుచేయాలనే తపన, అంకితభావం, సంకల్పబలం ఉంది. దాంతో ఇనుమడింపబడిన శక్తిని పునికిపుచ్చుకొని దూసుకుపోతున్నది ఈ ప్రభుత్వం. ఈ సంక్షేమ పథక రచనలోనే మానవీయ కోణం ఉంది. తెలంగాణ సంక్షేమ పథకాలు తాత్కాలిక ఉపశమనం కోసం రూపొందించినవి కావు. శాశ్వత పేదరిక నిర్మూలనకూ, ఆత్మగౌరవం పెంపొందించే దిశగా అమలు చేయబడుతున్నవి.

2015- 16లో ఆరంభమైన సంక్షేమ పథకాలను నిధుల కేటాయింపుల్లో ఏటా రెట్టింపు చేస్తూ వచ్చారు. బీసీల సంక్షేమానికి 2,172 కోట్లు కేటాయించగా 2021- 22 నాటికి 5,522 కోట్లు ప్రతిపాదించారు. 2014 నాటికి 19 మాత్రమే ఉన్న బీసీ గురుకు లాలను 281 వరకు పెంచారు. ఇలా అన్ని సామాజిక సమూహాల సంక్షేమం కోసం వినూత్న పథకాలను అమలు చేస్తున్నారు.

నేడు తెలంగాణ సమాజం గొప్ప పరివర్తనకు లోన వుతున్నది. అత్యధిక సంఖ్యాకులు మధ్యతరగతిలోకి ప్రవేశిస్తున్నారు. అందుకు ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, జీవన ప్రమాణాలు మెరుగుపరచడం లాంటి ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యలు కారణం. సీఎం కేసీఆర్ నిరంతరం కఠోర పరిశ్రమతో చేస్తున్న ఆలోచనలు, భవిష్యత్ దర్శనం, అందరికీ అభివృద్ధి ఫలాలు అందేలా సమసమాజ నిర్మాణానికి బాటలు వేస్తున్నారు. సమగ్ర కార్య ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ఇదంతా కండ్ల ముందు ప్రత్యక్షంగా కనిపిస్తున్న ప్రగతికి సజీవ సాక్ష్యం.

### పల్లె-పట్నం సంతులనం

అభివృద్ధి సంక్షేమాలకు సమప్రాధాన్యమిస్తూ ముందుకుపోతున్న రాష్ట్రప్రభుత్వ విధానాన్ని 2021-22 తెలంగాణ వార్షిక బడ్జెట్ ప్రతిఫలించింది. కరోనా కష్టకాలంలో, ఆదాయ వనరులు పడిపోయిన పరిస్థితుల్లో కూడా మున్నెన్నడూ లేనిస్థాయిలో రెండు లక్షల ముప్పై వేల 825 కోట్ల భారీ బడ్జెట్‌ను రూపొందించటం ముదావహం. రాష్ట్ర అవతరణ నుంచి మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నది. నిధుల కేటాయింపుల్లో సర్వజన సంక్షేమం కనిపిస్తున్నది. అలాగే వివిధ సామాజిక వర్గాల అభ్యున్నతికి గత ఏడాది కేటాయింపులకంటే ఈసారి భారీగా నిధులు పెరిగాయి. గత ప్రభుత్వాల హయాంలో బడ్జెట్ పద్దులు అంటే ఏదో అంకెల గారడీ. మొక్కుబడి కేటాయింపులతో జనాన్ని మభ్యపెట్టి కాలం గడిపే పద్ధతి ఉండేది. అలాకాకుండా ఈ వార్షిక బడ్జెట్‌లో నిర్దిష్ట లక్ష్యాల సాధన, అవసరాల ప్రాతిపదికన కేటాయింపు అడుగడుగునా కనిపిస్తున్నది.






### బొమ్మెకు భలే గిరాకీ..

పుష్కలమైన మత్స్యసంపదతో మత్స్య కారులకు రోజుకు భారీగా గిట్టుబాటవుతున్నది. రకాన్ని బట్టి కిలోకు రూ.100 నుంచి రూ.500 దాకా విక్రయిస్తున్నారు. ఇందులో చేపల ప్రియులు చాలా ఇష్టపడే బొమ్మె రకానికి ఫుల్ గిరాకీ ఉంటుంది. కిలోకు రూ.400 నుంచి రూ.500 పలుకుతుండగా, ఇవి చిక్కిన మత్సకారులకు ఆ రోజే పండుగ అవుతుంది. ఇక రవ్వ రూ.120-150, పాపెర రూ.300 - 400, వాలుగ రూ.100-150, జెల్ల రూ.150, రొయ్యలు రూ.300 విక్రయిస్తున్నారు. అంచనా ప్రకారం జిల్లాలో సగటున ఒక్కో మత్సకారుడు నెలకు రూ.10-15వేల పైగానే సంపాదిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



### ఎక్కడికక్కడే వ్యాపారం

మానేరు ప్రాజెక్టులో మత్స్య సంపద భారీగా పెరగడంతో ప్రజలకు జిమ్మలు పుష్కలంగా అందుబాటులో ఉంటున్నాయి. మానేరు పొడువునా ఎక్కడికక్కడ మార్కెట్లు వెలుస్తున్నాయి. చేపలు పట్టే మత్స్యకారులు అకడికక్కడే విక్రయిస్తున్నారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, కొదురుపాక, వెంకట్రావుపల్లె, అగ్రహారం, వేములవాడ, రుద్రవరం, నాంపల్లి, కంది కట్కూరు, చింతల ఠాణా గ్రామాల్లో మత్స్య కార్మికులు రోడ్ల పక్కన పెట్టుకుని అమ్ముతున్నారు. మత్స్యశాఖ అధికారుల లెక్కల ప్రకారం మధ్యమానేరు పరిధిలో రోజుకు 20 టన్నుల చేపలు విక్రయిస్తున్నారు. కొద్దిరోజులుగా మొబైల్ మార్కెట్ల ద్వారా మండల కేంద్రాల్లోనూ వ్యాపారం చేస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో చేతి వృత్తుల్లో వేటికైతే ఆదరణ ఉన్నదో వాటికి ఆధునిక సాంకేతికత జోడించి, ఆయా వృత్తుల వారికి శిక్షణ ఇప్పించి వారి బతుకులకు భరోసా కలిగిస్తుంది టీఆర్ఎస్ ప్రభుత్వం.

- కట్టా ప్రభాకర్
m : 8106721111
e: akumarkatta@gmail.com







# ముత్యాలకు కేరాఫ్ హైదరాబాద్

హైదరాబాద్ ముత్యాల నగరం. అన్ని పరిమాణాలు, రంగులు, రూపాల యొక్క అరుదైన, ప్రకాశించే, మృదువైన, కన్నీటి చుక్క ముత్యాలకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్.

ముత్యం ప్రకృతి అద్భుతాలలో ఒకటి. సముద్ర ఆభరణంగా పరిగణించబడుతుంది. 5000 సంవత్సరాలకు పైగా అలంకరించడం కోసం ఉపయోగించిన ఐదు విలువైన ఆభరణాలలో ఇది ఒకటి. ముత్యాల మెరుపు స్పష్టత, స్వచ్ఛతకు చిహ్నం. అందువల్ల ఇది ఎక్కువమంది ఇష్టపడే ఆభరణాలలో ఒకటిగా గుర్తింపబడింది.





దెక్కన్ పీఠభూమి యొక్క గుండె, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ చాలా కాలం నుండి 'ముత్యాల నగరం'గా పేరు సంపాదించింది. అద్భుతమైన ముత్యాలను ఉపయోగించి తయారుచేసిన వివిధ రకాల ఆభరణాలకు పేరెన్నిక గన్నది. ముత్యాల వ్యాపారాన్ని నిజాం మరియు కుతుబ్ షాహి పాలకులు బాగా ప్రోత్సహించారు. వీరు మెరిసే ఆభరణాల పట్ల చాలా అనుబంధాన్ని కలిగి ఉండేవారు. రాజులు, రాణులు వారి వస్త్రాలపై ముత్యాలను అలంకరించుకునేవారు. ముత్యాలను చూర్ణం (పొడి) చేసి, వారి శారీరక సౌందర్యాన్ని పెంచడానికి సమయోచితంగా ఉపయోగించారు. రాయల్స్ నేతృత్వంలోని సంపన్న జీవన విధానం వల్ల ప్రపంచం నలుమూలల నుండి హస్తకళాకారుల ప్రవాహం ఏర్పడింది. వీరు నాణ్యమైన ముత్యాల ఆభరణాలను తయారు చేయడంలో నిపుణులు. అనేక కుటుంబాలు పర్షియాలోని బాస్రా నుండి హైదరాబాద్‌కు శతాబ్దాల క్రితం వలస వచ్చాయి.

భారతదేశంలో ముత్యాలకు అతిపెద్ద వ్యాపార కేంద్రంగా హైదరాబాద్ పరిగణించబడుతుంది. పత్తర్‌ఘట్, లాడ్ బజార్ వంటి ప్రాంతాలు ముత్యాల వ్యాపారం చేసే జంట నగరాల పాత వ్యాపార కేంద్రాలు. ఇక్కడ కొన్ని ముత్యాల దుకాణాలు ఇప్పటికీ ఉన్నాయి. ఇవి ఒక శతాబ్దానికి పైగా పాతవి. హైదరాబాద్‌లోని ముత్యాలు మంచి నాణ్యమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఎందుకంటే ఇది అంతర్గత తయారీలో ఉంటుంది. అయితే ఇన్‌పుట్‌లను చేర్చడం, వినియోగదారుల పోకడలు కారణంగా కొత్త కొత్త డిజైన్లు ప్రాచుర్యం పొందాయి. నెక్లెస్‌లు, ముత్యాల పెండెంట్లు, మల్టీ-స్ట్రాండ్ కంకణాలు, ముత్యాల క్లస్టర్ రింగులు, ఒక వరుస ముత్యాల రింగులు, చెవిపోగులు, బ్రోచెస్, స్టడ్ చెవిపోగులు, కఫ్లింక్‌లు, అలాగే టై టాక్స్ ముత్యాలతో తయారు చేసిన అనేక వస్తువులు ఉన్నాయి.

నాణ్యమైన ముత్యాల ఆభరణాల కోసం నవాబీ షాపింగ్ చేయడానికి సరైన హైదరాబాద్ నగరం. హైదరాబాద్‌లో లభించే





ఈ ప్రకాశించే ఆభరణాల ముత్యాలు భారతదేశంలోని ఉత్తమ హస్తకళాకారులచే అద్భుతంగా రూపొందించబడ్డాయి. అద్భుతమైన ఆకారాలు, నమూనాల ముత్యాల ఆభరణాలు అందుబాటులో ఉంటాయి. చిన్న రకాల బియ్యం ముత్యాల నుండి విలువైన బాస్రా వరకు అరుదైన ముత్యాలతో, ఈ అందమైన ఆభరణాలకు అసమానమైన పేరుగా నగరం ప్రసిద్ధి చెందింది.



నాణ్యమైన ముత్యాలను వివిధ వనరుల నుండి సేకరిస్తారు. ఈ సేకరించిన ముత్యాలకు రంధ్రం వేస్తారు. తరువాత వాటిని బ్లీచింగ్ చేయడానికి, ముదురు రంగును వదిలించు కోవడానికి సుమారు నాలుగు రోజులు ఉడకబెట్టడం జరుగుతుంది. ముత్యాలను గాజు సీసాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్, నీరు, ఈథర్‌తో నింపుతారు. దీనిని అనుసరించి, అద్దాల స్థావరాన్ని కలిగి ఉన్న గ్లాస్ సన్ బాక్సులలో వాటిని ఐదు రోజులు ఉంచుతారు. చివరగా ముత్యాలు వేర్వేరు ఆకారాలు, రంగులు, పరిమాణాల పరంగా కడిగి గ్రేడ్ చేయబడతాయి. సాధారణంగా గులాబీ ముత్యాలు, నల్ల ముత్యాలు మంచి నాణ్యతతో పరిగణించబడతాయి. తెలుపు ముత్యాలు సాంప్రదాయకంగా ప్రాచుర్యం పొందాయి. సాంప్రదాయ హైదరాబాద్ ఆభరణాలలో ఎక్కువ భాగం తెల్ల ముత్యాలను కలిగి ఉంటుంది.

హైదరాబాద్ నగర సమీపంలోని చందన్‌పేట గ్రామం ముత్యాలకు ప్రత్యేకమైనదిగా పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇక్కడి మొత్తం జనాభా ముత్యాల డ్రిల్లింగ్ యొక్క సున్నితమైన, అద్భుతమైన కళలో నిమగ్నమై ఉంది. ఇది వారు తరతరాలుగా అభ్యసించిన నైపుణ్యం, ఇది హైదరాబాద్‌ను దేశంలోని అతిపెద్ద ముత్యాల డ్రిల్లింగ్ కేంద్రాలలో ఒకటిగా చేస్తుంది. చక్కటి ముత్యాల ఆధారిత ఆభరణాల తయారీలో పాల్గొన్న కళాకారుల నైపుణ్యం, ప్రజాదరణ కారణంగా ఇక్కడి నుండి ముత్యాలను విదేశీ మార్కెట్లకు కూడా ఎగుమతి చేస్తారు.

-సువేగా,
m : 9030 6262 88
e: desk.deccan@gmail.com




# ప్రఖ్యాత వైరాలజిస్టు పీటర్ పయట్ కోవిడ్-19 అనుభవాలు

గత ఏడాది మార్చిలో వైరాలజిస్టు పీటర్ పయట్‌కు కరోనా సోకింది. లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్‌ల ట్రాఫికల్ మెటాసిన్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఒక వారం రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. పయట్ బెల్జియంలో పెరిగారు. ఎబోలా వైరస్ ఆవిష్కర్తల్లో ఆయనొకరు. 1976 జైరే ప్రాంతంలోని విష జ్వరాల మీద పరిశోధించి ఎబోలా వైరస్ అనే కొత్తరకం వైరస్సే జ్వరాలకు కారణమని తేల్చారు. ఆయన జీవితం మొత్తం అంటువ్యాధులకు వ్యతిరేకంగా పరిశోధన, పోరాటలలోనే గడిచింది. 1995-2000కి మధ్య కాలంలో యునైటెడ్ నేషన్స్ ఎయిడ్స్ కార్యక్రమానికి నేతృత్వం వహించారు.

మార్చి 19న తీవ్రమైన తలనొప్పి, అధిక జ్వరం వచ్చింది. ఆ సమయంలో దగ్గు లేదు. అయినా నేను పనిచేస్తూనే ఉన్నాను. నేను సందేహించినట్లుగానే కోవిడ్ పాజిటివ్ వచ్చింది. ఇంట్లో అతిథుల కోసం కేటాయించిన గదిలో ఐసోలేట్ అయ్యాను. గత పది ఏళ్ళలో ఏనాడూ నేను అనారోగ్యంతో సెలవు తీసుకోలేదు. ఆరోగ్యంగానే ఉంటాను. ప్రతిరోజూ నడుస్తాను. నేను భయపడలేదు కాని, వయసు 71 సంవత్సరాలు కాబట్టి కొంత కలతకు గురయ్యాను. అయినా ఇది కూడా గడిచి పోతుందిలే అని భావించాను.



ఏప్రిల్ 1న ఓ డాక్టర్ మిత్రుడు పరీక్షలు చేయించటం మంచిదని సలహా ఇచ్చాడు. జ్వరం నానాటికి విషమించేదిగా మారింది. ఊపిరితిత్తులు తీవ్ర న్యుమోనియాకి గురయ్యాయి. కోవిడ్ లక్షణమే అది, అట్లాగే బాక్టీరియా నిమ్ము కూడా తోడైంది. ఆక్సిజన్‌తోటి తీవ్రంగానే ఉన్నా శ్వాస తీసుకోవడంలో పెద్ద ఇబ్బందులకు గురికాలేదు. కొంత అలసట బాగానే అనిపించింది. కోవిడ్ పరీక్షలో నెగటివ్ వచ్చినా. వైరస్ అంతర్థానమైనా దాని ప్రభావం కొన్ని వారాలపాటు ఉంటుంది.

మొదట వెంటిలేట్ మీదకు వెళ్ళాల్సి వస్తుందని భయపడ్డాను. అదృష్టవశాత్తూ ఆక్సిజన్ మాస్క్‌తోనే పనిగావించింది. ఇంటెన్సిన్ కేర్ విభాగంలో యాంటీ చాంబర్ గదిలో నా ఐసొలేషన్.

నా గదిని కొలంబియా వాసి అయిన క్లీనర్‌తో, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన మనిషితో పంచుకున్నాను. ముగ్గురికీ మధుమేహం ఉంది. పగలూ రాత్రి నిశ్శబ్దంలో సింపుల్‌గా గడిచిపోయాయి. ఎందుకంటే మాట్లాడే శక్తి, ఓపిక మా ముగ్గురిలో ఎవరికీ లేవు. మాటకూడా పెగిలేవి కాదు. గొణగటమే. ఇప్పటికీ సాయంకాలం నా గొంతు పెద్దగా పెగలదు. నా మనసులో ఒకే ప్రశ్న ఇదంతా ముగిశాక నేనెలా ఉండబోతున్నాను అనేది నా బుర్రను తొలిచేసేది.

నాలుగు దశాబ్దాల పాటు నేను ప్రపంచ వ్యాప్తంగా వైరస్‌లతో పోరాడాను. అంటువ్యాధుల నిపుణ పరిశోధకుడు అయ్యాను. నా సంతోషం ఏమంటే నాకు ఎబోలా రాలేదు కరోనా మాత్రమే వచ్చింది. శాస్త్రీయ అధ్యయనాలు చెపుతున్నదేమంటే ముప్పైశాతం వరకు మరణించే అవకాశాలున్నాయని వెస్ట్ ఆఫ్రికాలో 2014లో వచ్చిన ఎబోలా మరణాల కేసు కూడా అంతే ఉంది. కొన్నిసార్లు ఎంత శాస్త్రీయ ఆలోచనలతో ఉంటాం అనుకున్నా కొన్ని ఉద్వేగాలకు లొంగిపోతాం. నేను మనసులో అనుకునేవాడ్ని జీవితాంతం వైరస్‌లతో పోరాడావు కాబట్టి అవి ఇప్పుడు నీ మీద ప్రతీకారం తీర్చుకుంటున్నాయని. ఒక్కవారం పాటు భూమికి స్వర్గానికి మధ్య ఊగిసలాడాను. ముగింపు తెలియకుండా.

కొద్దికాలం తర్వాత ఆసుపత్రినుండి డిశ్చార్జి. ఇంటికి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా చేరుకున్నాను. ఎందుకంటే నేను నగరాన్ని చూడాలనుకున్నాను. మనుషులెవరూ లేని వీధులు, మూతబడిన పబ్‌లు, దుకాణాలు, ఆశ్చర్యకరంగా తాజా గాలి నగరం నిండా.

వీధుల్లో ఎవరూ లేకపోవటమొక కొత్త అనుభవం. నేను నా కండరాలు బలహీన పడటం వల్ల సరిగ్గా పని చేయలేకపోయాను. ఊరికే పడుకుని ఉండటం, కదలిక లేకపోవటం అనేది అంత మంచి విషయమేమీ కాదు. ముఖ్యంగా ఊపిరి తిత్తులకు చికిత్స జరుగుతూ ఉన్నప్పుడు.

ఇంటి దగ్గర దీర్ఘ సమయం ఏడ్చే వాడిని కూడా కొద్ది సేపు అలా పడుకుని ఉండిపోయేవాడిని. బుర్రలో ఎప్పుడూ ఏదో ఒక అనుమానం ఎక్కడో పొరపాటు జరుగుతుంది అనే అనిపిస్తూ

ఉండేది. ఆలోచనల్లో చిక్కుకుపోయినా కూడదీసుకుని ఎలాగోలాగా బయటపడాలి. సరైన దృష్టిని, ఆలోచనను అలవరచుకోవాలి. ఇంతకు ముందుకంటే నేనిప్పుడు నెల్సన్ మండేలాను ఇష్టపడతాను. ఎందుకంటే జైలులో 27 ఏళ్ల బంధింపబడటం కూడా గొప్ప సయోధ్యతో బయటకు వచ్చాడు.

వైరస్‌ల పట్ల నాకు ఎప్పుడూ గౌరవభావమే ఉండేది. అదేమీ ఇప్పుడు తగ్గలేదు. నా జీవితంలో ఎక్కువ భాగం ఎయిడ్స్ వైరస్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు వెచ్చించాను. ప్రస్తుతం వైరస్ నా శరీరంలోనే తిష్ట వేసుకుని కూర్చుంది. నా చూపు ఇప్పుడు భిన్నం. వైరస్‌లను ఇప్పుడు నేను చూసే పద్ధతి భిన్నంగా ఉంటుంది. వైరస్‌లలో ఇంతకు ముందు తలపడిన అనుభవానికి ప్రస్తుత అనుభవానికి భిన్నంగా ఉంది. నేనిప్పుడు దుర్భేద్యమైన వాడినేమీ కాదు.




ఆసుపత్రి నుండి డిశ్చార్జయ్యాక ఒక వారానికి శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది ఏర్పడింది. తిరిగి ఆసుపత్రికి వెళ్లవలసి వచ్చింది. అదృష్టవశాత్తూ అవుట్ పేషెంట్‌గా చికిత్స చేసి పంపబడ్డాను. నేను న్యుమోనియా పేషంట్ నయ్యాను. ఊపిరి తిత్తుల జబ్బు అది. సైటోకైన్ల తుఫానువల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. రోగనిరోధక వ్యవస్థ అతిగా పనిచేయటం వల్ల వచ్చే ఫలితం. వైరస్‌వల్ల టిష్యూ దెబ్బతిన్న కారణంగా ఎవరూ మరణించరు. చాలామంది వారి రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించటం వల్ల చనిపోతారు. రోగనిరోధక వ్యవస్థకు వైరస్‌ను ఏం చేయాలో తెలియదు. మన రోగనిరోధక వ్యవస్థను నెమ్మదింపజేసే కార్టికో స్టెరాయిడ్ల చికిత్సలోనే ఉన్నానింకా. వైరస్ విజృంభణతో పాటుగా సైటోకైన్ స్టార్మ్ గనుక వచ్చి ఉంటే నేను మిగిలేవాడినే కాదు. నాకు ఆట్రియల్ ఫైబ్రిలేషన్‌తో పాటుగా నా గుండె నిమిషానికి 170 సార్లు కొట్టుకునేది. దీనిని కూడా చికిత్సతో నెమ్మదింపజేయాలి. నియంత్రించాలి. ముఖ్యంగా రక్తం గడ్డకట్టటం, స్ట్రోకు మొదలైనవి నియంత్రించబడాలి. అసలు ఇదంతా కూడా వైరస్‌ను తక్కువ అంచనా వేయటమే. అది శరీరంలోని అన్ని అవయవాలను ప్రభావితం చేయగల సామర్థ్యం గలది.

చాలా మంది భావించేదేమంటే కోవిడ్-19 ఒక్కశాతం రోగులనే చంపుతుంది. మిగతా వారికి జలుబు లక్షణాలతో వచ్చి పోతుందని. ఇది చాలా తప్పుడు అవగాహన. ఈ కథ రాన్రాను మరింత సంక్లిష్టమవుతూ ఉంటుంది. కోవిడ్ వచ్చి వెళ్లాక చాలా మందికి దీర్ఘకాలిక మూత్రపిండ, గుండె సంబంధ వ్యాధులు వస్తాయి. వారి నరాల వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా వందల వేలమందికి తమ శేషజీవితం మొత్తం రీనల్ డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.

మనం కరోనా వైరస్ గురించి తెలుసుకునే కొద్దీ ప్రశ్నలూ, సందేహాలు ఉత్పన్నమవుతాయి. మనం ప్రయాణిస్తూనే నేర్చుకుంటున్నాం. ఈ ఎపిడమిక్ లేదా పాండమిక్‌ను త్వరగా నియంత్రించడం లేదని విధాన నిర్ణయకర్తలను, శాస్త్రవేత్తలను విమర్శించేవారు ఎక్కువ. ముందు చూపులేకుండా అనాలోచితంగా వ్యవహరించటం చూస్తే కోపం కూడా కలుగుతుంది.

అంతిమంగా నా ఊపిరితిత్తులు మెరుగు పడ్డాయి. నేను మళ్లీ పనికి మరలాలి. నా పని తాత్కాలికంగా పరిమితమైనదే అయినప్పటికీ పని మొదలెట్టాలి. నేను చేయాల్సిన మొదటి పని కోవిడ్-19 రీసెర్చ్ & డెవలప్‌మెంట్ ప్రత్యేక సలహాదారుగా వాన్‌డర్ లేన్‌కి పని చేయటం.

కరోనా వైరస్‌కు వాక్సిన్ లేకుండా మనం మళ్లీ సాధారణ జీవితం గడపటం సాధ్యం కాదు. అసలు ఈ సంక్షోభం నుంచి బయటపడే మార్గం వాక్సిన్ వ్యూహమే. వాక్సిన్‌ను పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేయాలి. లాజిస్టిక్స్ విషయంగా ఇదొక పెను సవాలు.

ఈ సంక్షోభం కొన్ని ప్రాంతాలలో రాజకీయ ఒత్తిడులను తేలిక పరుస్తుందను కోవటం భ్రమే అయినప్పటికీ, గతంలో పోలియో వాక్సిన్ ప్రచార సందర్భాలలో దీనిని చూశాం.

కోవిడ్-19కి వ్యతిరేకంగా ప్రపంచం చేస్తున్న పోరాటంలో ప్రపంచ ఆరోగ్య సంస్థది గొప్ప కృషి. అయితే డబ్ల్యూహెచ్‌ఓలో కొన్ని సంస్కరణలు రావాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధికాధికంగా సలహా సంఘాల మీద ఆధారపడుతూ వస్తుంది. అది అతి తక్కువగా బ్యూరోక్రాటిక్ లక్షణాలు గల సలహా కమిటీలపై ఆధారపడితే మంచిది. ఈ కమిటీలలోని దేశాలు తమ ఆసక్తులను ప్రాథమికంగా కాపాడుకోవటం కోసం పనిచేస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా తరచుగా రాజకీయ క్షేత్రంగా రూపొందుతూ ఉన్నది.

ఏది ఏమైనా నేను జన్మతః ఆశావాదిగానే మిగులుతాను. నేనిప్పుడు మృత్యువును కూడా ఎదుర్కొన్నాను. అర్థం పర్థం లేని వాటిని సహించే ఓపిక సహనాలు నాకు ఇంతకు మొదటి కంటే బాగా తగ్గిపోయాయి. అందుకనే నేను మరింతగా ఆచితూచి విషయాలకు స్పందించటంలో నా ఎంపికను నేను కలిగి ఉంటాను.

*(Dirk Dranlans పీటర్ పయట్‌తో జరిపిన సంభాషణకు Martin Enserink అనువాదం Sciencemag.orgలో ప్రచురితం. సౌజన్యం బెల్జియన్ పత్రిక Knack and Sciencemag.org May 8, 2020)*

-మంగారి రాజేందర్ (జింబో)
m : 9440483001
e : rajenderzimbo@gmail.com



# దేవునిగుట్టమీద దేవుడెవరు?



## తెగని దేవులాట



**2017**సం. పర్యాటకదినోత్సవంరోజు మా చరిత్రబృందం సందర్శించింది. దేవునిగుట్ట జయశంకర్ భూపాలపల్లి, ములుగు మండలంలోని కొత్తూరు గ్రామం బయట వుంది. మేమందరం కలిసి వెళ్ళక ముందు ఈ గుడిని టీవి99 వారు, మిత్రుడు తోపుడుబండి ఫేం సాదిక్ అలీ బృందం, మరికొందరు చూసారు. దేవునిగుట్టమీద కొత్తూరు ప్రజల జాతరను చిత్రించిన టీవీ99 వారి వీడియో చూడడంతో మొదటిసారి వ్యక్తిగతంగా నాకు దేవునిగుట్ట గురించి తెలిసింది. వీడియోలో గుడిని చూసిన వెంటనే ఇది ఆంగ్ కర్ వాట్(బౌద్ధ ఆరామం)ను పోలివున్నదని, వెంటనే వెళ్ళి చూడాలనే ప్రతిపాదన చేసాను మా చరిత్రబృందంలో. అయితే కారణాంతరాలవల్ల మేం వెంటనే వెళ్ళలేక పోయాను. సాదిక్ అలీ తన బృందంతో వెళ్ళివస్తూ దారిలోనే నాకు ఫోటోలు పోస్టు చేసాడు. నేను దేవునిగుట్ట గుడికి ఆంగ్ కర్ వాట్ దేవాలయంతో, జావాలోని బొరొబుదూర్ బౌద్ధారామంతో పోలికలున్నాయని చెప్పాను సాదిక్ భాయితో.

అరుదైంది, అద్భుతమైంది, అపూర్వమైంది, అనితరమైంది, సాటిలేనిది. దేశంలో దేవునిగుట్ట గుడిని పోలినవి చాలా అరుదు. మట్టి ఇటుకలతో నిర్మించిన గుడులలో ఉత్తరభారతదేశంలో ఒక గుడి వుంది, రెండవది గొల్లత్తగుడి మన తెలంగాణాలోనే వుంది. కాని రాతిఇటుకలతో నిర్మించిన దేవాలయాలు దేశంలో చాలా తక్కువ.

6 లేదా 7వ శతాబ్దంలో నిర్మించబడ్డ వజ్రయాన(మహాయాన) బౌద్ధారామం లేదా చైత్యాలయమిది. 9వ శతాబ్దంలో ఇండోనేషియా సెంట్రల్ జావాలోని మేగలాంగ్ లో నిర్మించిన బోరోబుదూర్ మహాయాన బౌద్ధ దేవాలయానికి, 13వ శతాబ్దంలో కాంబోడియా దేశంలో 400 ఎకరాలలో నిర్మించబడ్డ ప్రపంచప్రఖ్యాతమైన అంకర్ వాట్ దేవాలయానికి ఈ చైత్యాలయం మాతృక వంటి నిర్మాణం. అంకర్ వాట్ వజ్రయాన బౌద్ధదేవాలయం పెద్ద, పెద్ద రాళ్ళను ముక్కలుగా చేసి వాటిమీద చెక్కిన శిల్పాలను ఇటుకల లెక్క పేర్చి కట్టినది. అవి ఎత్తైన శిల్పాలు. అవి భారీనిర్మాణాలు. మన తెలంగాణలోని జయశంకర్–భూపాలపల్లి జిల్లా, ములుగు మండలంలోని కొత్తూరు గ్రామానికి ఈశాన్యంలో వున్న దుర్గమారణ్యంలో దేవునిగుట్టమీద రాతి ఇటుకలమీద చెక్కిన శిల్పాలతో కట్టిన గుడివుంది. 24 (30–6) అడుగుల ఎత్తున్న ఈ బౌద్ధ చైత్యాలయం గోడలు బయటివైపు, లోపటివైపు రెండువైపులా శిల్పాలతో అలంకరించబడ్డాయి. గుడిలో లోపలివైపు విమానం మొనదేలిన పిరమిడ్ ఆకారంలో కనిపిస్తుంది. ప్రస్తుతం అది



*అర్ధనారీశ్వర, గణపతి, కార్తికేయ, జంబాల, దేవుని గుట్ట*

కొంత 6అడుగుల దాకా కూలిపోయివుంటుంది. పైన శిఖరానికి రంధ్రం ఏర్పడివుంది. అంకర్ వాట్ దేవాలయానికి, దేవునిగుట్ట గుడికి గుడి నిర్మాణంలో, బౌద్ధశిల్పాలలో పోలిక వుంది. అంకర్ వాట్ దేవాలయం అతిపెద్ద దేవాలయాల కాంప్లెక్స్. కాని దేవునిగుట్ట మీది గుడి ఒక్కటే. ఆకారంలో చిన్నదే. కాని చారిత్రకంగా గొప్పది. ఈ చైత్యాలయం నిర్మాణంలో వాడిన రాతిఇటుకలను గుడిపక్కన వున్న రాతిబండల నుండి తీసినట్టున్నారు. లేత ఎరుపురంగులో వున్న ఇసికరాతి ఇటుకలతో కట్టారు. ఈ రాతిఇటుకలు సాధారణమైన రాళ్ళకంటే చాలా తక్కువ బరువును కలిగి వుంటాయి. అయితే ఈరాతిముక్కల అంచులు తొందరగా రాలిపోతాయి కనుక మొదట వీటిని చిన్న, చిన్న సైజులలో (2×2 అడుగులు, 2×1 అడుగుల కొలతలలో) రాతిబిళ్ళలుగా చేసుకుని ఆలయనిర్మాణం చేసారు. గుట్టమీద పునాదుల అవసరం లేకుండా, మొత్తం 4.5అడుగుల మందంతో మధ్యలో ఖాళీని వదిలిన రెండు పొరల గోడలతో నిర్మించినట్టు తెలుస్తున్నది. గుడిలోపల 10అడుగుల వైశాల్యంతో, బయటిగోడలు ఒక్కొక్కటి 19.6 అడుగుల కొలతతో గుడినిర్మాణంలో కూడా ఈ చైత్యాలయం ప్రత్యేకత కలిగివుంది. ఈ చైత్యాలయానికి ముందువైపు ద్వారంతో 3 రాతిఇటుకలగోడలు 6అడుగుల ఎత్తున కట్టబడి వున్నాయి. ఆలయానికి వంద అడుగులకన్నా ఎక్కువదూరంలో రాతిగుండ్లు పేర్చిన గోడ నలువైపుల వుంది. గుడికి ఉత్తరం దిశలో సహజసిద్ధంగా ఏర్పడిన గుండం వుంది.



గుడికి ఒక మూలన నిలబెట్టివున్న పాలరాతి స్తంభం బౌద్ధస్తూపాలవద్ద నిలిపివుంచే ఆయకస్తంభం, దానికి నాలుగువైపుల అర్ధపద్మాలు, సింహాలు చెక్కివున్నాయి. క్రీ.శ. 1లేదా2వ శతాబ్దాలకు చెందినదనిపించే ఆయకస్తంభం వల్ల ఈ స్థలం చైత్యాలయం కన్నా ముందునుంచే బౌద్ధస్థావరంగా వుండేదని అర్థమవుతున్నది.

దేవునిగుట్ట చైత్యాలయం తూర్పుకు ఎదురుగా ఒకేద్వారంతో నిర్మించబడ్డది. ఎత్తు తక్కువున్న చిన్నద్వారం. ద్వారానికిరువైపుల ద్వారపాలకులవలె కన్పిస్తున్న వజ్రయాన బౌద్ధమూర్తులలో ఒకరు హరివాహన లోకేశ్వరుడు. 10అడుగుల చతురస్రాకారపు చైత్యాలయపు లోపల 20,30యేండ్ల కింద ఏ దేవుని ప్రతిమ లేదు. ఈ గుడిబయట ఒక రాతివేదికమీద నంది విగ్రహం వుండేదిట. ఇపుడది లేదు. ప్రస్తుతం గుడిలో ఒక సిమెంటు వేదికమీద కొత్తూరు గ్రామప్రజలు ప్రతిష్ఠించుకున్న లక్ష్మీనరసింహస్వామి విగ్రహం వుంది. ఆ దేవునికే ప్రతి కామునిపున్నమి లేదా హోళిపండుగ సందర్భంగా జాతర చేసుకుంటున్నారిక్కడి గ్రామస్తులు.

లోపలి గోడలకు ద్వారంవైపు తప్ప మిగతా 3గోడలమీద బుద్ధ జాతక కథలకు చెందిన కథా దృశ్యాలు చెక్కివున్నాయి. బుద్ధుడు శిష్యులకు బోధిస్తున్న దృశ్యాలు 2,3 చోట్ల వున్నాయి. ఒకచోట యుద్ధసన్నివేశం చెక్కబడి వుంది. దానిలో చేతిలో ఖడ్గంతో కుషానుని పోలిన శిల్పం వుంది. మిగతా రెండుగోడలమీద కూడా బౌద్ధజాతక కథలే. అందులో బుద్ధుని బోధనల సంఘటనలే ఎక్కువగా చెక్కబడి వున్నాయి. బయటి గోడలమీద వివిధదృశ్యాలు ఆరేసి ఫ్రేములుగా విభజించ బడ్డాయి. మధ్యలోని శిల్పాలు పెద్దవిగా మిగతావి చిన్నవిగా వున్నాయి. ఒక్కటొక్కటిగా శిల్పాలను చెక్కి పేర్చిన రాతిఇటుకలు కింది నుండి పైకి సైజు తగ్గుతూ పోయాయి. దక్షిణంవైపు గోడమీద అజంతా చిత్రాలలోని పద్మపాణిని పోలిన బోధిసత్త్వుడు రాచకొలువులో లలితాసనంలో రాణితో కూర్చున్న దృశ్యం వుంది. అటిటు రెండుపక్కల బోధిసత్త్వుని అవతారరూపాల శిల్పాలున్నాయి. పైన ఫ్రేముల్లోను బుద్ధబోధనల దృశ్యాలే కనిపిస్తాయి. పడమటివైపు గోడమీద కిందివైపు అర్ధనారీశ్వర శిల్పం చెక్కివుంది. ఈశ్వరుని అర్ధభాగం, పార్వతి అర్ధభాగం స్పష్టంగా చెక్కబడింది. 6 అడుగులు, 8అడుగుల కొలతల ఈ ఫ్రేములో చతుర్భుజుడైన అర్ధనారీశ్వరుని కుడిచేయి గణపతి తలమీద, ఎడమచేయి కుమారస్వామి తలమీద పెట్టినట్లు చెక్కబడ్డాయి. దానిపై వరుసలో బుద్ధుని బోధనలు వింటున్న రాజు, రాణులు, పరివారం, మిథునాలు వున్నాయి. పై అంచుల రాతిఇటుకలపై సాగరమథనం చెక్కబడివుంది. ఉత్తరంవైపు గోడమీద చెక్కిన కథాదృశ్యం కొత్తదిగా వుంది. భయంకరంగా వున్న పెద్దతల కలిగిన బోధిసత్త్వుడు (జంబాలుడు?) ఎడమమోకాలితో ఎవరివీపునో వంచి, ఎడమ చేత అతని గొంతును వెనక్కి విరిచి నొక్కుతున్నట్టుగా వుంది. ఆ గోడమీద వున్న హరివాహన లోకేశ్వరునికి ఇరువైపుల అంచుగా నిలిపిన ఇటుకలమీద రెండు పూర్ణకుంభాలు చెక్కబడివున్నాయి. బౌద్ధనిర్మాణాలున్నచోట ఇవి సాధారణంగా కనిపిస్తుంటాయి. ఈ గోడకే శిఖరంవైపు ఈశాన్యపు అంచున చెక్కబడివున్న అమితాభుని శిరస్సు శిల్పం కాంబోడియా అంకర్ వాట్ దేవాలయం మీది పెద్ద రాతిముక్కల శిల్పానికి మాతృక అనిపిస్తుంది. ఇక్కడి శిల్పాలు అజంతా చిత్రాల తోను, అమరావతి, ఫణిగిరి, నాగార్జునకొండ బౌద్ధ శిల్పాలతోను, ఒరిస్సాలోని స్కందగిరి, ఉదయగిరి శిల్పాలతోను పోలికలు



అర్ధనారీశ్వర, గణపతి, కార్తికేయ, జంబాల,

కలిగివున్నాయి. ఈ దేవాలయానిది విశిష్టమైన శిల్పశైలి. అనితరమైనది.

బౌద్ధచైత్యాలయంలో శైవం కనిపించడం వజ్రయానప్రభావమే. తెలంగాణాలో బౌద్ధానికి చివరిదశ వజ్రయానం. తాంత్రిక బౌద్ధమని, మంత్ర యానమని పిలువబడే వజ్రయానానికి మంత్రాలు, ధారణులు, ముద్రలు, స్త్రీదేవతారాధన, లైంగిక యోగసాధనలు లక్షణాలు. భిక్షుకుల మతంగా వున్న బౌద్ధం, ఉపాసకుల మతంగా మారిపోవడం, ఇతర మతాలైన జైన, వైష్ణవ, శైవాలు తాంత్రిక పద్ధతులను అవలంబించడం 7వ శతాబ్దం నుండి 12 శతాబ్దం వరకు కొనసాగింది. వజ్రయానం నాగార్జునునికొండ నుండే ప్రపంచ మంతటికి విస్తరించింది. చైత్యకులు బుద్ధుడిని భగవంతుడిని చేసారు. మహాదేవునిగా అంగీకరించారు. దాని ఫలితమే బౌద్ధంలో శివుడు కనిపించడం. వజ్రయాన ప్రతిమారూపభేదాలలో (Iconography) అక్షోభ్యుని ప్రతిమ లేదా స్తూపం నమూనా వుండడం వంటివి కనిపిస్తుంటాయి.

ఏదైనా దేవాలయం గోడల మీద ప్రధానదైవానికి సంబంధించని శిల్పాలుండడం శిల్పశాస్త్ర (కాశ్యపశిల్పం) రీత్యా సమ్మతమే. రామప్పగుడి, కోటగుళ్ళమీద జైనతీర్థంకరుల శిల్పాలు, రామప్పగుడి మంటపంలో గోపాలకృష్ణుడు, నందికంది శివాలయంలో వైష్ణవ శిల్పాలు, బాదామీ, ఐనోల్, పట్టడకల్ గుడులలో బౌద్ధ, జైన, శైవ, వైష్ణవ శిల్పాలున్నాయి. వరంగల్లులోని గుడులలో ఒకమతం గుడిగోడల మీద పరమతం దేవుళ్ళ శిల్పాలున్నాయి. దేవునిగుట్ట గుడిలోని దేవుణ్ణి నిర్ణయించడానికి బయటిగోడలమీది అర్ధనారీశ్వర శిల్పం ఎట్లా ఆధారమౌతుందో శిల్పశాస్త్రవేత్తలు చెప్పాలి. ఎద్దు కనిపించినందువల్లనే ఈ గుడి శైవమనుకుంటున్నానంటారు కొరినా వెస్సెల్స్ అనే చారిత్రక పరిశోధకులు. బౌద్ధంలో ఎద్దు, గుర్రం, మేక, ఏనుగు, సర్పాలు సాధారణమే కదా. ఒక చరిత్రకారునికి రాక్షసవధ శిల్పసముదాయంలో ప్రలంబాసురుని వధిస్తున్న బలరాముడు కనిపించాడు. అతని శిల్పమిక్కడ ఏ సందర్భంలో చెక్కబడ్డదనాలి. అపుడిది వైష్ణవాలయం కావాలికదా. బోధిసత్వుని అవతారాల్లో జంభాలుడు మహాబలవంతుడు. సాధనమాలలో చెప్పినట్టు 'ఉచ్చుష్మ జంభాలుడు' ధనదుణ్ణి తొక్కిపట్టి నోటినుంచి వజ్రాలు కక్కిస్తాడు. ఇక్కడ తనను గుర్తుచేసుకోవచ్చు. బౌద్ధ ప్రతిమాలక్షణాలను పరిశీలిస్తే జంభాలుని గురించి తెలుస్తుంది. ఈ శిల్పంలో ధనదు(రాక్షసు)ని వధిస్తున్న తీరు పట్టడకల్‌లో మహిషాసురమర్దని మహిషుణ్ణి వెన్నువిరిచి చంపుతున్న శిల్పంతో పూర్తిగా పోలివుంది. ఈ గుడిమీద బాదామీ శిల్పశైలి ప్రభావం కొంత కనిపిస్తుంది. దేవునిగుట్టను ఒక మతానికి గ్రాబ్ చేసే ప్రచారం జరుగుతున్నది కాని, పరిశోధనకాదు. ఈ వ్యాసంలో గుడి బౌద్ధానికి కావచ్చుననడానికి ఆధారాలు చూపే ప్రయత్నం చేసాను. పరిశోధించి నిరూపించే సత్యమేదైనా అంగీకరించడానికి సిద్ధమే.

సిద్ధిపేట జిల్లా సింగరాయగుట్టమీద బౌద్ధబ్రహ్మ, పాతవరంగల్ జిల్లాలో ఇటీవల బయటపడ్డ అమితాభ్య, తారాదేవి ప్రతిమలు ఈ ప్రాంతంలో వజ్రయానం యొక్క ఉచ్ఛస్థితిని సూచించేవే. అయితే మొదటినుంచి రాజాశ్రయం అరకొరగా లభించిన బౌద్ధం కొట్టుమిట్టాడుతు జీవించింది. అంతేగాక కాలాముఖ, పాశుపతుల దాడులకు గురైంది. పాండవులగుట్ట గొంతెమ్మగుహాలో వున్న 'శ్రీ ఉత్పత్తి పిడుగు'శాసనం బౌద్ధ, జైనాలకు పరమ మాహేశ్వరులు చేసిన హెచ్చరిక. ఇన్ని పరిణామాల మధ్య దేవునిగుట్ట మీద ఈ చైత్యాలయం బతికిబట్టకట్టడం ఆశ్చర్యమే. చరిత్రచేసుకున్న భాగ్యమే.



**కట్టా శ్రీనివాస్ ప్రశ్నావళి – రచయిత సమాధానాలు :**

**1) ఈ గుడి ఎలా అరుదైనది? ఎటువంటి పరిశోధనలకు ఉపయోగపడుతుంది. దీనిని కావాడుకోవలసినంత ప్రత్యేకతలేమిటి?**

ఈ ఆలయం నిర్మాణపరంగా, మతపరంగా నవ్యమైనది. మా పరిశీలన ప్రకారం శిల్పపరంగా దేశంలోనే ఈ మహాయాన బౌద్ధాలయం అరుదైంది. జావాలోని బోరోబుదూరులో 9వ శతాబ్దంలో నిర్మించిన మహాయాన దేవాలయంతో, కాంబోడియాలోని ఆంగ్ కర్ వాట్ లో 13వ శతాబ్దంలో కట్టిన మహాయానదేవాలయం శిల్పాలతో పోలికలు కలిగివుంది దేవునిగుట్ట దేవాలయం. పరిశోధకులకు ఈ గుడి గొప్ప పరిశోధక వస్తువు.

మహాయాన బౌద్ధ దేవాలయాలు మనదేశంలో చాలా తక్కువ. ఈ గుడి ఇక్కడ నిర్మాణం కావడానికి మహాయానబౌద్ధం ఈప్రాంతంలో విస్తరించిన చరిత్రను అన్వేషించాలి.

**2) ఉనికి, నైసర్గిక విశేషాలు**

ఈ దేవాలయం జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు సమీపంలోని కొత్తూరు గ్రామానికి ఈశాన్యంలో వున్న అడవిలో



అమరావతి, అమితాబ - అంగాకోర్, అమితాబ

దేవునిగుట్టగా పిలువబడే చిన్నగుట్ట మీద వుంది.

**3) ఆవాస విశేషాలు :**

స్థానికంగా జరిగే గుడి ఉత్సవాలు, గుడి గురించి చెప్పుకునే మౌఖిక కథనాలు లేదా కైఫియత్తులు ఏమున్నాయి?

దేవాలయమున్న గుట్ట ఇసుకరాతి గుట్ట. గుట్టమీద నీటికుండాలున్నాయి. జలవనరుల ఉనికి ప్రత్యేక నీటిగుండం, సహజసిద్ధ సరస్సు. దట్టమైన అటవీప్రాంతంలో ఈ ఒంటరి దేవాలయముంది. ఈ గుడిలో మొదట శివలింగం వుండేదంటారు. లింగం వుంటే పానవట్టం వుండాలి. కాని, గుడిలో ఏ దేవత అధిష్ఠానపీఠం ఆనవాలైనా లేదు. గుడిముందర వున్న ఖాళీప్రదేశానికి చుట్టు చిన్నప్రహరీ వుంది. ఆ ప్రదేశం మధ్యలో 10 అడుగుల ఎత్తున్న బౌద్ధ స్తూపానికి చెందిన ఒక పాలరాతి ఆయకస్తంభం పాతి వుండేదిట. దాని కింద నిధులున్నాయనుకుని తవ్వేయడంతో అది మొదటికి విరిగిపోయింది. బహుశః ఆయకస్తంభాన్నే కొంతకాలం శివలింగంగా పూజించి వుంటారు. గుడిప్రహరీ బయట చతురస్రాకారపు చిన్న రాతిగద్దెవుంది. దానిమీద నంది వుండేదట. ప్రస్తుతం గుడిలోపల సిమెంటుతో కట్టిన గద్దెమీద లక్ష్మీనరసింహ స్వామి విగ్రహాన్ని పెట్టి గ్రామస్తులు పూజిస్తున్నారు.



హరివాహన లోకేశ్వర

ప్రతియేటా హోళీపండుగనాడు ఈ గుడివద్ద జాతర జరుపుతారని గ్రామస్తులు చెప్పారు. అంతేకాదు వర్షాలు సమయానికి కురవకపోతే ఊరివారంతా కలిసి దేవునికి వరదపాశం పోస్తారట. దానినే ప్రసాదంగా తీసుకుంటారట. అట్లాచేస్తే తప్పకుండ వాన కురుస్తుందని వారి నమ్మకం.

**4) ఆలయానికి వాడిన ముడి సామగ్రిలో ప్రధానం అనదగ్గ రాళ్ళు ఎక్కడివి? ఎలా చెప్పగలం?**

గుడి నిర్మాణానికి ఆ గుట్టబండలనుంచి తీసిన రాతిబిళ్ళలనే వాడినట్లు తెలుస్తున్నది. గుడిపక్కనే వున్న రాతిబండను తొలిచినట్లు ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి.

**5) గుడి బేస్ తాలుకు బ్లూ ప్రింట్ దేశీయ, విదేశీయ గుడుల బేస్ ప్లాన్‌లలో వేటితో సన్నా పోలికలు ఉన్నాయా? వుంటే ఏమిటి? ఏయే విశేషాలలో పోలికలున్నాయి?**

చతురస్రాకారంలో ఒకే ద్వారంతో వున్న ఏకైక గర్భాలయం మాత్రమే వున్న ఆలయమిది. గుడిగోపురం పిరమిడ్ వలె లోపలనుండి, 5అంతస్తులుగా బయటనుండి కనిపిస్తున్నది. గుడికి పునాదులున్నట్టు లేదు. కాని గుడికి వెలుపలికి ఒకగోడ, లోపలికి ఒకగోడ వున్నట్టు తెలుస్తున్నది. రెండుగోడల మధ్య అడుగుమందం ఖాళీ కనపడుతున్నది. రెండుగోడలను, ఖాళీతో కలిపి చూస్తే 4.5 అడుగుల మందం వుంది. దేవాలయపుగోడలను రెండుపొరలుగా కట్టడం కళ్యాణీచాళుక్యులు, కాకతీయులు కట్టిన గుళ్ళల్లో మనం చూడవచ్చు. గుడిలోపలి చతురస్రపు గది 4వైపుల 10.5 అడుగుల కొలతలతో, గుడి బయటిగోడలు 19.5 అడుగుల పొడవు వున్నాయి.

**6) ఆలయ నిర్మాణ శైలి ప్రధానంగా గుడి తిరిగి వున్న దిక్కు? గోపురం బ్లూ ప్రింట్ కొలతల వారీగా ఎలా వుంది? గోపుర నిర్మాణ పద్ధతి లో గమనించిన విశేషాలు ఏమిటి? వాటిలో పోలికలు బేధాలు ఏమిటి? అవి ఏ కాలానికి చెందిన నిర్మాణాలతో దగ్గరి పోలికలు కలిగివున్నాయి.**

గుడిద్వారం తూర్పువైపుకు వుంది. గుడి బయటి గోడల నిర్మాణంలో వాడిన శిల్పాల అమరిక శైలే గోపురంలోను పాటించ బడ్డది. ప్రతిపెద్దగోడ 2 చిన్నం 1పెద్దం 2చిన్న ఫ్రేములుగా విభజించి, వాటిమధ్య ఇసుకరాతిబిళ్ళలే స్తంభాలుగా నిలిపారు. గోపుర సోపానాలు 6+5+4+3+2 ఫ్రేములుగా పైవరకు అర్ధశిల్పాలతో పంచతలగోపురం అలంకరించబడివుంది.

రాతి ఇటుకల గోడలనే కాన్వాసుగా శిల్పాలు చెక్కారు. ఇసుకరాతిబిళ్ళలు కనుక వాటి అంచులు త్వరగా రాలిపోతుంటాయి. అందుకని వాటిపై చెక్కిన శిల్పాలను దంగుసున్నం పేస్టుతో అలంకరించారు. అవి అచ్చంగా బౌద్ధస్తూపాలకు వాడే సున్నపురాతి ఫలకాల మీది శిల్పాలను తలపించే విధంగా వున్నాయి.

ఈ శిల్పాలు ఎక్కువగా బౌద్ధ జాతకకథలు చెక్కివున్న నాగార్జునకొండ, అమరావతి, ధూళికట్ట స్తూపాలను గుర్తుకు తెస్తున్నాయి. సున్నం లేపనంపోయిన శిల్పాలు ఐహోలు, ఎలిఫెంటా, స్కంధగిరి, మహాబలిపురం శిల్పాలను పోలి కనిపిస్తున్నాయి. శిల్పాలశైలిని బట్టి 6,7 శతాబ్దాల నాటివని చెప్పవచ్చు.

**7) ఏయే దిక్కులలో ఏయే శిల్పాలను గమనించాము? శిల్ప నిర్మాణ రీతి లేదా ఐకనోగ్రఫీ ప్రకారం శిల్ప శైలి ఎలా వుంది? ఏయే ఆలయాలలో శిల్పాలను పోలి వున్నాయి?**

గుడి దక్షిణంవైపు బయటిగోడమీద ప్రధానమైన, పెద్దఫ్రేంలో రాచకొలువుకూటం దృశ్యం కనబడుతుంది. బౌద్ధ జాతకకథలలో నందుని కొలువును గుర్తుచేస్తున్నది.

గుడికి వెనకవైపు, పడమరగోడమీద ప్రధానమైన దృశ్యం పెద్దతల కలిగిన రాజువంటి శిల్పం ఎడమమోకాలిని మడిచి శత్రువు వీపులో



అంకర్ వాట్ దేవాలయం, అర్ధనారీశ్వర, ఆయక స్తంభం, బోరో బుద్ధ

నొక్కి, ఎడమచేత అతని ముఖాన్ని వెనక్కి విరిచి నొక్కుతున్నట్టుగా వుంది. కుడిచేయి పైకెత్తి వుంది. చుట్టు పరివార జనాలున్నారు. (ఇది పట్టడకల్ మహిషాసురమర్దని శిల్పంతో పోలికతో వుంది.)

శిల్పానికి కుడివైపు కిందిమూలలో గద్దంతో కనిపిస్తున్న విదేశీయునివంటి శిల్పం జావాలోని బోరొబుదూర్ మహాయాన బౌద్ధదేవాలయం గోడలపైవున్న శిల్పంతో పోలివుంది.

గుడికి ఉత్తరంవైపు గోడమీద అర్ధనారీశ్వర శిల్పం చెక్కివుంది. విలాసంగా నిలిచివున్న విగ్రహం కుడిచేయి గజముఖం కలిగివున్న బాలవినాయకుని తలమీద, ఎడమచేయి చిన్నపిల్లవాడి (స్కంధుడు) తలమీద పెట్టబడివుంది. ఈ శిల్పం తలకు కుడివైపున ఎద్దుతలొకటి కనిపిస్తున్నది.

**8) ఓవర్ లాప్ అయిన శిల్పాలు కన్పిస్తున్నాయా? అవునయితే ఏయే శిల్పాలు ఎందుకలా జరిగి వుంటాయి. ఏ కాలం శిల్పాలను, ఏవి ఓవర్ లాప్ చేసి వుండొచ్చు.**

కొన్ని శిల్పాలు అక్కడక్కడ అధ్యారోపనం చేయబడినట్లు కనిపిస్తున్నాయి. పూర్వపు శిల్పాలను చెక్కి సున్నంపూతతో తీర్చిదిద్దినట్లు అనిపిస్తాయి.



దేవునిగుట్ట దర్శించిన చరిత్రబృంద సభ్యులు

**9) ఈ గుడిలోని విశేషాలగురించి ప్రముఖ పరిశోధకులెవరైనా పరిశీలనలో వెలిబుచ్చిన అభిప్రాయాలు అందుబాటులో వున్నాయా? వాళ్ళు ఏమంటున్నారు దాన్ని మనం మన పేపర్‌లో అంగీకరి స్తున్నామా విభేదిస్తున్నామా అయితే ఎందుకు? ఇంకేవైనా పుస్తకాలలో ప్రస్తావించారా అవేమిటి? ఇతర దేవుని గుట్టల విశేషాలు..**

ఈ గుడిశిల్పాలను దినపత్రికలలో, సోషల్ మీడియాలో చూసిన కొందరు శైవాలయమయివుంటుందని తమ అభిప్రాయం వ్యక్తం చేసారు. కాని, వాళ్ళెవరు గుడిని ప్రత్యక్షంగా చూడలేదు. కనుక అభిప్రాయాలు భిన్నంగా వుండడంలో ఆశ్చర్యం లేదు. కాని, మనం మనఅభిప్రాయాన్ని నిలుపుకుంటూనే, వారి విమర్శలను సాదరంగా ఆహ్వానిస్తున్నాం. లోతుగా అధ్యయనం చేయవలసిందిగా పరిశోధకులకు విజ్ఞప్తిచేస్తున్నాం.

గుడిలోపల మూడువైపుల చెక్కివున్న శిల్పదృశ్యాలన్నీ బౌద్ధజాతక కథలలోని బోధిసత్త్వుని పోలిన శిల్పాలు, బుద్ధుని బోధనలను వింటున్న శిష్యగణాలను గుర్తుకుతెచ్చే శిల్పాలు చెక్కివున్నాయి.

దక్షిణం వైపున్న గోడమీద పైమూలన ఒక యుద్ధదృశ్యం కనిపిస్తున్నది. అందులో ఒకవీరుడు గ్రీకులవలె దుస్తులు ధరించి ఖడ్గంతో కనిపిస్తున్నాడు. గాంధార బౌద్ధశిల్పఫలకాలలో కొన్నిచోట్ల ఇదే వేషభూషలతో కనిష్కరాజు కనిపిస్తాడు. అదేగోడకు కిందివైపు త్రిశూలం ధరించివున్న పెద్దదైన అర్ధశిల్పం కనిపిస్తున్నది. మహాయాన బౌద్ధంలో హిందూదేవతలను పోలిన దేవతాశిల్పాలు కనిపిస్తాయి. ఇట్లాంటి శిల్పాలు నేపాల్, కాంబోడియా, జావా, ఇండోనేషియాలలోని మహాయాన బౌద్ధ దేవాలయాలలో కనిపిస్తాయి.

**10) కాపాడేందుకు ఎటువంటి పద్ధతులు పాటించవచ్చు?**

శాస్త్రీయంగా గుడిని అధ్యయనం చేసిన తర్వాత, ఆర్కియాలజీ వారు వారి పద్ధతులలో గుడిని రాతిఇటుకలవారీగా విడదీసి తిరిగి నిర్మాణం చేయాలి. గోపురాన్ని పునరుద్ధరణ చేయాలి. ఇసుక రాతి ఇటుకలు కనుక శిల్పాల అచ్చులను తీసుకుని, అవసరమైనచోట ఆ శిల్పాలను తిరిగి చెక్కించి గుడిని పునరుద్ధరణ చేయాలి.

**11) ముగింపు నిర్ధారణలు**

మనం చేసిన నిర్ధారణలను ఆర్కియాలజీవారు, దేవాలయాల నిపుణులు పునఃసమీక్షించాలని, కాలనిర్ణయం చేయాలని, పరిసర ప్రదేశాల్లో, పరిసరగ్రామాల్లో బౌద్ధం ఆనవాళ్ళను శోధించాలని కోరుకుందాం.

*(దేవునిగుట్ట దర్శించిన చరిత్రబృంద సభ్యులు: వేముగంటి మురళీకృష్ణ, కట్టా శ్రీనివాస్, అరవింద్ ఆర్య, తాళ్ళపల్లి సదానందం, వేముగంటి సమీర్ కుమార్, అహోబిలం కరుణాకర్, సామలేటి మహేశ్, చంటి మరియు కొత్తూరు గ్రామసర్పంచ్ రవీందర్‌రావు -అందరి తరపున).*

**- శ్రీరామోజు హరగోపాల్,**
m : 99494 98698
e: akshara25@gmail.com




# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

(Regd. 720/1982)

హైదరాబాద్




## బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

### తెలంగాణ బడి పిల్లల కథలు







పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు – ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం. పిల్లలలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాల సాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. **'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ'** తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో వెలువరించింది.







**10 పుస్తకాల సెట్ ధర రూ. 330 • తగ్గింపు ధర రూ. 300**

<u>ప్రతులకు</u>

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.
మరియు
'భూపతి సదన్' 3-6-716,
స్ట్రీట్ నెం. 12,
హిమాయత్‌నగర్,
హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

*email: edit.chelimi@gmail.com*
*website : www.balachelimi.com*













## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు



# భూగోళంకు సహజ కవచకుండలాలు!

**భూ**గోళం ఏర్పడిన తీరు, నేల (soil), నీరు ఆవిర్భవించిన విధానం గూర్చి గత కథనాలల్లో తెలుసుకున్నాం. ప్రకృతి సూత్రాల నేపథ్యంలో జీవం పుట్టుక గూర్చి కూడా రెండో కథనంలో చూసాం. సౌరకుటుంబంలోని అష్టగ్రహాలల్లో (ప్లూటోకు గ్రహస్థితి లేదని గుర్తించాం!) కేవలం భూమిపైన మాత్రమే జీవం పుట్టి కొనసాగుతున్న విధానం గూర్చికూడా తెలియాలి.

ఈ సందర్భంగా విత్తు ముందా? చెట్టు ముందా? అనే తర్కవాదన కూడా వింటూ వుంటాం. వీరికి వాస్తవం కన్నా, కాల్పనిక (fiction) గాథలే ప్రధానంగా తోస్తాయి. అందుకే ఒక్కోమతం ఒక్కో తీరు కథనాల్ని అల్లి సమాజాన్ని ఎదగకుండా, సంకుచితంగా వుండేలా చేస్తున్నాయి. ఈ మత కథనాలన్నీ మానవుని పుట్టుక గూర్చే తెలుపుతాయి. (బైబిల్ ఆదమ్, ఈవ్ కథలా) గాని, మిగతా జీవరాశుల పుట్టుక గూర్చిన వాస్తవాల జోలికి పోవు. భూమిపైన ఏనుగు, సముద్రంలో తిమింగలం, చెట్లపైన పక్షులు, నేలపైపొరల్లో, గాలిలో, నీటిలో విభిన్న రకాల సూక్ష్మజీవులు (మానవుడి పుట్టుక దైవాంశం అయితే, కరోనా పుట్టుక కూడా దైవాంశమేకదా!), ఈగలు, దోమలు, కుక్కలు, నక్కలు, మామిడి, జామ, చింత, నేరేడు, వరి, గోధుమ, జొన్న, తృణధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, ఫలాలు ఎలా పుట్టాయో, ఎందుకు పుట్టాయో ఏ మతం చెప్పదు. చెప్పలేవు. హిందూ పౌరాణిక గాథలైతే కొన్ని జంతువులు దేవుడి రూపాలని తెగ ప్రచారం చేస్తాయి. అలాగే వాటినే వెంటాడి, వేటాడి చంపేలా, మనిషినే మృగంగా మారుస్తాయి.

కాబట్టి, భూమిపై మానవుడితో పాటు, కోటానుకోట్ల జీవరాశులు (జంతువులు, వృక్షాలు, సూక్ష్మజీవులు) పుట్టి, మనుగడ సాగించడానికి, కనుమరుగు (extinction) కావడానికి గల పరిస్థితుల్ని చార్లెస్ డార్విన్ ఆధారాలతో చూపింది కూడా గత కథనాల్లో చూసాం. తిరిగి ఈ వివరాల్లోకి పోకుండా జీవరాశి పుట్టుకకు దారి తీసిన పరిస్థితుల్ని మాత్రం చూద్దాం!




భూమిని ఆవరించిన ఓజోన్‌పొర

## మొదటి సహజ కవచకుండలం – ఓజోను పొర ($O_3$)

దాదాపు ఒక బిలియన్ సం|| క్రితం మొదటి నీటి జీవి అయిన నీలి హరిత ఆల్గే (blue` green alge) సూర్యరశ్మి నుంచి శక్తిని పొంది నీటి అణువుల్ని, కార్బన్ డయాక్సైడ్ అణువుల్ని విడగొట్టి (split), తిరిగి వాటిని సేంద్రియ పదార్థంగా (పిండి), ఆక్సిజన్‌గా మార్చింది. దీన్నే ప్రాథమిక దశ కిరణజన్య సంయోగ క్రియగా గుర్తిస్తారు. ఈ ఆక్సిజన్‌లో కొంత భాగం తిరిగి కార్బన్ డయాక్సైడ్‌గా (దహించబడడంతో) మారగా, మిగతా ఆక్సిజన్ పై భాగంలోని వాతావరణంలో పోగుపడ సాగింది. ఇలా పోగుపడిన ఆక్సిజన్ నాటి ఆదిమ (primordial) జీవులకు విష తుల్యంగా మారడం, కార్బన్ డయాక్సైడ్ శాతం తగ్గడం ప్రారంభించింది. దీంతో కొన్ని ఆక్సిజన్ అణువులు ($O_2$), సూర్యకాంతిలోని **అతినీల లోహిత** (ultraviolet) కిరణాలను గ్రహించి ఏక ఆక్సిజన్ (O) పరమాణువుగా (atom) మారింది. తిరిగి ఈ పరమాణువు, ఆక్సిజన్ అణువు($O_2$)తో జతకట్టి మూడు పరమాణువుల ($O_3$) ఆక్సిజన్‌గా మారింది. ఈ విధంగా రూపాంతరం చెందిన ఆక్సిజన్ అణువుల సముదాయంవు కవచమే ఓజోన్. ఈ కవచమే సూర్యుని నుంచి వెలువడే అతినీల లోహిత కిరణాలను సమర్థవంతంగా గ్రహించేవి. ఈ విధంగా **అతినీలలోహిత** కిరణాలనుంచి వచ్చే వికిరణాన్ని (radiation) తగ్గించడంతో భూమిపై విభిన్న జీవరాశి మనుగడ




భూమి చుట్టూగల వివిధ ఆవరణలు

సాగించడానికి అవకాశం ఏర్పడింది.

ఇలా ఆక్సిజన్ ఉత్పత్తికి కారణమైన నీలి హరిత ఆల్గే మాత్రం కాల క్రమంలో నశించి, ఆక్సిజన్‌తోనే జీవించగలిగే జీవరాశికి ఆధ్యురాలైంది. పోతే కొంత నీలి హరిత ఆల్గె నీటి నుంచి బయటికి వచ్చి, భూమార్గాన్ని పట్టి భూచరాల ఆవిర్భావానికి కారణభూతం కావడం సృష్టి వింత కాదా!

అయితే ఈ కథనాల్ని నమ్మాలా..? అనే అబుద్ధి జీవులు కూడా అధికంగా విద్యాధికులే కావడం గమనార్హం. ఇలా జీవరాశి మనుగడకు కారణమై, రక్షణ కవచంగా ఏర్పడిన ఓజోన్‌పొర తగ్గడం రంధ్రాలు పడడం, దీంతో జీవరాశి మనుగడకు (మానవునితో సహా) ప్రమాదంగా మారడం తెలిసిందే! ఇదే జరిగితే భూగోళం తిరిగి ఒక బిలియన్ సం॥ క్రితంకు వెళ్ళిపోతుంది. ఈ ఘటనను కళ్ళు మూసుకొని ఓసారి కలగంటే ఈ వాస్తవం అర్థమవుతుంది.

**రెండో సహజ కవచకుండలం – హరిత గృహ ప్రభావం (Greenhouse Effect)**




హరితగృహ వాయువుల ప్రభావం

సముద్రతీర ప్రాంతాలనే కాదూ, మారుమూల రాజస్థాన్ థార్ ఎడారిలోని రైతును, ఎత్తైన హిమాలయ పర్వత ప్రాంతపు సేద్యం చేసే మహిళను , గోదావరి పరివాహక ఆదివాసి వారు, వీరు అనకుండా అందరినీ వాతావరణం పలకరిస్తుంది. పోతే ప్రాంతాన్ని బట్టి, ఎత్తును బట్టి కొంత వ్యత్యాసం వుంటుంది. (భారమితితో ఈ తేడాల్ని గుర్తించగలము).

ఇలా వాయువుల మిలితంతో భూమి చుట్టూ ఏర్పడిన ఓ చక్కని అమరికనే (envelop) వాతావరణమని అంటారు. ఈ అమరికనే భౌతిక చోదక శక్తిగా వివిధ వాతావరణ మార్పులకు కారణమగును. సూర్యుని నుంచి వెలువడే ఉష్ణం వికిరణం (radiation) చెంది భూ వాతావరణంలోకి ప్రవేశించును. ఇందులో కొంతభాగం మేఘాలను, దుమ్ము, ధూళి కణాల్ని తాకి వెనక్కి మళ్ళగా, మిగతా ఉష్ణం నేలను చేరును. ఇలా నేలను తాకిన ఉష్ణం, మరికొంత భాగం మంచును (ice / snow), నీటిని, నునుపైన తలాలను తాకడంతో వెనక్కి మళ్ళి తిరిగి రోదసి (space)లోకి వెళ్ళిపోవును. అనగా సూర్యుని నుంచి జనించే ఉష్ణంలోని అతి కొద్దిభాగం నేలను చేరుతుందన్న మాట!

ఈ ఉష్ణాన్ని కూడా నేల దాచుకోకుండా, దాన్ని పరారుణ (infrared) వికిరణముగా ఉద్గారం చెందించును. ఇలా నేల నుంచి వెనక్కి మళ్ళిన ఉష్ణం తిరిగి రోదసికి చేరకుండా వాతావరణంలోని కొన్ని వాయువులు నిర్బంధించును. ఇలా బంధించడానికి, పరారుణ కిరణాల పొడవైన తరంగ దైర్ఘ్యమే (wave length) ప్రధాన కారణం. ఈ విధంగా ఈ ఉష్ణం తిరిగి నేలను అంటిపెట్టుకోవడంతో, జీవం మనుగడ సాగించడానికి దోహద పడుతున్నది. ఈ ప్రక్రియ సౌరకుటుంబంలోని ఒక్క భూమికే పరిమితం కావడంలో విభిన్న జీవరాశులు అభివృద్ధి చెంది ఓ ప్రత్యేకతను సాధించుకున్నాయి. ఇలా జీవరాశి మనుగడకు దోహదం చేస్తున్న ఈ వాయువుల సముదాయన్నే హరితగృహ వాయువు అని, దీని చర్యను హరిత గృహ ప్రభావం (Green House Effect) అని అంటారు.

ఒక వేళ ఈ హరిత వాయువుల ప్రభావం లేకుంటే భూగోళం మంచు యుగం (ice age) నాటిలా నిరంతరం చలితో, మంచుతో వుండిపోయేది. దీన్ని కొంతలో కొంత ఎడారుల్లో చూడగలుగుతున్నాం. పొద్దంతా అత్యంత వేడిగా వుండే ఈ ఎడారులు, రాత్రుల్లో దీనికి భిన్నంగా ఎముకలు కొరికే చలిని సంతరించుకుంటాయి. అనగా, వాతావరణంలోని ఈ వాయువుల కలయిక (composition)నే భూమిపైన ఉష్ణశక్తిని సమతూకం (energy coming & going ) చేస్తాయి. ఇందులో హెచ్చుతగ్గులు జరిగితే జీవులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ విపత్తును కూడా ఇప్పుడు భూమాత ఎదుర్కుంటున్నది తెలిసిందే! (వీటిని గూర్చి తర్వాతి కథనాల్లో చూద్దాం!)

**ఇంతకి హరిత గృహ వాయువులు ఏవి? (Greenhouse Gases)**

హరిత గృహ వాయువులు ప్రధానంగా ఆరు. అవి :

1. నీటి ఆవిరి
2. కార్బన్ డయాక్సైడ్ ($CO_2$)
3. నైట్రస్ ఆక్సైడ్ ($N_2O$)
4. మీథేన్ ($CH_4$)
5. క్లోరోఫ్లోరో కార్బన్స్ ($CFC_{11}$ & $CFC_{12}$)
6. ట్రోపో స్ఫియరిక్ ఓజోన్ ($O_3$)

నిజానికి మన చుట్టూ వుండే పొడిగాలిలో నైట్రోజన్, ఆక్సిజనులు (4:1))లో వుంటాయి. స్వల్ప మోతాదుల్లో ఆర్గాన్ వుంటుంది. అనగా నైట్రోజన్ 78.09 శాతం, ఆక్సిజన్ 20.95 శాతం కాగా, ఆర్గాన్ (1%) మాత్రమే వుంటాయి. అతిస్వల్ప మోతాదుల్లో (trace) కార్బన్ డయాక్సైడ్ (0.1%), నీటి ఆవిరి, నియాన్, హైడ్రోజన్‌లు (parts per billion-Ppb) వుంటాయి. ఇందులో హరిత గృహ వాయువుల్ని నియంత్రించడంలో నీటి ఆవిరి కీలక పాత్రను పోషిస్తే, కార్బన్ డయాక్సైడ్ భూభాగాన్ని వేడెక్కించుటలో చురుకుగా పని చేస్తుంది. ఇప్పుడు ఇది కూడా తీవ్రస్థాయికి చేరింది చూస్తూనే వున్నాం. ఈ వాయువులు వుండాల్సిన మోతాదుల్లోనే వుండాలి. ఏ మాత్రం సమతుల్యత దెబ్బతిన్నా, నేల నుంచి వికిరణం

చెందిన ఉష్ణం రోదసిలోకి వెళ్ళకుండా అడ్డుకుంటాయి లేదా ఉష్ణమే లేకుండా వుంటుంది. దీంతో భూగోళం అతి వేడిమికి, చలికి గురైతుంది (ఈ వివరాల్ని కూడా తర్వాత చూద్దాం!).

### హరితగృహ వాయువుల మోతాదు పెరిగితే..?

హరితగృహ వాయువులు భూగోళానికి కల్గించే ప్రమాదాన్ని 19వ శతాబ్దంలో **జీన్ బాప్టిస్టు జోషఫ్ ఫురియర్** గుర్తించాడు. గాలిలో నత్రజని, ఆక్సిజన్‌లు 99 శాతం వుండి, కేవలం ఒక శాతం (1%) మాత్రమే ఈ హరితగృహ వాయువులుండాలి. ఇవి ఏమాత్రం పెరిగినా భూగోళం వేడెక్కును. ధృవ ప్రాంతాల మంచు చేరి భూమధ్య రేఖ ప్రాంతం లావెక్కుతుంది. ఇప్పటి వరకు వెలువడిన ఈ వాయువుల్ని నియంత్రించినా శతాబ్దాల తరబడి ఇవి వాతావరణ అసమతుల్యతకు కారణమైతాయి. ఇప్పటికే వాతావరణంలో చేరిన CFC లు ఓజోను పొరను శతాబ్దాల తరబడి క్షీణింప చేస్తుంది. ఇలా ఓవైపు రక్షణ కవచంలా, మరోవైపు దీని మందం పెరుగుతూ భక్షణ కవచంలా పరస్పర విరుద్ధ ఉపయోగాలున్న ఈ వాయువులు ఎలా జనిస్తాయో చూద్దాం!




### కార్బన్ డయాక్సైడ్ ($CO_2$)

గత మూడు దశాబ్దాలుగా (1990 నుంచి) పరావ్యరణవేత్తల్ని, శాస్త్రజ్ఞుల్ని కలవరపెడుతున్న హరితగృహ వాయువు కార్బన్‌డయాక్సైడ్. 1990 నాటికి ఇది వాతావరణంలో 0.034 శాతంగా (344 parts per million - ppm) వుంటే, ఇప్పుడిది 409.8ppm దాటిపోయింది. దీని ప్రభావంతో పారిశ్రామిక విప్లవం తర్వాత (1860) ప్రతీ సంవత్సరం 25 శాతం చొప్పున పెరగడంతో భూ ఉపరితల ఉష్ణోగ్రత $0.5^0$C చొప్పున పెరుగుతున్నది. బొగ్గును, కర్రను, ఇతర వస్తువులను మండించినప్పుడు, శిలజా ఇంధనాలు దహించబడగా, వివిధ గ్యాస్‌లను మండించినప్పుడు, వృక్షాలు, జంతువులు శ్వాసక్రియ జరిగినప్పుడు ఈ వాయువు వెలువడును. ఇలా ప్రతి సం॥ 6 బిలియన్ టన్నులు జనించగా, ఇందులో సగభాగం మొక్కలు, సముద్రాలు వినియోగించుకుంటాయి. 1958 నుంచి 310ppm ఉండగా, నేడు 410 ppm స్థాయికి, అనగా గ్రాఫికల్‌గా $45^0$ కోణంలో పెరుగుతూ వున్నది. మంచు యుగంలో (ice age) దీని పరిమాణం 200 ppm మాత్రమే! ఈ విషయాన్ని హిమనీనదము (glacial) లోని గాలి బుడగల ద్వారా గుర్తిస్తారు.

నిజానికి $15^0$C ఉష్ణోగ్రత నియంత్రణకై కేవలం 0.03 శాతం కార్బన్ డయాక్సైడ్ సరిపోతుంది. కాని దీని ఉత్పత్తి 0.4 శాతం దాటి పోయింది. ఇలా ప్రతి 0.1 శాతం పెరుగుదల ఒక డిగ్రీ సెలిసియస్ ఉష్ణోగ్రతను పెంచుతుంది.




### నైట్రస్ ఆక్సైడ్ ($NO_2$)

ప్రకృతిలో సహజసిద్ధంగా, సూక్ష్మ జీవుల ద్వారా, లెగ్యుమినస్ బ్యాక్టీరియా ద్వారా నేలలో, మొక్కల వేళ్ళలో ఇది స్థాపించబడి జనించును. కర్రను మండించినప్పుడు ఇది కొంత ఉత్పత్తి ఆగును. వ్యవసాయంలో వాడే రసాయనిక ఎరువులు, నేలలో మిలితం కాగా, నైట్రోజన్ ($N_2$) అణువు చురుకుగా మారి ఆక్సిజన్‌తో చర్యనొంది నైట్రస్ ఆక్సైడ్‌గా ($N_2O$) మారును.

ఇది ప్రతీ సంవత్సరం 0.25 శాతం చొప్పున (వాతావరణంలో) పెరుగుతూ వున్నది. 2030 నాటికి పారిశ్రామిక విప్లవంకు ముందున్న దానికన్నా ఇది 34 శాతం అధికమగును. ఒకవేళ దీని ఉత్పత్తిని నిలుపుచేసినా ఇప్పటికే వున్న ఈ వాయువు రాబోయే 200 సంవత్సరాల వరకు (2200 దాకా) వాతావరణంలో వుంటుంది. ఉష్ణాన్ని బంధించుటలో కార్బన్ డయాక్సైడ్ కన్నా ఇది 250 రేట్ల ప్రభావాన్ని కల్గి వుంటుంది.

### మిథేన్ ($CH_4$)

మూడో ప్రమాదకర హరితగృహ వాయువు మీథేన్. ఇది ప్రకృతిలో సహజసిద్ధంగా ఉత్పత్తి అగును. జంతువులు, మనుషుల విసర్జకాలలో, పంట పొలాలు కోసిన మొదల్లలో, నెమరువేయు (ruminant) జంతువులు, చెదలు (termite) లాంటి కీటకాల జీర్ణాశయాల్లో ఇది ఉత్పత్తి అగును. అనగా, శాఖాహార జంతుజాలంలో ఇది అత్యధికంగా ఉత్పత్తి జరుగును. పంట పొలాల్ని మండించినప్పుడు, సహజ వాయువుల సరఫరా సందర్భంగా ఇది వాతావరణంలో చేరును.

దీన్ని కూడా హిమనీనదాలలోని గాలిబుడగల ద్వారా దీని




పెరుగుదలను గుర్తిస్తారు. దాదాపు 1960 దాకా దీన్ని కొలిచే విధానాలు లేవు. 1980 నాటి నుంచి ప్రతీ సంవత్సరం ఇది 1.1 శాతం చొప్పున పెరుగుతున్నది. మంచు యుగంలో ఈ వాయువు 300 ppb (particles per billion)గా వుంటే, మంచు యుగం ముగిసిన తర్వాత 600 ppb కి చేరగా, ప్రస్తుతం 1800 ppbకి చేరినట్లుగా శాస్త్రజ్ఞులు గుర్తించారు.

ఉష్ణాన్ని బంధించుటలో కార్బన్‌డయాక్సైడ్ కన్నా ఇది 25 శాతం ప్రభావాన్ని చూపుతుంది.




### క్లోరోఫ్లోరో కార్బన్ ($CFC_{11}$ & $CFC_{12}$)

మానవ నిర్మిత ఎలక్ట్రానిక్ వస్తువులలో, పరుపుల్లో వాడే ఫోంలో ఈ CFCలు అత్యధికంగా వుంటాయి. సింథటిక్ వస్తువులు (బట్టలు, పూతపూసిన వంటసామాగ్రి, రంగులు, పేయింట్స్ మొ॥). రిఫ్రిజిరేటర్స్, ఎయిర్ కండిషనర్లు, కూలర్లు, ఇమ్యులేటర్లు దీని ప్రధాన ఉత్పత్తి కేంద్రాలు. ఈ CFCలు స్ట్రాటో (strato) ఆవరణలోకి చేరి క్లోరిన్ (Cl)ను విడదల చేసి ఓజోన్‌లోని ($CO_3$)ని విడగొట్టును. దీంతో ఓజోన్ పొర దెబ్బతినును. సంవత్సరానికి 5 శాతం చొ॥ ఇది పెరుగుతున్నది.

$CFC_{11}$ జీవిత కాలం 75 సం॥ కాగా, ఇది ఉష్ణాన్ని బంధించుటలో $CO_2$ కన్నా 20,000 రేట్లు ప్రభావాన్ని చూపుతుంది.

$CFC_{12}$ జీవిత కాలం 140 సం॥ కాగా, ఇది ఉష్ణాన్ని బంధించుటలో $CO_2$ కన్నా 17,500 రేట్ల ప్రభావాన్ని చూపుతుంది.




### ట్రాపోస్ఫియరిక్ ఓజోన్ ($O_3$)

ఓజోన్ పొర భూతలం నుంచి 80 కి.మీ. పైన గల స్ట్రాటో ఆవరణలో (strato sphere) ఆవరించి, సూర్యుడి అతినీలలోహిత కిరణాల నుంచి రక్షణ కల్గించును. దీనికి ముందుగల ట్రోపోస్ఫియరిక్ బూతల ఆవరణ (8–18 కి.మీ)లో, అనగా స్ట్రాటో ఆవరణ కింద తేమతో కూడుకున్న భాగాన్ని ట్రోటోస్ఫియరిక్ ఓజోన్ హరితగృహ వాయువుగా గుర్తిస్తారు. వాహకాల్లో, పరిశ్రమల్లో వాడే శిలజా ఇంధనాలు దహించడంతో, నైట్రోజన్ ఆక్సైడ్‌తో చర్య జరిగినపుడు కూడా ఇది జనించును. దీనికై వాతావరణంలోని తేమ దోహదపడును. ఇది పెరిగినా భూతలానికి ప్రమాదమే! దీన్ని ఉష్ణమండల (tropical) అడవులు వినియోగించడంతో ఇది తరుగుదలకు గురైతుంది. కాని, ఈ అడవులు తరిగి పోవడంతో ట్రోపోస్ఫియరిక్ ఓజోన్ (సాధారణ పరిమాణం 20–30ppb కాని కలుషిత వాయువులో ఇది 100ppb కి చేరుతున్నది) సాంద్రత పెరుగుతున్నది. దీనితో ఊపిరితిత్తుల, ఆస్తమా వ్యాధులకు ఇది హేతువు కాగా, గర్భస్థ శిశు మరణాలు అధికమైతున్నాయి.

మానవుడి ప్రమేయం లేకుండా, భూపరిణామ క్రమంలో సహజకవచ కుండలాల్ని తనచుట్టూ ఏర్పర్చుకుని, జీవం పుట్టుకకు, మానవుడి మనుగడకు, దోహదపడిన భూగోళాన్ని స్వార్థ బుద్ధితో, దోపిడికి రాజకీయ దాహంతో, కబలించడంతో తిరిగి మానవ మనుగడకే ప్రమాదం పొంచి వున్నది. దీన్ని ప్రపంచ రాజకీయాలు నియంత్రిస్తాయో లేదో తెలియదుగాని, కనీసం వీటిని అవగాహన చేసుకున్నా సంతోషమే! ఈ దిశగా ఇప్పుడన్నా ఆలోచిద్దాం!

*(వచ్చే సంచికలో భౌగోళిక పరిశోధన వాస్తవాల్ని ఎలా తెలుసుకుంటారో చూద్దాం!)*

**– డా॥ లచ్చయ్య గాండ్ల,**
m : 9440116162
e : drglachaiah@gmail.com

# తానొకటి తలిస్తే...

ప్రఖ్యాత లాయర్ కిషన్ లాల్ ఇంటి మొదటి అంతస్తు నుండి మెట్లు దిగి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నటువంటి తన చేంబర్ పుష్ డోర్ నెట్టుకుంటూ వెళ్లి ఎగ్జిక్యూటివ్ కుర్చీలో కూర్చుని రిమోటుతో ఏసీ వేశాడు. కొద్ది నిమిషాల్లో ఆయేషా పర్వీన్ తన ఆరుగురు పిల్లలతో చేంబర్‌లోకి వెళ్లి నమస్కారం చేసి "సర్, నా పేరు ఆయేషా పర్వీన్, నేనే మీకు కాల్ చేసి మీ అప్పాయింట్ మెంట్ తీసుకున్నాను" అంది. ప్రతి నమస్కారం చేస్తూ "కూర్చో అమ్మా" అంటూ కిషన్ లాల్ తన సీటులో కూర్చుంటూ కాలింగ్ బెల్లు నొక్కాడు. జూనియర్ లాయర్ గిరిధర్ పుష్ డోర్ త్రోసుకుంటూ లోనకు వచ్చాడు. "గిరిధర్, నేను ముఖ్యమైన కేసు వివరాలు తీసుకుంటున్నాను, ఎవరినీ లోనకు రానివ్వకండి" అన్నాడు. "అలాగే సర్" అంటూ గిరిధర్ బయటకు వెళ్లాడు.

ఆయేషా వైపు తిరిగి "చెప్పమ్మా నీ కేసు వివరాలు" అన్నాడు కిషన్ లాల్.

"కోర్టు నుండి నాకు వచ్చిన కేసు కాగితాలు చూడండి సార్" అంటూ తన చేతిలోని కాగితాల కట్టను కిషన్ లాల్‌కు అందించింది ఆయేషా.



పేపర్లు అందుకున్న కిషన్ లాల్ కళ్ళజోడు పెట్టుకొని వాటిని ఒక పది నిమిషాల్లో చదవటం ముగించి "జరిగిన విషయాలు వివరంగా చెప్పు" అన్నాడు ఆయేషాతో.

"సార్, కోర్టులో కేసు వేసిన వాది జలీల్‌తో నా వివాహం జరిగి పద్నాలుగు సంవత్సరాలైంది. పెళ్ళైన ఆరు నెలల నుండి నాకు శారీరక, మానసిక వేధింపులు మొదలయ్యాయి. ఉద్యోగం చేస్తూ నెలకు లక్ష రూపాయల పై చిలుకు సంపాదిస్తున్నాడు. అయినా మా తల్లి గారింటి నుండి డబ్బులు తెమ్మని చిత్ర హింసలు పెడుతున్నాడు. ఇంటి ఖర్చులకు ఒక్క పైసా ఇవ్వడు. తను ఏ సామాను కొనుక్కు రాడు. నాకు పెళ్ళిలో మా ముస్లిం సంప్రదాయం ప్రకారం మా నాన్న అన్ని వస్తువులు ఇవ్వటమే కాకుండా కట్నం కింద కూడా నా భర్తకు డబ్బులు ముట్ట జెప్పాడు. నా భర్తకు పెళ్లి కాక ముందు నుండే త్రాగుడు అలవాటుంది. అప్పటికి మాకు ఆ విషయం తెలియదు. మా మామ మా నాన్న మధ్య ఉన్న పరిచయంతో నమ్మి పెళ్లి చేస్తే నన్ను సర్వనాశనం చేశాడు. ఎప్పటికీ త్రాగి వచ్చి నన్ను తిట్టడం, కొట్టడం, మా అమ్మ గారింట్లో దిగ పెట్టటం, నాలుగైదు రోజుల తర్వాత మా అమ్మ గారింటికి రావటం, అదనపు కట్నం ఇవ్వాలని మా అమ్మ నాన్న మీద జులుం చేయటం, తిరిగి నన్ను తీసుక పోవటం జరుగుతుంది. అదనపు కట్నం ఇవ్వక పోతే నన్ను, నా పిల్లల్ని వదలి వేస్తానని ఎన్నో సార్లు బెదిరించాడు సార్. నా భర్త వేధింపులు, నా బాధ చూడ లేక మా నాన్న రెండు సంవత్సరాల క్రితం చనిపోయాడు. ఆ దిగులుతో మా అమ్మ కూడా మంచం పట్టింది" అంటూ ఆగింది ఆయేషా.

"మరి నీవు, నీ పిల్లలు ఎలా బ్రతుకుతున్నారమ్మా" అడిగాడు కిషన్ లాల్.

"నాకు ముగ్గురు మగ పిల్లలు, ముగ్గురు ఆడ పిల్లలు. చిన్నా చితకా పనులు చేస్తూ పిల్లల్ని పోషిస్తున్నాను. మా పెద్దోడు హోటల్లో పని చేసి పాలకు నీళ్ళు తోడు అన్నట్టు సంపాదిస్తున్నాడు. గత రెండు నెలల క్రితం నా భర్త మమ్మల్ని నా తల్లి గారింట్లో దిగబెట్టాడు, మళ్లీ రాలేదు. ఈ కాగితాలు కోర్టు నుండి మూడు రోజుల క్రితం వచ్చాయి. వాటిలో ఏమి రాశారు సార్" అడిగింది ఆయేషా.

"నీకు నీ భర్తతో కాపురం చేయటం ఇష్టం లేదని తెలిపి నావని, అందువల్లనే నీవు ఎప్పటికి నీ తల్లి గారింట్లో ఉంటున్నావని, సలీం అనే అతనితో వివాహేతర సంబంధం పెట్టుకున్నావని, నీవు జన్మనిచ్చిన ఆరుగురు సంతానానికి నీ భర్త కారకుడు కాదని, కాబట్టి వారిని తన సంతానం కాదని ప్రకటించాలని కోర్టును కోరుతూ కేసు వేశాడమ్మా" అంటూ ఆగాడు కిషన్ లాల్.

"ఇది అన్యాయం సార్. సలీం నా పెద్దమ్మ కొడుకు. నాకు, అతనికి అక్రమ సంబంధం కట్టటమేమిటి. ఆరుగురు పిల్లలకు తను తండ్రి కాదని ఎలా అంటాడు. మమ్మల్ని పోషించటం ఇష్టం లేక లేని పోని అభాండాలు వేస్తున్నాడు. నా ఆరుగురు పిల్లలను పోషించటం చాలా ఇబ్బంది అవుతుంది. అయినా గౌరవంగా బ్రతుకుతున్నాము. లక్ష రూపాయల జీతం ఏమి చేస్తాడో అంతు బట్టడం లేదు. మా పోషణకు అయ్యే ఖర్చు జలీల్ భరించే విధంగా కోర్టు నుండి తీర్పు కోరవచ్చా సార్."

"తప్పకుండా కోరవచ్చు. అతడు వేసిన కేసుకు నీవు ఇచ్చే జవాబులో అతడి నుండి మనోవర్తి, పోషణ ఖర్చులు ఇప్పించే విధంగా మనం కోరుదాము. అయితే తుది తీర్పుకు కొంత సమయం పడుతుంది. ఈ వకాల్తా మీద సంతకం పెట్టు" అంటూ ఒక ప్రింటెడ్ ఫారం మీద క్రాస్ మార్కు పెట్టి ఆయేషా ముందు పెట్టాడు. ఆయేషా అలాగే అంటూ సంతకం పెట్టింది.

"ఒక వారం రోజుల తర్వాత నన్ను కలువు. అప్పటి లోగా నేను జవాబు తయారు చేసి పెడతా. నీవు దానిపై సంతకం పెట్టిన తర్వాత కోర్టులో దాఖలు చెయ్యాల్సి ఉంటుంది. ఇక నీవు వెళ్లు" అంటూ కిషన్ లాల్ లేచాడు.

ఆయేషా తన సంతానంతో బయటికి నడిచింది.

కిషన్ లాల్ వారంలోపే జవాబు తయారు చేశాడు. జలీల్

వేసిన పిటిషన్ చెల్లుబాటు కాదని, భర్తగా, తండ్రిగా బాధ్యతల నుండి తప్పించుకోవటానికి మోసపూరిత పిటిషన్ వేశాడని, ఆయేషా, ఆమె ఆరుగురు పిల్లలకు నెలకు ఒక్కొక్కరికి పదివేల రూపాయల మనోవర్తి క్రింద ఇచ్చేట్టుగా ఆదేశాలు జారీ చేయవలసిందని జవాబులో కోరడం జరిగింది. ఆయేషా పర్వీన్ జవాబు పత్రంపై సంతకం చేసిన తదనంతరం దాన్ని జూనియర్ లాయర్ గిరిధర్ కోర్టులో దాఖలు చేశాడు.

చూస్తుండగానే రెండు సంవత్సరాల కాలం గడిచింది. జలీల్ వేసిన కేసు విచారణకు వచ్చింది. జలీల్ తన న్యాయవాది ద్వారా మరో పిటిషన్ వేస్తూ తనను, ఆయేషా జన్మనిచ్చిన ఆరుగురు పిల్లలను డిఎన్ఎ పరీక్షకు పంపాల్సిందిగా మధ్యంతర ఉత్తర్వుల జారీకై కోర్టును ప్రాధేయ పడ్డాడు. లాయర్ కిషన్ లాల్ ఆ పిటిషన్ను తీవ్రంగా వ్యతిరేకించాడు. భారత సాక్ష్యాల చట్టం ప్రకారం భార్యా భర్త లిరువురి చట్ట బద్ధమైన వివాహం కొనసాగినప్పుడు భార్యకు కలిగిన సంతానం సక్రమ సంతానమే. అలా కాకుండా 280 రోజులు విడివిడిగా ఉండి కలుసుకోలేదని నిరూపణ అయి ఉండి ఆ మధ్య కాలంలో భార్య గర్భవతి కావటం లేదా ప్రసవించినట్లైతేనే పుట్టిన సంతానం భర్త ద్వారా కాలేదనుటకు ఆస్కారముందని, అప్పుడే డిఎన్ఎ పరీక్ష కు ఉత్తర్వులు జారీ చేయవచ్చని వాదించాడు. కిషన్ లాల్ వాదనతో ఏకీభవిస్తూ కోర్టు ఆ పిటిషన్ను కొట్టి వేసింది.



దానితో జలీల్‌కు తప్పని సరిగా సాక్ష్యాలు ప్రవేశ పెట్టే పరిస్థితి వచ్చింది. అతని తరపున తను కాకుండా వేరెవరిని మౌఖిక సాక్ష్యులుగా ప్రవేశ పెట్టలేదు. ఆయేషా తరపున తను, తన పెద్ద కొడుకును మౌఖిక సాక్ష్యులుగా విచారించారు. ఇరువురు న్యాయ వాదులు తమ వాదనలను కోర్టుకు వినిపించారు. కిషన్ లాల్ తన వాదనకు మద్దతుగా అత్యున్నత న్యాయస్థానం తీర్పులను కూడా ప్రవేశ పెట్టాడు.

వాదోపవాదాలు విన్న కుటుంబ న్యాయస్థానం తుది తీర్పును ఆయేషా పర్వీన్‌కు అనుకూలంగా జలీల్‌కు వ్యతిరేకంగా ప్రకటించింది. జలీల్ వేసినటువంటి కేసులో పరిశీలించ దగ్గ అంశాలు లేవని, మొదటి సంతానం కలిగిన పన్నెండు సంవత్సరాల పిదప, అదే విధంగా ఆరవ సంతానం కలిగిన మూడు సంవత్సరాల పిదప ఆయేషాపై అభాండాలు మోపుతూ అర్థం లేని పిటిషన్ వేసి ఆరుగురి పిల్లల్ని అక్రమ సంతానంగా ప్రకటించాలని కోరటం సహేతుకం కాదు. ఎందుకంటే వారి చట్ట బద్ధమైన వివాహం కొనసాగుతుంది. భారత సాక్ష్యాల చట్టంలోని సెక్షను 112 ప్రకారం అతడు 280 రోజుల పాటు ఆయేషాతో ఎటువంటి సంబంధం లేకుండా విడిగా ఉన్నట్టు, ఆ సమయంలోనే ఆయేషా గర్భవతి కావటం లేదా ఆరుగురిలో ఏ ఒక్కరికైనా జన్మనిచ్చినట్టు జలీల్ రుజువు చేయలేక పోయాడు. వివాహేతర సంబంధం ఆరోపణ కేవలం నిరాధారమైన లేదా ఊహా జనితమైనది మాత్రమే. అదే విధంగా జలీల్ నెలసరి వేతనం లక్ష రూపాయలని రుజువైంది. అయినా భార్యకు, పిల్లలకు ప్రేమ పంచటం మాట అటుంచి ఆర్థిక మద్దతు ఇవ్వకుండా క్షమించరాని నిర్లక్ష్యం చేశాడు. కాబట్టి భార్యకు మనోవర్తి క్రింద, ముగ్గురు మగ పిల్లలకు వారు మేజర్లు అయ్యేంత వరకు, ముగ్గురు కుమార్తెలకు వివాహం అయ్యేంత వరకు ఒక్కొక్కరికి నెలకు పదివేల రూపాయలు పోషణ నిమిత్తం, మొత్తంగా డెబ్భై వేల రూపాయలు ప్రతి నెల పదవ తేదీ లోగా ఆయేషా బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయాలి. అరుగురి వివాహం కూడా జలీల్ బాధ్యతే అంటూ జలీల్ వేసిన పిటిషన్ కొట్టివేసి, ఆయేషాకు అనుకూలంగా తీర్పు ఇవ్వటం జరిగింది.

జల్సాలకు అలవాటు పడ్డ జలీల్ ఏదో విధంగా భార్యా పిల్లలను వదిలించు కోవాలనే దురుద్దేశ్యంతో వేసిన కేసులో నెలకు డెబ్భై వేల రూపాయలు చెల్లించాలనే ఆదేశం అతడు ఊహించలేదు. తానొకటి తలిస్తే కోర్టు మరోలా ఇచ్చిన తీర్పుతో అతడి మైండ్ దిమ్మ తిరిగింది.

– తడకమళ్ళ మురళీధర్,
m : 9848545970
e : muralidhartadakamalla@gmail.com

DECCAN
దక్కన్
సామాజిక, సాంస్కృతిక ఛానల్
CHANNEL





# లాభసాటి పాడి పరిశ్రమ నిర్వహణ

*(గత సంచిక తరువాయి)*

**గేదెజాతి పశుజాతులు :**

**ముర్రా :**

దేశంలోని గేదెజాతుల్లో "ముర్రా" అత్యంత శ్రేష్ఠమైన జాతి. పాడికి, ఎక్కువ వెన్న శాతానికి పేరెన్నికగాంచినది. దేశవాళి గేదెజాతులనుండి అధిక పాల దిగుబడి పొందడానికి, వాటిని అప్‌గ్రేడ్ చేయడానికి ముర్రాజాతి వీర్యాన్ని దేశమంతటా విరివిరిగా వినియోగిస్తున్నారు.

హర్యానా దక్షిణప్రాంతంలోని రోమతక్, కర్నాల్, హిస్సార్, జింద్ గార్గాన్ జిల్లాల్లో, పంజాబ్, ఢిల్లీ ప్రాంతాలు ముర్రాజాతి పుట్టినిల్లు.

ముర్రాజాతి గేదెలు భారీగా ఉంటాయి. తల, మెడ తేలికగా, చిన్నగా ఉంటుంది.

కొమ్ములు పొట్టిగా, గట్టిగా లోపలి వైపు తిరిగి స్ప్రైరెల్‌గా ఉంటాయి. ముర్రా అంటే అర్థం. 'మెలివేయబడిన' అని అర్థం. ముర్రాజాతి గేదెలకు కొమ్ములు ఈ విధంగా ఉండడం జాతి ప్రత్యేకలక్షణం. తుంటి నడుము వెడల్పుగా ఉంటుంది.

తోక పొడువుగా ఉండి, కుచ్చులు తెలుపుగా ఉంటాయి.

శరీరం రంగు అత్యంత నలుపుగా ఉంటుంది.

ముర్రాజాతి దున్నలు సుమారు 570 కిలోల శరీర బరువు కలిగి ఉంటాయి.

గేదెల్లో పొదుగు బాగా అభివృద్ధి చెంది విశాలంగా, పెద్ద చన్నులతో ఉంటుంది. ముర్రా పాడి గేదెలు సుమారు 450 కిలోల శరీర బరువుంటాయి. గేదెలల్లో ఒక పాడి కాలంలో 1400-2300 కిలోల పాలదిగుబడి ఉంటుంది. వెన్నశాతం 7 ఉంటుంది.

హర్యానా, ఫరీదాబాద్ జిల్లాలోని నిమ్మా గ్రామానికి చెందిన భరంపాల్ అనే రైతు పాడి ముర్రాగేదె 1 రోజు 31.32 లీటర్ల పాలిచ్చి రాష్ట్రంలో కొత్త రికార్డు నెలకొల్పింది.

**జాఫ్రాబాది :**

ఈ జాతి గేదెలు పెద్దగా వుంటాయి. ఇవి కథియావార్‌లోని గీర్ అడవిలో మరియు గుజరాత్ రాష్ట్రంలోని సౌరాష్ట్ర ప్రాంతం జాఫ్రాబాద్ ప్రక్కప్రాంతాల్లో కనబడతాయి. గీర్ ప్రాంతంలో ఈ జాతి పశువులను కేవలం నెయ్యి ఉత్పత్తి కొరకు ఎక్కువగా పోషిస్తుంటారు. ఈ పశువులకు అధిక మొత్తంలో పశుగ్రాసాలు అవసరం. పాల దిగుబడి, వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది.

తలముందు భాగం చాలా పెద్దగా వుంటుంది. కొమ్ములు మెడకు రెండు వైపుల వ్రేలాడుతూ వుంటాయి.

కొమ్ములు ముర్రా గేదెలలాగా అంతగా వడితిరిగి వుండవు.

సాధారణంగా నలుపు రంగులో వుంటాయి.

ఈ జాతి సగటు గేదె బరువు 600 కిలోలు, దున్న బరువు 800-900 కిలోలు ఉంటుంది.

కళ్ళు తల ముందుభాగానికి క్రింద, అతుక్కుని వున్నట్లు కనబడతాయి.

తోకపొడువుగా నేలకు అనుకునేట్లు వుంటుంది.

పాడి కాలంలో పాలదిగుబడి 2000 నుండి 2200 లీటర్లు ఉంటుంది.

**మెహసానా :**

ఈ జాతి గేదెలు గుజరాత్ రాష్ట్రంలోని మెహసానా జిల్లాలో, మహారాష్ట్ర చుట్టుపక్కల ఉంటాయి. ఈ జాతి సుర్తి మరియు ముర్రా గేదెలకు మధ్యస్థంగా ఉంటుంది.

కొమ్ములు వడివడి ఉంటాయి. రంగు నలుపు ఫాన్‌గ్రే రంగులో వుంటుంది. ముఖం, కాళ్ళు, తోక చివర తెల్ల గుర్తులుంటాయి.

ఇవి త్వరగా యుక్తవయస్సుకు వస్తాయి. పునరుత్పత్తి సక్రమంగా వుంటుంది.





పాల ఉత్పత్తి నిలకడగా వుంటుంది. సైజు మధ్యస్థంగా వుంటుంది. మేపు ఖర్చు తక్కువ.

సగటు మోహసానా జాతి గేదె బరువు 400-500 కిలోలు, దున్నపోతు బరువు 600 కిలోలుంటుంది. పాల దిగుబడి 300 రోజుల పాడి కాలంలో 1800లీటర్ల నుండి 2360, వెన్న 7% ఉంటుంది.

**సుర్తి :**

గుజరాత్ రాష్ట్రంలోని చరోత్తర్ ప్రాంతంలో కనబడు తుంది. స్వచ్ఛమైన సుర్తి జాతులు ఆనంద్, కైనా, బోర్సాద్, నదియాడ్‌లో కనబడ్తాయి. ఈ జాతి పశువులు చౌకగా పాలనుత్పత్తి చేస్తాయి.

ఈ జాతి పశువులు మధ్యస్థ సైజులో ఉంటాయి. కళ్ళు ఉబ్బెత్తుగా వుంటాయి.

కొమ్ముల పొడవు మధ్యస్థంగా వుండి, కొడవలి ఆకారంలో వుంటాయి.

శరీర రంగు బ్రౌన్‌గా వుంటుంది. నడుము తిన్నగా వుంటుంది. రెండు తెలుపు కాలర్‌లు, ఒకటి దవడ చుట్టూ, మరొకటి బ్రిస్కెట్ చుట్టూ ఉంటాయి.

పొదుగు పింక్ రంగులో వుంటుంది. చన్నులు మధ్యస్థ సైజులో ఉంటాయి. చర్మం మందంగా, నున్నితంగా వుంటుంది. 300 రోజుల పాడికాలంలో 1655 కిలోల సగటు పాలదిగుబడి వుంటుంది. 7.5% వెన్న వుంటుంది. రికార్డయిన ఒకరోజు అత్యధిక పాల దిగుబడి 15 లీటర్లు.

**పాడికి ప్రసిద్ధి చెందిన విదేశీ జాతులు :**

మన దేశంలో దేశవాళి ఆవుల్లో పాల ఉత్పాదకశక్తిని అభివృద్ధి చేయడానికి విదేశీ జాతుల పశువీర్యాన్ని ఉపయోగించి సంకర జాతి పశువులను అభివృద్ధి చేసే కార్యక్రమాలు ఉధృతంగా నడుస్తున్నాయి. మనదేశంలో సంకరజాతి పశువుల అభివృద్ధికి ఉపయోగించే మేలురకం విదేశీ జాతులు కొన్నింటికి గురించి తెలుసు కుందాం.

**జెర్సీ :**

భారతదేశంలోని వాతా వరణ పరిస్థితులు జర్సీ పశువుల పోషణకు అనుకూలంగా ఉంటాయి. అందుకే ఈ జాతి దేశవాళీ పశుసంతతిని సంకర పరచడానికి విరివిగా వాడు తున్నారు. తక్కువ మేపు ఖర్చుతో, అధిక పాలివ్వగల శక్తి జర్సీ ఆవులకు ఉంటుంది.

జర్సీ గోజాతికి పుట్టినిల్లు ఫ్రాన్సు, ఇంగ్లాండ్ మధ్యలోని జర్సీ ద్వీపం.



హెూలిస్టిన్ ఫ్రీజియన్ జాతి ఆవు

జెర్సీ పాలిచ్చే విదేశీ జాతుల్లో అతిచిన్న పరిమాణం గల జాతి.

శరీరం పొందికగా మూలలు సరిసమానంగా ఉంటాయి.

రంగు లేత ఎరుపు నుండి నుదురు గోధుమరంగు ఉంటుంది.

జర్సీ పెయ్యలు త్వరగా ఎదిగి, తొందరగా పొర్లుతాయి. 24 మాసాల వయస్సులోనే మొదటిసారి ఈనుతాయి.

జర్సీ ఆవులు 450 కిలోల శరీర బరువుంటాయి.

పొదుగు ఆకారం చక్కగా ఉండి సరిగ్గా అమర్చబడి ఉంటుంది. పాడికాలంలో సుమారు 3000-4000 లీటర్ల పాలదిగుబడి ఉంటుంది. వెన్నశాతం 3.5 ఉంటుంది. జర్సీ ఆవులు తక్కువ పాలిచ్చినా, వెన్నశాతం ఎక్కువగానే ఉంటుంది. పాలు పసుపు పచ్చ రంగులో ఉంటాయి.


ఒంగోలు జాతి ఆవు


కాంక్రేజ్ జాతి ఆవు


హర్యానా జాతి ఆవు


గిర్ జాతి ఆవు


తార్పర్కర్ జాతి ఆవు


రెడ్‌సింధి జాతి ఆవు


షాహీవాల్ జాతి ఆవు


పొడ తూర్పు జాతి ఆవు (తెలంగాణ)

## దేశావాళి పాడి ఆవులు – ఉత్పత్తి ప్రమాణాలు

| క్ర.సం. | పశుజాతి | మొదటిసారి ఈనే వయస్సు | వట్టిపోయే కాలం (రోజులు) | పాడికాలం | ఈతల మధ్య వ్యవధి | పాలదిగుబడి | పాలల్లో వెన్న శాతం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఒంగోలు | 1200-1350 | 321-380 | 300 | 490-515 | 613-1120 | 5.1 |
| 2. | కాంక్రేజ్ | 1400-1448 | 130-150 | 300 | 475-506 | 960-1856 | 4.3 |
| 3. | హర్యానా | 1731-1779 | 158-179 | 230-251 | 444-632 | 721-1436 | 4.4 |
| 4. | గిర్ | 4101-1434 | 207-230 | 252-301 | 511-630 | 1312-1804 | 4.7 |
| 5. | తార్పర్కర్ | 1444-1494 | 138-150 | 274-286 | 430-456 | 1456-2177 | 4.6 |
| 6. | రెడ్‌సింధి | 1220-1260 | 145-152 | 260-305 | 425-540 | 1514-1634 | 4.9 |
| 7. | షాహీవాల్ | 1210-1250 | 148-160 | 282-306 | 439-580 | 1548-2283 | 4.6 |
| 8. | పొడతూర్పు (తెలంగాణ) | 1390-1460 | 129-139 | 279-293 | 421-467 | 610-1050 | 4.1 |

### హోలిస్టిన్ -ఫ్రీజియన్ (హెచ్.ఎఫ్) :

ప్రపంచంలో అత్యధికంగా పాలిచ్చే విదేశీ జాతి హోలిస్టిన్ ఫ్రిజియన్. ఆ జాతి ఉష్ణదేశాల్లో ఎక్కువగా విస్తరించి ఉంది. నెదర్లాండ్ ఉత్తర ప్రాంతాల్లో ఈ జాతి వృద్ధి చెందినది.

హెచ్.ఎఫ్. అంత నాజూకుగా ఉండదు. శరీరంపై తెలుపు మరియు నలుపు రెండు పెద్ద మచ్చలుంటాయి.

శరీరం లావుగా, భారీగా, పొడవుగా ఉంటుంది.

తోక తెలుపురంగులో ఉంటుంది.

పొదుగు పెద్దగా ఉంటుంది. హెచ్.ఎఫ్. పశువులు సుమారు 700 కిలోల బరువుంటాయి.

పాల దిగుబడి, పాడికాలంలో 6-7 వేల లీటర్లు ఇస్తాయి. ఇతర విదేశీ జాతుల్లో కంటె హెచ్.ఎఫ్. ఆవుల పాలల్లో వెన్నశాతం తక్కువగా (3.5%) ఉంటుంది.

### దేశీయ పశుజాతులు – పరిరక్షణ

దేశానికి చెందిన అనేక దేశీయ జాతులు మనకు తరతరాల నుండి సంక్రమించిన జన్యుసంపద. ఈ సంపద పశుగణాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుంది. కాబట్టి దేశీయ పశుసంపద కనుమరుగైపోకుండా, పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు ఈ సంపదను అందించాల్సిన కర్తవ్యం మనందరిపై ఉంది.

– ఆనబోయిన స్వామి,
m : 9963 87 2222
e: swamyannnaboina@gmail.com



# ఇద్దరు పిల్లలు

"ఏడవకురా చచ్చినాడా! ఊరికే ఏడిస్తే వస్తదా? అన్నయ్య పోయి తేవాలి గదా!" అని తల్లి కేకలు వేసింది పసివాణ్ణి.

ఆ 'వస్తువు' ఏడిస్తే వస్తుందో రాదో ఆ పసివాడికి తెలీదు. ఆ పసివాణ్ణి ఎలా సముదాయించాలో ఆ తల్లికి తెలీదు. వాడి ఏడుపుతో విసుగొచ్చి వీపు మీద రెండు దెబ్బలు వేసి ఇంట్లోకి తీసుకుపోయింది.

సరిగ్గా అదే సమయంలో, ఆ తల్లి పెద్దకొడుకు, ఏడేళ్ళవాడు గోపాలం – వాళ్ల ఇంటికి కొంచెం దూరంలో అమ్మవారి గుడి దగ్గర వేపచెట్టు కింద నించుని బతిమాలుతున్నట్టు అంటున్నాడు.

గోపాలానికి ఎదురుగా నించున్న కుర్రాడు – సుబ్బడు కూడా అదే వయస్సువాడు. వాడి చేతిలో 'కీ' ఇచ్చి నడిపించే 'బొమ్మకారు' ఉంది... గోపాలం మాటలు వినగానే సుబ్బడు 'ఇవ్వను' అని నోటితో అనకుండా, ఆ 'బొమ్మకారే' తనకి చాలా ముఖ్యమైనట్టూ అదే తనకి ప్రాణమైనట్టూ దాన్ని గుండెలకి హత్తుకున్నాడు.

సుబ్బడికి ఆ బొమ్మకారు బహుమతిగా వచ్చింది. ఈ మధ్యనే వాడి బావ ఊరునుంచి వచ్చినప్పుడు ఆ బొమ్మకారు వాడికోసం తెచ్చాడు. ఆ కారునీ కారు తెచ్చిన బావనీ చూసి సుబ్బడు మురిసిపోయాడు. సంతోషంగా గంతులేస్తూ, స్నేహితుడు గోపాలం ఇంటికి పరిగెత్తాడు.

సుబ్బడూ గోపాలం మంచి స్నేహితులు. సుబ్బడు తండ్రీ, గోపాలం తండ్రీ ఒకే ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. వాళ్ళ ఇళ్ళు కొంచెం దూర దూరంగా ఉన్నా ఒకే వీధిలో ఉన్నాయి. సుబ్బడూ గోపాలం ఒకే స్కూల్లో, ఒకే క్లాసులో చదువుతున్నారు.

ఈ స్నేహితులిద్దరిలో – బటానీలు, పకోడీలు, గాలిపటాలు, పెన్సిళ్లు – ఇద్దరిలో ఎవరు కొనుక్కున్నా సరే రెండోవాడికి కూడా ఉన్నట్టే లెక్క.

మరి ఈ బొమ్మకారు సంగతి? ఆ కారును చూడగానే సుబ్బడెంత సంతోషించాడో గోపాలం కూడా అంత సంతోషించాడు. కారు చాలా బాగుంది. ఎర్రగా మెరుస్తూంది. సుబ్బడు 'కీ' ఇస్తే పరిగెడుతోంది. కాని, మచ్చుకి ఒక్కసారైనా సుబ్బడు, కారుని గోపాలం చేతికి ఇవ్వలేదు. 'ఇది నాది. దీన్ని నేనే వాడాలి' అనే గర్వం సుబ్బడిలో స్పష్టంగా కనిపిస్తోంది. అయినా సరే సహజమైన కుతూహలం అణుచుకోలేక "నేనొకసారి 'కీ' ఇస్తాను. కారు నాకివ్వరా" అన్నాడు గోపాలం. సుబ్బడు ఇవ్వలేదు. పైగా

"మరీ... మరీ... మా బావ కోప్పడతాడ్రా.." అనేశాడు.

గోపాలానికి అసహ్యం వేసింది. ఇన్నాళ్లూ ఏది కొనుక్కున్నా ఇద్దరూ పంచుకుని తినేవారు. ఇద్దరూ కలిసి ఉపయోగించుకునేవారు. మరి ఈ 'కారు' చేతులోకి రాగానే సుబ్బడు ఎందుకిలా మారిపోయాడో గోపాలానికి అర్థం కావటం లేదు.

సుబ్బడు ఇంటికి బయల్దేరాడు. ఇంతలో గోపాలం తమ్ముణ్ణి ఎత్తుకుని, గోపాలం తల్లి వాడికి ఎదురుగా వచ్చింది. నిజానికి గోపాలం తమ్ముడు సుబ్బడికి తమ్ముడే ఇన్నాళ్లూ. కాని ఇప్పుడో?

సుబ్బడి చేతుల్లో ఎర్రగా మెరుస్తున్న 'కారు' చూసి గోపాలం తమ్ముడు నవ్వుతూ వాడి మీదికి వాలాడు. పిల్లవాణ్ణి దింపి కింద కూర్చోబెడుతూ "సుబ్బడూ! ఆ బొమ్మ వీడికోసారి ఇవ్వరా" అన్నది గోపాలం తల్లి. ఆవిణ్ణి కాదనే ధైర్యం లేకపోయింది సుబ్బడికి.

"ఇదిగో కారు!" అంటూ కారును రెండు నిమిషాలు పిల్లాడి చేతుల్లో ఉంచక తప్పలేదు... తరువాత అది తీసుకొని వెళ్ళిపోయాడు సుబ్బడు. పసివాడు. "కారు.. కారు" అని ఏడవటం మొదలెట్టాడు.

తరవాత నాలుగు రోజులు సుబ్బడు గోపాలం ఇంటికి వెళ్ళలేదు. 'బొమ్మకారు' అడుగుతాడేమోనని స్కూల్లో కూడా గోపాలానికి దూరంగా వేరే సీట్లో కూర్చునేవాడు. ఒక రోజు స్కూలు నుంచి తిరిగి వస్తుంటే గోపాలం కలిశాడు. జేబులో బఠానీలు తీసి "తీసుకోరా" అన్నాడు సుబ్బడితో. "నాకొద్దురా" అని వెళ్ళిపోయాడు సుబ్బడు. బఠానీలు తీసుకుంటే, గోపాలం బొమ్మకారు అడుగుతాడేమోననే సుబ్బడు వద్దన్నాడు. కాని, గోపాలం పరిస్థితి అలా ధీమాగా వెళ్ళిపోయేటట్లు లేదు. ఇంటి దగ్గర తమ్ముడు పసివాడు ఆ బొమ్మకారు కోసం తెగ ఏడుస్తున్నాడు. "కారు కావాలి... బొమ్మకారు కావాలీ" అని ఒకటే ఏడుపు. ఆ కారు తన కోసం కాదు. తమ్ముడికోసం అడగాలి. తమ్ముడు అసలే జబ్బు పిల్లాడు. వాణ్ణి గురించి అమ్మానాన్న ఎప్పుడూ దిగులు పడుతూ ఉంటారు. పైగా కారు కోసం ఊరికే మారాం చేసి విసిగిస్తూంటే నాన్న తిట్టాడు. అమ్మ వాణ్ణి కొట్టింది కూడా. అయినా వాడు 'కారు కారు' అని ఏడుస్తూనే ఉన్నాడు. చివరికి అమ్మకి విసుగెత్తి.

"సుబ్బణ్ణి అడిగి ఆ కారు ఓ సారి తీసుకొచ్చి తమ్ముడి కియ్యరా... మళ్ళీ రేపు సుబ్బడి కిచ్చేద్దువుగాని" అన్నది.

అభిమానం, రోషం చంపుకుని గోపాలం సుబ్బడి ఇంటికి వెళ్ళాడు.

సుబ్బడి చేతుల్లో ఆ బొమ్మకారు ఉంది. అకస్మాత్తుగా వచ్చాడు గోపాలం. కారు ఇవ్వమని నోరు తెరిచి అడిగాడు. "తమ్ముడు కారు కావాలని తెగ ఏడుస్తున్నాడురా! అసలే వాడికి ఒంట్లో బాగాలేదు.. అమ్మ నిన్ను అడిగి ఈ కారు తెమ్మంది. మళ్ళీ రేపు తెచ్చి ఇచ్చేస్తాను."

గోపాలం అకస్మాత్తుగా వచ్చి అడిగేసరికి ఏం చెప్పలేక ఆ కారు పట్టుకొని అలాగే గోపాలంతో పాటు అమ్మవారి గుడిదగ్గర వేప చెట్టుదాకా వచ్చాడు.

× × ×

... అదే – ఆ అమ్మవారి గుడి దగ్గర వేప చెట్టుకిందే నించుని గోపాలం బతిమాలుతున్నట్టుగా సుబ్బణ్ణి మళ్ళీ అడిగాడు.

"ఏరా! కారు ఇయ్యవు కదూ?"

జవాబు చెప్పకుండా నించున్నాడు సుబ్బడు.

గోపాలం కోపంతో, బాధతో వణికి పోతున్నాడు. సుబ్బడు గుటకలు మింగుతున్నాడు. 'బొమ్మకారు' ఇవ్వాలనీ ఉంది... ఇవ్వటానికి ఇష్టం లేకుండానూ ఉంది.

"తమ్ముడు ఏడుస్తున్నాడు. అమ్మ అడగమంది. లేకపోతే ఎవడిక్కావాలి నీ వెధవ కారు?" అని రోషంగా అన్నాడు గోపాలం.

"అది కాదురా గోపాలం! ఎల్లుండి సాయంత్రం నేను తెచ్చి ఇస్తాలే. ఎల్లుండి మా అక్కా బావా ఊరెళ్ళిపోతారు. తరవాత.. తరవాత తెస్తారా!" నీళ్ళు నములుతూ అన్నాడు సుబ్బడు.





బొమ్మను ఇవ్వడానికీ, అక్కాబావా ఊరికెళ్ళడానికీ ఏం సంబంధమో గోపాలానికి అర్థం కాలేదు. ఇవ్వకుండా తప్పించుకోవడానికి సుబ్బడు ఆ సాకు చెప్పాడు. కోపంతో పళ్ళు బిగించాడు గోపాలం. రోషంతో బాధతో ఊగిపోతూ మరొక్కసారి అడిగాడు.

"ఇవ్వవు కదూ!"

సుబ్బడు తల వంచుకున్నాడు. తటపటాయిస్తున్నాడు. సెకండ్లు గడిచాయి. నిమిషాలు గడిచాయి. చివరికి ఏమనిపించిందో ఏమో, చప్పున తలెత్తి – "ఇందరా! – తీసుకో!" అన్నాడు. కాని… తీసుకోవడానికి గోపాలం అక్కడ లేడు. ఎప్పుడో వెళ్ళిపోయాడు.

సుబ్బడు మర్నాడు స్కూలుకి వెళ్లాడు. గోపాలం రాలేదు. క్లాసులో అటూ ఇటూ పచార్లు చేస్తున్న మాస్టారు సుబ్బణ్ణి చూసి "ఏరా సుబ్బారావు! ఏడిరా నీ నేస్తం"? అని అడిగాడు. సుబ్బడికి తెలీదు.

"కలిసి రావటం మానేశారేంరా?"

సుబ్బడు మాట్లాడలేదు.

"దెబ్బలాడుకున్నారా?"

"లేదండీ" అనేశాడే కాని, సుబ్బడి మనస్సులో చాలా బాధగా ఉంది – గోపాలం ఎందుకు రాలేదో అని. రెండో రోజు కూడా గోపాలం బడికి రానేలేదు.

సాయంకాలం స్కూలు వదిలాక అయిదున్నర గంటలకి బొమ్మకారు తీసుకొని సుబ్బడు, గోపాలం ఇంటికి వెళ్ళాడు.

గోపాలం ఇంటి ముందు నాలుగురైదుగురు పిల్లలు నించుని లోపలికి తొంగి తొంగి చూస్తూ ఏదో గుస గుసలాడుతున్నారు. వాళ్ళకి ఆ ఇంట్లోకి వెళ్ళాలని ఉన్నట్టుగా, అయినా ఎందుకో భయపడుతున్నట్టుగా ఉన్నారు. వాళ్ళ చూపులూ గుసగుసలూ వాళ్ళ ప్రవర్తనా చూస్తే సుబ్బడికి కూడా ఎందుకో భయమేసింది.

"ఏరా ఏమిటలా తొంగి చూస్తున్నారు?" ఏమైంది? అని అడిగాడు కొంచెం జంకుతూనే.

పిల్లలందరూ సుబ్బడి వంక ఆశ్చర్యంగా చూశారు.

"నీకు తెలీదా"? అని అడిగాడు ఒకడు. ఏదో ప్రమాదకరమైన సంగతి చెప్పబోతున్న ఆదుర్దా, బాధా కనిపించింది వాళ్ళ ముఖాల్లో. వాళ్లేదో చెపుతున్నారు కూడా. కాని ఆ మాటలు సుబ్బడికి వినిపించలేదు. వాడు కంగారుగా గడపదాటి లోపలికి దూకాడు.

ముందు గదిలో గోడవారగా తడిసి ఎండిన చాపమీద తలకింద చెయ్యి పెట్టుకుని ఒక పక్కకి తిరిగి పడుకుంది గోపాలం తల్లి. ఒక ముసలావిడా ఒక నడివయస్సు మనిషి ఆమె దగ్గర దిగాలుపడి కూర్చుని ఏదో చెపుతున్నారు.

గుమ్మంలో నుంచే అదంతా చూస్తూ వెనక గదిలోకి వెళ్ళాడు సుబ్బడు. అక్కడ గోపాలం గోడకి ఆనుకొని కూర్చుని మోకాళ్ళ మీద చేతులుంచుకొని, చేతులమీద తల ఆనించి ఎటో దిగులుగా చూస్తున్నాడు.

సుబ్బడు చటుక్కున గోపాలం దగ్గరికి వెళ్ళి–

"గోపాలం! ఇదుగోరా 'కారు'! తీసుకోరా! అచ్చంగా అచ్చంగా నువ్వే తీసుకోరా!.. నాకొద్దురా!" అంటూ చెయ్యి జాచి ఇవ్వబోయాడు. గోపాలం తలెత్తి సుబ్బడి కళ్ళల్లోకి చూస్తూ –

"నాకెందుకురా కారు?… "కారు కావాలీ" అని ఏడ్చిన తమ్ముడు అన్నీ వదిలి, అందర్నీ వదిలి, ఈ లోకం వదిలి వెళ్ళిపోయాడ్రా!" అని పొంగి వస్తున్న ఏడుపుని అణుచుకుంటూ మోకాళ్ళ మధ్య ముఖం దాచుకున్నాడు. తన చేతుల్లో ఉన్న కారుని దూరంగా పారేసి "గోపాలం!… గోపాలం!" అంటూ సుబ్బడు – గోపాలాన్ని కౌగిలించుకుని భోరున ఏడ్చాడు.

– రాచకొండ విశ్వనాథ శాస్త్రి

(ఫిబ్రవరి 1991 బాలచెలిమి – పిల్లల మాసపత్రిక సౌజన్యంతో)

# MNR EDUCATIONAL TRUST

# 2-23 B / 350, Bhagyanagar (Phase III), Near HMT Hills, Opp : JNTU Kukatpally, Hyderabad – 500 072,
Ph : +91-40 - 23890835, 23899795, Fax : +91-40 -23897380

## MNR HIGHER EDUCATION CAMPUS

MNR Nagar, Narsapur Road, Sangareddy,Gr. Hyderabad - 502 294, A.P.
Cell : (0) 99597 36679, (0) 99662 33332, (08455) 230524, 230525.
E-mail : info@mnrindia.org website : mnrindia.org

*Enriching Lives Through Education & Health ...*



MEDICAL
DENTAL
AYURVEDA
PHARMACY
NURSING
ENGINEERING
PHYSIOTHERAPY
EDUCATION
ARTS & SCIENCE
SCHOOLS

♦ 42 Top Grade Institutions ♦ 35 Years Track Record ♦ 42000 Students ♦ 1800 Faculty Members

**MNR EDUCATIONAL TRUST** established in 1974 at Hyderabad is a leading education power house in South India. The Trust governs 42 Institutions with 42,000 students & 1800 teaching staff in its various institutions. MNR Educational Trust offers courses ranging from Primary education to Graduation / Post – Graduation & Research.



## Facilities

- 110 acres Lushgreen campus
- Central Library
- Separate Hostels for Boys & Girls
- Virtual Class rooms
- Outdoor & Indoor Sports
- Well connected by Air, Rail and Road
- Airport pick-up on request
- Separate & Secured (A/c, Non-A/c) hostels for Boys & Girls
- Wi-fi Internet Facility on campus
- Frequent Academic updation to Parent
- Modern Mess/Canteen facility serving delicious food
- Sports Complex with GYM, Indoor & Outdoor games
- Super Market & Canteen Facility
- 24 Hrs. Medical Facility in campus
- ATM Banking Facility
- Digital Classrooms

## 42 top Grade Institutions

- MNR Medical College
- MNR Dental College
- MNR Ayurveda Medical College
- MNR College of Physiotherapy
- MNR Master of Science (Medical) College
- MNR Institute of Paramedicals
- MNR College of Nursing
- MNR School of Nursing
- MNR College of Pharmacy
- MNR College of Engineering & Tech.
- MNR PG Teacher Education Colleges (M.Ed)
- MNR Teacher Education Colleges (B.Ed)
- MNR Elementary Teacher Education Colleges (D.Ed)
- MNR Rural PG College of Education (M.Ed)
- MNR TPT Teacher Education Colleges
- MNR Degree Colleges
- MNR Junior Colleges
- MNR Residential Junior Colleges
- MNR Residential Schools
- MNR Group of Schools



M N Raju
Chairman





M. Ravi Varma
Director.

DECCAN LAND, Telugu Monthly Magazine Date of Publication 1st - June - 2021,
ISSN 2581-3188 Postal Dates: 28th & 29th Every Month
RNI Regn. No. APTEL/2012/46784
Postal Regn.No.HCD/1167/2021-2023

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, 1-9-1126/B, Azamabad, Hyderabad-500020, Telangana,
Published at CHANDRAM, 3-6-712/2, St.No.11, Himayatnagar, Hyderabad-500029, Telangana, Editor Manikonda Vedakumar